

చదువు
రూ॥ 180/-
పేజీలు: 210
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


రష్యా చమురుపై ఇయు ఆంక్షలు భారత్‌పై నిష్ఫలమా?

ఉక్రేన్ జైలుపై రష్యా దాడి

గాజాలో యుద్ధం ఆపి ఆహారం ఇవ్వండి

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 239 | బుధవారం | 30-07-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

ఆపరేషన్ సింధూర్‌ను ఆపమని

# ప్రపంచంలో ఏ నాయకుడూ అడగలేదు

లోక్‌సభలో పహల్గామ్, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ప్రధాని సమాధానం

## యుద్ధం ఆపానన్న ట్రంప్ ప్రకటనల ఊసెత్తని మోదీ

నిఘా వైఫల్యంపై సమాధానం దాటవేత



**న్యూఢిల్లీ:** భారత్‌–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తానే చేశానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదే పదే ప్రకటనను ఎందుకు ఖండించలేదని పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేరుగా స్పందించలేదు. ఆపరేషన్ సింధూర్‌ను ఆపమని ప్రపంచంలో ఏ నాయకుడూ మనదేశాన్ని అడగలేదని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభలో మంగళవారంనాడు చేసిన సుదీర్ఘ ప్రసంగంలో ఎక్కడా ట్రంప్ పేరెత్తకపోవడమే కాకుండా పహల్గామ్ ఉగ్రదాడిలో నిఘా వైఫల్యం, ఏ ఒక్కదేశం భారతదేశానికి అనుకూలంగా పాకిస్థాన్ పాత్రను ఖండించకపోవడం వంటి విపక్ష సభ్యులు వేసిన ప్రశ్నలకు మోదీ సమాధానాలు దాటవేశారు. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి, ఆపరేషన్ సింధూర్‌పై రెండు రోజులు జరిగిన చర్చపై ప్రధానమంత్రి సమాధానం ఇస్తూ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మనదేశాన్ని మనం రక్షించుకోవడానికి చర్యలు తీసుకోకుండా ప్రపంచంలో ఏ దేశమూ మనల్ని అడ్డుకోలేదని చెప్పారు. ఏ నాయకుడూ భారత్‌ను ప్రశ్నించలేదనీ, ఆపరేషన్ సిందూర్‌కు యావత్ ప్రపంచం నుండి మద్దతు లభించినప్పటికీ, దేశంలో కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం దేశ సైనికుల శౌర్యపరాక్రమాల

తరువాయి 2లో

సాయుధ దళాల

# చేతులు కట్టేశారు

వారికి మద్దతివ్వడంలో కేంద్ర ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం లేదు

## మోదీకి ధైర్యముంటే ట్రంప్ అబద్ధాలకోరు అని చెప్పాలి

లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారత సాయుధ దళాలకు మద్దతు ఇవ్వడంలో ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం లేదని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. పాకిస్థాన్‌లోని సైనిక , వైమానిక రక్షణ మౌలిక సదుపాయాలపై దాడి చేయకూడదని రాజకీయ నాయకత్వం సాయుధ దళాల చేతులను కట్టేయడం వల్లే విమానాలు కోల్పోయాయని ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన సున్నితమైన వివరాలను పాకిస్థాన్‌కు కేంద్రం వెల్లడించిందని ఆరోపించారు. నాడు పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో నాటి అమెరికా అధ్యక్షుడు నిక్సన్ బెదిరింపులకు ప్రధాని ఇందిరాగాంధీ లొంగలేదని గుర్తు చేశారు. ఆమె ధైర్యంలో 50 శాతం ఉన్నా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అబద్ధాల కోరు అని, కాల్పుల విరమణ నీవు జరిపించలేదని ఇప్పటికైనా సభలో ప్రధాని మోదీ ధైర్యంగా చెప్పాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో మంగళవారం పహల్గామ్, ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొన్నారు. రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్ తెల్లవారుజామున 1:05 గంటలకు ప్రారంభమైందని, 1:35 గంటలకు భారతదేశం సైనికేతర లక్ష్యాలపై దాడి పూర్తి చేసిందని, వెంటనే పాకిస్థాన్‌కు

తరువాయి 2లో



# హైదరాబాద్ పర్యావరణహితం

- మహానగరాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యం
- పాతికేళ్ల అవసరాలకు తగినట్లు ప్రణాళికలు
- ఫోర్త్ సిటీలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఒఆర్ఆర్ బయటికి తరలించాలి
- మెట్రో పనులు వేగవంతం చేయాలి
- నగరానికి ఐకానిక్‌గా మూసీ అభివృద్ధి ఉండాలి
- ఎంఎయుడి సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నగరాన్ని పర్యావరణహితంగా మార్చాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. విపరీతమైన కాలుష్యంతో ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అటువంటి పరిస్థితి హైదరాబాద్ నగరంలో తలెత్తకూడదన్నారు. కోర్ సిటీలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించాలని సిఎం ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై సిఎం రేవంత్‌రెడ్డి మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు, రానున్న 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలని సిఎం అధికారులకు సూచించారు. ఇందుకు కోసం ఢిల్లీ, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకు సమగ్ర డిపిఆర్‌లు తయారు చేయాలని సిఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, నిర్మాణ రంగ వ్యర్థాలను సిటీలో ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా చూడాలని సిఎం ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో మంచి నీటి సరఫరా, మురుగు నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా హైదరాబాద్ నగర మంచినీటి సరఫరా, సీవరేజీ బోర్డు

తరువాయి 2లో

## పహల్గామ్ ఉగ్రవాదులను మట్టుబెట్టాం

లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన



**న్యూఢిల్లీ :** పహల్గామ్ మారణహోమం జరిపిన ముగ్గురు ఉగ్రవాదులను ఆర్మీ, సిఆర్‌పిఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా శ్రీనగర్‌కు సమీపంలో జరిపిన ఆపరేషన్‌లో మట్టుబెట్టినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం లోక్‌సభలో ప్రకటన చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చ సందర్భంలో ఆయన 'ఆపరేషన్ మహాదేవ్' వివరాలను వెల్లడించారు. హతమైన ఉగ్రవాదులను సులేమాన్ అలియాస్ ఫైజల్, అఫ్ఘాని, జిబ్రాన్‌లుగా గుర్తించినట్లు వెల్లడించారు. సులేమాన్ లష్కర్‌–ఎ–తైబాకు చెందిన ఎ కేటగిరీ కమాండర్ కాగా, అఫ్ఘాని కూడా ఎ కేటగిరీ ఎల్ ఇ టి

తరువాయి 2లో



## భద్రతా లోపాలకు అమిత్ షాదే బాధ్యత

రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లిఖార్జున్ ఖర్గే విమర్శ

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడికి దారితీసిన భద్రతా వైఫల్యానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని, కచ్చితంగా జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లిఖార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. హోం మంత్రి తప్పిదాన్ని దాచేందుకు, ఆయనను కాపాడేందుకు జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పెహల్గామ్ దాడిని ఆపడంలో వైఫల్యం బాధ్యతను తనపై వేసుకున్నారని తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో

తరువాయి 2లో

ట్రంప్ ప్రకటనపై ఎందుకు

## మోదీ స్పందించలేదు?

లోక్‌సభ చర్చలో సిపిఐ ఎంపి సుబ్బరాయన్



**న్యూఢిల్లీ :** తానే భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 సార్లు చెప్పినా, ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కసారి కూడా ఎందుకు స్పందించలేదని సిపిఐ లోక్‌సభ సభ్యుడు కె.సుబ్బరాయన్ ప్రశ్నించారు. అమెరికా అంటే ఎందుకు భయపడుతున్నారని అన్నారు. లోక్‌సభలో పహల్గామ్, ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొంటూ గడచిన పదకొండు సంవత్సరాల అనుభవంలో ఈ ప్రభుత్వం తమ ఘనత అని చెప్పుకునేందుకు ఏమి లేదని నిరూపించుకుందని ఎద్దేవా చేశారు. ఆర్టికల్ 371 తొలగించిన తరువాత కశ్మీర్ ఉగ్రవాద చర్యల నుంచి విముక్తి

తరువాయి 2లో



## నాగార్జునసాగర్

# క్రస్ట్ గేట్లు ఓపెన్

- 26 గేట్లు ఎత్తడంతో దిగువకు పరుగెడుతున్న కృష్ణమ్మ
- 18 ఏళ్ల తర్వాత జూలైలోనే పరవళ్ళు
- కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేసిన మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/నల్లగొండ

నాగార్జున సాగర్ క్రస్ట్ గేట్లు 18 ఏళ్ల తర్వాత తొలిసారిగా జులైలో ఎత్తి నీటిని దిగువకు వదిలారు. మంగళవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ దివంగత ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని ప్రాజెక్టులను ఆధునికరిస్తాము పూడిక

తరువాయి 12లో

అసెంబ్లీ ఎన్నికల నాటికి

# బలోపేతమవుదాం





- స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలి
- కార్యకర్తలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపు
- యాదాద్రి జిల్లా సిపిఐ నాలుగో మహాసభలు ప్రారంభం

ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి

పార్లమెంటు, శాసనసభ ఎన్నికలకు మరో మూడేళ్ల సమయముందని, అప్పటిలోగా రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అందుకు ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించి, ప్రజలను ఉద్యమాల్లో మమేకం చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కమ్యూనిస్టులు ఏకం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో మంగళవారం జరిగిన సిపిఐ జిల్లా నాలుగవ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రతినిధుల సభలో కూనంనేని ప్రసంగిస్తూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన ఉద్యమాల జిల్లా ఉమ్మడి నల్లగొండను ఎర్రగొండగా మార్చేందుకు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మతం సెంటిమెంటుతో ప్రజల మధ్యన విద్వేషాలను రెచ్చగొడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొడుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్‌తో రాజకీయ పొత్తు ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై పాలకులను

తరువాయి 12లో

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు

## దొడ్డ పద్మ మృతి

ప్రజాపక్షం/సూర్యాపేట /హైదరాబాద్



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దొడ్డ నర్సయ్య సతీమణి దొడ్డ పద్మ (99) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఐదురోజుల క్రితం సూర్యాపేట జిల్లా చిలుకూరులోని ఆమె నివాసంలో కిందపడటంతో కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతూ మరణించారు. ఆమెకు ఒక కుమార్తె ఉన్నారు. దొడ్డ పద్మ అంత్యక్రియలు స్వగ్రామమైన చిలుకూరులో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గన్నవరం సమీపంలోని బుద్దవరం గ్రామానికి చెందిన కాట్రగడ్డ రంగయ్య–అన్నపూర్ణమ్మలకు నాలుగో సంతానంగా దొడ్డ పద్మ జన్మించారు. వారి కుటుంబం కృష్ణాజిల్లా తిరువూరు తాలుకా ఖమ్మంపాడు మండలం అట్లప్రగడ గ్రామానికి వలస వచ్చింది. ఆమె తెలంగాణ సాయుధ పోరాటానికి ఆకర్షితులయ్యారు. ఉద్యమంలోనే దొడ్డ నర్సయ్యకు పద్మ పరిచయం కావడంతో పార్టీ పెద్దల సమక్షంలో ఒక్కటయ్యారు. 1985 నుండి1995 వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలుగా, రాష్ట్ర కమిటీ

తరువాయి 2లో




మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే

## చట్ట ప్రకారం చర్యలు

03

# హన్మకొండను వరంగల్‌లో కలపండి




- ఉమ్మడి జిల్లాను ఆరు ముక్కలు చేయడంపై నిరసన
- ఉద్యమానికి సిద్ధమంటున్న పార్టీలు, ప్రజాసంఘాలు

ప్రజాపక్షం/హనుమకొండ

రాష్ట్రంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనపై నేటికీ అసంతృప్తి వ్యక్తం అవుతూనే ఉంది. ముఖ్యంగా చారిత్రక నేపథ్యం కలిగిన వరంగల్ జిల్లాను అశాస్త్రీయంగా ఆరు ముక్కలు చేయడంపై మొదటి నుండి ఉమ్మడి జిల్లా ప్రజలు వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. తాజాగా మరోసారి మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీలు సమావేశాలు, చర్చా గోష్ఠిలతో జిల్లాల విభజన అంశాన్ని తెరమీదకు తెచ్చాయి. విస్తీర్ణం, జనాభాలో చిన్న జిల్లా అయిన ఉమ్మడి వరంగల్‌ను విభజించిన తీరుపైనే వీరు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఇతర ఉమ్మడి జిల్లాల పరిధి పెద్దగా ఉన్నప్పటికీ ఎక్కడా కూడా మూడు, నాలుగు జిల్లాల కంటే ఎక్కువగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేయకపోవడం, ఒక్క వరంగల్‌ను మాత్రమే ఆరు ముక్కలు చేయడంపై ఇక్కడి పార్టీల, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత అతి పెద్ద నగరంగా ఉన్న గ్రేటర్ వరంగల్‌ను రెండు జిల్లాలుగా చేయడంపై ప్రజలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలా తెలంగాణలో ఏ నగరాన్ని రెండు జిల్లాలుగా విభజించలేదు. నల్లగొండ, కరీంనగర్. ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ తదితర ఉమ్మడి జిల్లాల్లో కూడా కొత్త జిల్లాలను విభజించారు. కానీ, ఆయా నగరాలను మాత్రం ఎక్కడా రెండు ముక్కలు చేయలేదు. గ్రేటర్ వరంగల్‌ను రెండు జిల్లాలుగా విభజించడం వల్ల పరిపాలనా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయంటున్నారు. పోలీస్, ఎడ్యుకేషన్, రెవెన్యూ ఎండోమెంట్, మున్సిపాలిటీ, మెడికల్ తదితర విభాగాలన్నీ వేరు వేరు జిల్లాల్లో ఉండడం వల్ల రాబోయే రోజుల్లో


తరువాయి 12లో

సామూహికంగా ఓట్ల తొలగింపు ఉంటే...

## 'మా జోక్యం తథ్యం'

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా 'ఎస్ఐఆర్'పై సుప్రీంకోర్టు

పిటిషన్లను ఆగస్టు 12, 13 తేదీలలో విచారిస్తామని ధర్మాసనం వెల్లడి




**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం (ఇసి) ఒక రాజ్యాంగ సంస్థ అని , అది చట్టప్రకారం పనిచేస్తుందని భావించబడుతుందని మంగళవారం సుప్రీంకోర్టు పేర్కొంది. బిహార్ రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)లో ఒకవేళ సామూహికంగా ఓట్లు తొలగింపు ఉంటే అత్యున్నత న్యాయస్థానం తప్పక జోక్యం చేసుకుంటుందని స్పష్టంచేసింది. బిహార్‌లో ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల జాబితాను పరిశీలించడానికి న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చీ ధర్మాసనం ఒక కాలక్రమాన్ని (టైమ్‌లైన్) ఖరారుచేసింది. దీనిపై ఆగస్టు 12, ఆగస్టు 13తేదీలలో విచారణ చేపడతామని

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## న్యూయార్క్‌లో కాల్పులు:ఐదుగురు మృతి

**న్యూయార్క్:** న్యూయార్క్ నగరంలో అత్యంత జనసాంద్రతగల మన్‌హటన్ డౌన్‌టౌన్‌లో ప్రముఖులు, సంపన్నుల నివాసాలు, కొన్ని కార్యాలయాలు ఉండే ఆకాశహర్మ్యాల భవంతుల్లోకి చొరబడిన ఒక గన్‌మెన్ నలుగురిని కాల్చి చంపాడు. ఈ ఘటనలో ఒక పోలీసు అధికారి కూడా మరణించారు. తర్వాత గన్‌మెన్ తనను తాను కాల్చుకుని మరణించాడు. కాల్పులు దాడికి పాల్పడిన యువకుణ్ణి లాస్‌వేగాస్‌కు చెందిన షేన్ తమురా (27)గా పోలీసులు గుర్తించారు. మన్‌హట్టన్‌లోని పార్క్ ఎవెన్యూ ఆఫీసులోకి గన్‌మన్ చాలా హుందాగా నడుచుకుంటూ వెళ్లాడు. లాబీలో ఉన్నవారిపై ఇష్టానుసారంగా కాల్పులు జరిపి ఆ తర్వాత 33వ ఫ్లోర్‌లోకి ప్రవేశించాడు. ఈ కాల్పుల్లో న్యూయార్క్ సిటీ పోలీసు అధికారి దిదారుల్ ఇస్లామ్ (36) మరణించాడు. గన్‌మెన్ కాల్పులు జరిపిన సమయంలో పార్క్ ఎవెన్యూ వద్ద ఇస్లామ్ భద్రతా విధులు నిర్వహిస్తున్నారు. కాగా దిదారుల్ ఇస్లాం ఇప్పుడు ఒక హీరోగా మారారు. కాల్పులు జరుపుతున్న దుండగుడి బారి నుండి అక్కడివారిని కాపాడేందుకు దిదారుల్ ఇస్లాం వీరోచితంగా పోరాడాడు. తనకు చేతనైనంతవరకూ అందరినీ కాపాడే ప్రయత్నం చేసి మృతులసంఖ్యను గణనీయంగా తగ్గించాడు.

# ఉక్రేన్ జైలుపై రష్యా దాడి



## 22 మంది మృతి

**కీవ్:** ఉక్రేన్‌పై రష్యా మంగళవారం తెల్లవారకముందే దాడులు చేసింది. 73 నగరాలు, పట్టణాలు, గ్రామాలపై జరిగిన క్షిపణి దాడుల్లో 22 మంది మరణించగా, 80 మంది గాయపడ్డారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఒకవైపు చాలారోజులుగా శాంతి చర్చల యత్నాలతో యుద్ధ ముగింపు చర్యలు కొనసాగుతుండగా, ఉద్దేశపూర్వకంగా రష్యా ఈ దాడులు చేసిందని జెలెన్‌స్కీ విమర్శించారు. శక్తిమంతమైన గ్లైడర్ బాంబులతో గగనతల దాడులు చేసింది. ఆగ్నేయ ఉక్రేన్‌లోని యుద్ధప్రాంతంలో ఉన్న ఒక జైలుపై రష్యా గగన తల దాడులు చేసింది. ఈ దాడుల్లో జైలులో ఉన్న 17 మంది మరణించారు. మరో 42 మంది ఖైదీలు,సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. సెంట్రల్ ఉక్రేన్ రీజియన్ డ్నిప్రోలో మూడు అంతస్తుల భవనం క్షిపణి దాడిలో ధ్వంసమైంది. ఈ సమీపంలో ఉన్న వైద్యకేంద్రం, ప్రసూతి ఆసుపత్రి కూడా ధ్వంసమయ్యాయి. జెపోరిఝియా ప్రాంతంపై కూడా రాత్రికి రాత్రి జరిగిన దాడుల్లో ఆ పరిసర ప్రాంతాల్లోని ఇళ్ళు ధ్వంసమయ్యాయని రీజినల్ లీడర్ ఇవాన్ ఫెడోరోవ్ చెప్పారు. ఉక్రేన్‌కు తూర్పువైపు ఉన్న నాలుగు ప్రాంతాలలో జెపోరిఝియా కూడా ఒకటి. 2022 లో ప్రారంభమైన యుద్ధంలో ఈ ప్రాంతాన్ని తాము ఆక్రమించామని రష్యా చెబుతున్నప్పటికీ చాలా వరకూ ఎక్కువ భూభాగం ఉక్రేన్ స్వాధీనంలోనే ఉంది. యుద్ధం మొదలైనప్పటినుండీ రష్యా ఎక్కువగా జెపోరిఝియా ప్రాంతంపైనే యుద్ధ దాడులు చేస్తున్నది. బిలెంకే పెనిటెన్షియరీ భవంపై బాంబుదాడులు చేయడంతో జైలులో ఉన్న డైనింగ్ హాలు, ఇతర ప్రాంతాలు ధ్వంసమయ్యాయి. జైలులో ఉన్నవారు మరణించారు. ఈ విధంగా జైలుపై దాడి చేయడం అమానుషం, మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని ఉక్రేన్ మానవహక్కుల కమిషనర్ హెచ్చరించారు.

### ట్రంప్-పుతిన్ ముఖాముఖీ ప్రస్తుత ఎజెండాలో లేదు:పెస్కోవ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తమ అధ్యక్షుడు పుతిన్ మధ్య ముఖాముఖీ చర్చల ప్రక్రియ ప్రస్తుత క్రియాశీల ఎజెండాలో లేదని రష్యా ప్రధాన కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ అన్నారు. ఆయనకు మాతో మాట్లాడే ఆసక్తి లేదని కూడా పెస్కోవ్ విమర్శించారు. ట్రంప్ కొత్తగా విధించిన 12 రోజుల గడువు గురించి తమకు తెలుసునని, అన్నీ తాము గమనిస్తున్నామని మంగళవారంనాడు పెస్కోవ్ టాస్ వార్తాసంస్థతో చెప్పారు. వీలైనంతవరకూ ట్రంప్ వ్యాఖ్యలకు దూరంగా ఉండాలనుకుంటున్నామన్నారు. అదేవిధంగా, అమెరికాతో సాధారణ సంబంధాల పునరుద్ధరణకు రష్యా సిద్ధంగా ఉందని పెస్కోవ్ చెప్పారు. ఈ సంబంధాలు సాధారణస్థాయికి తిరిగిరావాలంటే రెండు వైపుల నుండి చొరవ చూపించాల్సిన అవసరం ఉందని అన్నారు. ‘‘అందుకు మేం కట్టుబడే ఉన్నాం, ముమ్మర ప్రయత్నం చేస్తాం, కానీ రెండు వైపుల నుండి తగిన కృషి జరగాల్సి ఉంటుంది’’ అన్నారు. యాభై రోజుల్లో ఉక్రేన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని, లేకపోతే రష్యాపై తీవ్రమైన ఆంక్షలతోపాటు దాని వాణిజ్య భాగస్వామ్య దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ రెండు వారాలక్రితం బెదిరించారు. ఇప్పుడు ఈ గడువును పది నుండి పన్నెండు రోజులకు తగ్గించారు.

### రెండు వారాల గడువుపై హర్షం ప్రకటించిన జెలెన్‌స్కీ



యాభైరోజుల్లో ఉక్రేన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలని రెండు వారాలక్రితం షరతు విధించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా సోమవారం రాత్రి బ్రిటన్‌లోని స్కాట్‌లాండ్ లగ్జరీ రిసార్టులో బసచేసిన సందర్భంగా, రెండు వారాల్లోపు ఉక్రేన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలని గడువు విధించారు. ఆగస్టు 9వ తేదీ లోపు పుతిన్ ఒప్పందం చేసుకోకపోతే, రష్యాపై తీవ్ర ఆంక్షలు విధిస్తామని, ఆ దేశంతో వ్యాపారం చే సే దేశాలపై కూడా భారీ ఎత్తున సుంకాల భారా లు వేస్తామని హెచ్చరిక చేశారు. ఈ కొత్త షరతు పై అధికారికంగా ఒక ప్రకటన చేస్తానని కూడా ఆయన అన్నారు. ట్రంప్ చేసిన ఈ తాజా ప్రకటనపై జెలెన్‌స్కీ హర్షం వ్యక్తం చేశారు. నిజానికి పుతిన్ ప్ర పంచదేశాల సమయాన్ని వృథా చేస్తున్నారని, స మస్య పరిష్కరించకుండా తమ దేశంపై దాడు లు కొనసాగిస్తూ, తాత్కారం చేస్తున్నారని, యుద్ధా న్ని పొడిగించి సమస్య తీవ్రత పెంచుతున్నారనీ జెలెన్‌స్కీ విమర్శించారు.

# గాజాలో యుద్ధం ఆపి ఆహారం ఇవ్వండి

పాలస్తీనా మనుగడకు స్వయం ప్రతిపత్తి పరిష్కారం
పాలస్తీనాపై ఐక్యరాజ్యసమితి సదస్సు డిమాండ్
ఇదంతా ఓ పబ్లిక్ స్టంట్: ట్రంప్ ఎద్దేవా





**టర్న్‌బెర్రీ:**రెండు దేశాలుగా ఇజ్రాయెల్-పాలస్తీనా శాంతియుతంగా మనగడ సాగించేందుకు ప్రపంచ దేశాలు కృషి చేయాలని, పాలస్తీనాకు స్వయంప్రతిపత్తి ఒక్కటే పశ్చిమాసియాలో సంక్షోభానికి పరిష్కారమని ఐక్యరాజ్య సమితి సదస్సు పిలుపు ఇచ్చింది. గాజాలో తక్షణం యుద్ధం ఆపి, ప్రజలకు ప్రాణ రక్షణ కల్పించాలని, కరువు పరిస్థితుల నుండి పాలస్తీనా ప్రజలను బయటపడేసేందుకు ఆహార సరఫరాలను భారీ ఎత్తున పెంచాలని సదస్సు పిలుపు ఇచ్చింది. రెండు దేశాలుగా దాయాదులు మనుగడ సాగించడంతప్ప పశ్చిమ ఆసియాలో ఇజ్రాయెల్-పాలస్తీనాలకు మరో మార్గం లేదని ఫ్రాన్స్,బ్రిటన్ సహా పలు దేశాల ప్రతినిధులు ఎతుగెత్తి చాటారు. ఫ్రాన్స్-సౌదీ అరేబియా దేశాల ప్రోద్బలంతో ఐక్యరాజ్యసమితి విజయవంతంగాఈ సదస్సు నిర్వహించింది.

పాలస్తీనా అథారిటీ ప్రధానమంత్రి మహ్మద్ ముస్తాఫా,సౌదీఅరేబియా విదేశాంగమంత్రి ఫైజల్ బిన్ ఫర్హాన్ అల్‌సౌద్, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్, ఫ్రాన్స్ విదేశాంగమంత్రి జీన్ నోయల్ బారోట్ తదితర ప్రముఖులు సదస్సు నిర్వహణలో ప్రముఖపాత్ర వహించారు. ఇక పాలస్తీనాలో పరిస్థితులను క్షీణదశకు వెళ్ళకుండా చూస్తామని ఆంటోనీ గుటెర్రెస్ అన్నారు. సెప్టెంబరునెలలో పాలస్తీనాను ఒక స్వయంప్రతిపత్తిగల స్వతంత్ర దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ సదస్సుకు కొద్దిరోజులు ముందుగా ప్రకటించారు. తాము కూడా ఫ్రాన్స్ అడుగుజాడల్లోనే నడుస్తామని పాలస్తీనాకు గుర్తింపు ఇస్తామని లగ్జెంబర్గ్ దేశం కూడా ప్రకటించింది. ఐతే ఈ ప్రకటనలను అమెరికా-ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకించాయి. అలాంటి ప్రకటన చేస్తే ఒక ఉగ్రవాద దేశాన్ని పెంచిపోషించినట్లే కాగలదని నేతన్యాహూ విమర్శించారు. పాలస్తీనా స్వతంత్ర్యరాజ్యాన్ని గుర్తించే విషయంపై ఐక్యరాజ్యసమితి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సదస్సును ‘‘ఒక పబ్లిక్ స్టంట్’’ (ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం)గా డోనాల్డ్ ట్రంప్ ఎగతాళి చేశారు. ఈ సదస్సును అమెరికా-ఇజ్రాయెల్ దేశాలు రెండూ బహిష్కరించాయి.

### గాజాలో అమెరికా ఫుడ్ సెంటర్లు:ట్రంప్

పాలస్తీనాను ధ్వంసం చేసేందుకు అన్నిరకాల మా ర్గాలను అనుసరిస్తున్న ట్రంప్‌మరోవైపు ప్రపంచం ఒత్తిడిని తట్టుకోలేక గాజాలో అమెరికా ఫుడ్ సెంట ర్లు నిర్వహిస్తుందని ప్రకటించారు. యుద్ధంతో అలతాకుతలమవుతున్న గాజాలో ప్రజల ఆకలి బా ధలు తీర్చేందుకు ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తామని స్కాట్‌లాండ్ పర్యటన సందర్భంగా చెప్పారు. ప్ర జలు ఎవ్వరైనా ఈ ఫుడ్ సెంటర్లకు వెళ్ళి కడుపునిండుగా తినవచ్చునన్నారు. ఈ ఫుడ్ సెంటర్లలో తినడానికి ఎలాంటి సరిహద్దు ఆంక్షలూ లేవని చె ప్పారు. ఇప్పటికే గాజాలోకి కొన్ని దేశాలు గగనతలమార్గంలో, భూమార్గంలో ఆహార సరఫరాలను పెంచాయి. ఒక ప్రముఖ అంతర్జాతీయ సంస్థ సర్వే ప్రకారం, గాజాలో మంగళవారంనాటికి తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎంతగా ఆహారసరఫరాలు పెంచినాగానీ, లక్షమంది స్త్రీలు, పిల్లలకు తక్షణం పోషకాహారం సరఫరా చేయాల్సిన అవస రం ఉందని పేర్కొంది. ఇప్పటికే గాజాలో 88 మం ది పిల్లలు సహా 147 మంది పస్తులతో మరణించా రు. ఇరవైనాలుగు గంటల్లో ఇజ్రాయెల్ చేసిన దా డుల్లో 92 మంది మరణించారు. ఆహార కేంద్రాలవ ద్ద జరిగిన కాల్పుల్లో 41 మంది మరణించారు. మే నెల నుండీ ఇప్పటివరకూ ఆహార కేంద్రాలవద్ద ప్ర జలపై ఇజ్రాయెల్ జరిపిన కాల్పుల్లో 1,157 మంది మరణించారు.

# ఉత్తర చైనాలో వరదలు:34 మంది మృతి



**బీజింగ్:** ఉత్తర చైనా ప్రాంతాన్ని వరదలు ముంచెత్తుతున్నాయి. ఈ వరదల్లో ఇప్పటివరకూ 34 మం ది మరణించారు. మరో 88,000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ సహాయసిబ్బంది పెద్దసంఖ్యలో రంగంలోకి దిగారు.రోడ్లు ధ్వంసమయ్యాయి. నివాసిత ప్రాంతాలు కాలువల్లా మారాయి. విద్యుత్ సరఫరా స్తంభించింది. దీంతో ఆ ప్రాంత ప్రజలను మరోచోటకు తరలించారు. ఉత్తర పర్వతజిల్లాలలో ఎక్కువగా మరణాలు సంభవించాయి. మియున్‌లో 28 మంది మరణించారు. యాన్‌క్వింగ్‌లో ఇద్దరు మరణించారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ వరద సహాయ పరిస్థితులను సమీక్షించారు. ప్రజల ప్రాణాలకు పూర్తి భద్రత కల్పించాలని, వారికి అన్ని సదుపాయాలు సమకూర్చాలని సహాయ సిబ్బందిని ఆదేశించారు. చైనా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా, సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఛైర్మన్ హోదాలో జిన్‌సింగ్ సహాయబృందాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీంతో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ బృందాలు రంగంలోకి దిగాయి. ఇటీవలికాలంలో చైనాలోని అనేక ప్రాంతాలు వరద బారిన పడి తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాయి. బీజింగ్, హెబాయ్, జిలిన్, షాన్‌డాంగ్ తదితర రాష్ట్రాలలో ఇటీవలికాలంలో భారీ వర్షాలు, వరదలవల్ల తీవ్ర ఆస్తినష్టం, ప్రాణనష్టాలు సంభవించాయని చైనా అధికార పత్రిక తెలియజేసింది.

## మోదీ స్పందించలేదు?
(మొదటి పేజీ తరువాయి)

పొందిందని చెప్పారని, పహల్గామ్ దాడిలో 26 మంది దుర్మరణంతో అది తప్పు అని నిరూపితమైందని అన్నారు. దీనికి ఎవరు కారణం అని ప్రశ్నించారు. ఇందుకు నిఘా వైఫల్యం కారణమని, సత్యమేవ జయతే అనేది నిజమైతే కేంద్ర హోం మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని, కానీ ఆయన ఆ పని చేయరని సుబ్బరాయన్ అన్నారు. సభలో ఆయన మాట్లాడిన తీరు ప్రజాస్వామ్యాన్ని బెదిరిస్తున్నట్లుగా ఉందని, జరిగిన దానికి వివరణ ఇవ్వకుండా వితండవాదంతో మాట్లాడిన ధోరణి స్పష్టమైందని మండిపడ్డారు. తమపై ఎవరి ఒత్తిడి లేదని, తమను బైటి వారు ఎవరు నడిపించలేదని విదేశాంగ మంత్రి, రక్షణ మంత్రి అన్నారని, మరి డొనాల్డ్ ట్రంప్ 25 సార్లు తానే యుద్ధం ఆపానని ఎలా అంటున్నారని నిలదీశారు. దీనిపై ప్రధాని ఎందుకు స్పందించడం లేదన్నారు. వీరంతా అమెరికాకు బానిసలుగా మారరాని ఆరోపించారు. పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై దాడులు జరిగిన సమయంలో ప్రతిపక్షాలు కొన్ని ప్రశ్నలు లేవనెత్తితే, ప్రతిపక్షాలను దేశద్రోహులని అన్నారని చెప్పారు. అసలు దేశం కోసం పోరాడని వారు, వలసపాలకులకు లొంగిపోయిన వారు తమ దేశభక్తిని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. వలసపాలనకు వ్యతిరేంగా దేశస్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ, ద్రవిడ పార్టీలు పోరాడాయని, అలాంటి తమ దేశ భక్తిని ప్రశ్నిస్తారా? అని సుబ్బరాయన్ అన్నారు. స్వాతంత్రోద్యమానికి నేతృత్వం వహించిన గాంధీ, నెహ్రూలపై గురించి మాట్లాడుతున్నారని, నెహ్రూ దేశం కోసం 9 ఏళ్ళు జైలు శిక్ష అనుభవించారని, ఆయన భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చారని అన్నారు. అలాంటి వ్యక్తులను నిందించడం సమంజసం కాదన్నారు. 1962 భారత్ – పాక్ యుద్ధ సమయంలో కూడా చైనా దురాక్రమణను ఖండిస్తూ సిపిఐ తీర్మానం చేసిందని, అది తమ పార్టీ దేశభక్తి వారసత్వానికి నిదర్శనమన్నారు. తమది నిజమైన దేశభక్తి వారసత్వమని బిజెపి లాంటి కల్పిత జాతీయ వాదం కాదన్నారు.

## దొడ్డ పద్మ మృతి (మొదటి పేజీ తరువాయి)

సభ్యురాలుగా, చాలాకాలం సిపిఐ జిల్లా సమితి సభ్యులుగా పనిచేశారు. నల్లగొండ జిల్లా పరిషత్ ఏర్పడినప్పుడు కోఆప్షన్ సభ్యురాలుగా ఆమె ఎన్నికయ్యారు.
**సంతాపం :** దొడ్డ పద్మ మరణ వార్త తెలిసిన వెంటనే సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆమె భౌతికకాయానికి సందర్శించి నివా ళ్లు అర్పించారు. దొడ్డ పద్మ మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, తెలంగాణ అమరవీరుల సార్మక ట్రస్ట్ కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావులు వేర్వేరు ప్రకటనల్లో దొడ్డ పద్మ కుటుంబ స భ్యులకు సానుభూతిని తెలిపారు. పద్మ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్న చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేశారు.

## ఉగ్రవాదులను మట్టుబెట్టాం
(మొదటి పేజీ తరువాయి)

ఉగ్రవాది అని, జిబ్రాన్ కూడా వాంటెడ్ ఉగ్రవాది అని తెలిపారు. పహల్గామ్‌లోని బైసారన్ లోయలో భారత పౌరుల హత్యలో పాలుపంచుకున్న ఈ ముగ్గురిని హతమార్చినట్లు చెప్పారు. పాహల్గామ్ దాడికి ముందు వారికి ఆశ్రయం కల్పించిన, ఆహారం అందించిన వారి ద్వారా హతులైన ఉగ్రవాదుల గుర్తింపును నిర్ధారించినట్లు అమిత్ షా తెలిపారు. ఉగ్రవాదుల నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను ఒక ఎం–9 , రెండు ఎ.కె.–47 రైఫిళ్లను సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో పరిశీలన కోసం సోమవారం రాత్రి ప్రత్యేక విమానంలో చండీగఢ్‌కు తరలించారని, పెహల్గామ్‌లో లభించిన ఖాళీ తూటాలు, ఉగ్రవాదుల నుండి స్వాధీనం చేసుకున్న తుపాకులను పరీక్షించిన తర్వాత లభించిన ఖాళీ తూటాలను ఫోరెన్సిక్ ల్యాబ్ సరిపోల్చిందని అమిత్ షా చెప్పారు. హతమైన ఇద్దరు ఉగ్రవాదుల పాకిస్థానీ ఓటర్ ఐడీలు, పాకిస్థాన్‌లో తయారైన చాక్లెట్లు, ఆయుధాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయని ఆయన తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత దళాలు పాకిస్థాన్ లోపల 100 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాలపై దాడి చేశాయని, పాకిస్థాన్‌లో ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని భారతదేశం బహిర్గతం చేయగలదని అమిత్ షా తెలిపారు.

# చేతులు కట్టేశారు
(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ చేసి ఉద్రిక్తతలను పెంచడానికి తాము కోరుకోవడం లేదని తెలియజేసిందని రాహుల్ గాంధీ అన్నారు. ఇవి తన మాటలు కాదని, ఇవి భారతదేశ రక్షణ మంత్రి మాటలు అని చెప్పారు. పరిమితులు విధించడం ద్వారా సాయుధ దళాల మనోధైర్యాన్ని, సామర్థ్యాన్ని ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. భారత సా యుధ దళాలను ఉపయోగించాలనుకుంటే, 100 శాతం రాజకీయ సంక ల్పం ఉండాలని, ఆపరేషన్‌పై వారికి పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ ప్రారంభించిన కేవలం 30 ని మిషాల తర్వాత కాల్పుల విరమణ కోరాలని భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మి లిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒ)కు ప్రభుత్వం సూచించిందని ఆరోపించారు. ఆపరేషన్ సమయంలో రాజకీయ పరిమితుల కారణంగా భారత విమానాల నష్టం జరిగిందని, సైనిక లోపాల వల్ల కాదని రాహుల్‌గాంధీ సైన్యాధికారుల ప్రకటనను ఉటంకించారు. పాకిస్థాన్‌లోని సైనిక , వైమానిక రక్షణ మౌలిక సదుపాయాలపై దాడి చేయకూడదని రాజకీయ నాయకత్వం సాయుధ దళాల చేతులను కట్టేయడం వల్లే విమానాలు కోల్పోయాయని ఆయన అన్నారు.

### ప్రశంసలే కాదు బాధ్యత కూడా వహించాలి : ప్రియాంక

‘నాయకత్వం అంటే కేవలం ప్రశంసలు అందుకోవడం మాత్రమే కాదు, బాధ్యత వహించడం కూడా అవసరం... మన దేశ చరిత్రలో మొదటిసారిగా, యుద్ధం అకస్మాత్తుగా ఆపేసారు. ఈ నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. ఇది మన ప్రధాని బాధ్యతారాహిత్యాన్ని ప్రతిబింబిస్తుంది’ కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ అన్నారు. ముంబై ఉగ్రదాడి సమయంలోనే పలువురు ఉగ్రవాదులను నాటి ప్రభుత్వం హతమార్చిందని, ఒక ఉగ్రవాదిని పట్టుకొని చట్టబద్ధంగా ఉరితీసిందని గుర్తుచేశారు. ఆ ఉగ్రదాడి జరిగినప్పుడు నాటి మహారాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి, కేంద్ర హోం మంత్రి తమ పదవులకు రాజీనామా చేశారని, మరి పెహల్గామ్ ఉగ్రదాడిలో భద్రతా వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఎవరూ రాజీనామా చేయలేదన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ప్రధాని నిర్లక్ష్యం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.లోక్‌సభలో జరిగిన ప్రత్యేక చర్చలో పాల్గొంటూ కేంద్ర హోం మంత్రి తన ప్రసంగంలో జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, తన తల్లి కన్నీళ్ల గురించి మాట్లాడారే తప్ప ‘శత్రువుకు ఎక్కడికీ పారిపోవడానికి మార్గం లేని సమయంలో యుద్ధం ఎందుకు నిలిపివేయబడింది’ అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదని అన్నారు.

### కాల్పుల విరమణకు తృతీయపక్షాన్ని ఎందుకు అంగీకరించారు? : అఖిలేష్ యాదవ్

‘ఆపరేషన్ సిందూర్ సమయంలో, ఏ దేశం కూడా మనకు మద్దతు ఇవ్వలేదు. ఇది భారతదేశ విదేశాంగ దౌత్యానికి ఒక చీకటి దశ’ అని సమాజ్‌వాదీ పార్టీ ఎంపి అఖిలేశ్ యాదవ్ లోక్‌సభ చర్చలో పాల్గొంటూ అన్నారు. ‘మన పొరుగు దేశాలు మనపై దాడి చేస్తున్నాయి లేదా మనకు మద్దతు ఇవ్వడం లేదు. చైనా మరింత దూకుడుగా ఉంది. పాకిస్థాన్ నుండి వచ్చే ఉగ్రవాదం వలె ఇది కూడా పెద్ద ముప్పు‘ అని ఆయన అన్నారు. చైనా భారతదేశ భూభాగాన్ని మాత్రమే కాకుండా, దాని మార్కెట్‌ను కూడా ఆధిపత్యం చేస్తుందని ఆయన హెచ్చరించారు.మనకు పాకిస్థాన్ నుండి ముప్పు లేదని, పెద్ద ముప్పు చైనా నుండే, అది మన భూమిని, మన ఆర్థిక వ్యవస్థను రెండింటినీ ఆక్రమిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాలు అనుకోకుండా చైనా వాణిజ్య ప్రయోజనాలకు సహాయం చేస్తున్నాయని, భారతదేశ సార్వభౌమత్వాన్ని బలహీనపరుస్తున్నాయని ఆయన ఆరోపించారు. మూడవ పక్షం ద్వారా కాల్పుల విరమణకు ప్రభుత్వం ఎందుకు అంగీకరించింది? వారు ఏ ఒత్తిడిలో ఉన్నారు?’ అని ప్రశ్నించారు.

### దేశ ప్రజలను ఓడించిన విశ్వగురువు : కనిమొళి

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రపంచ దేశాలకు పంపిన బలగాలో ప్రతిపక్ష ఎంపీల ఎంపిక ఓ విధంగా హర్షణీయమే అయినప్పటికీ అలాంటి అవకాశం రాకుండా ఉంటే మరింత సంతోషంగా ఉండేదని కనిమొళి అన్నారు. ‘అసలు దాడులు ఎందుకు జరిగాయి? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ‘ఈ బృందాలు ఎందుకు వెళ్లాలి? శాంతికి విఘాతం కలిగింది కాబట్టే ఇలాంటి పరిస్థితి వచ్చింది. ఇది అత్యంత బాధాకరం. మీరు దేశ ప్రజలను ఓడించారు... నిరాశపరిచారు. అందుకే మేము వెళ్లాల్సి వచ్చింది’ అని కనిమొళి అన్నారు. ‘ఎప్పుడు దాడి జరిగినా మళ్లీ ఇలా జరగదంటారు. వీటి నుంచి విశ్వగురువు నేర్చుకున్నదేమిటి? రా, ఐబీ హెచ్చరించినప్పుడు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని కనిమొళి ప్రశ్నించారు.

### పాక్‌కు భారత్ సిందూరం: బెనివాల్

‘ఆపరేషన్‌కు సిందూర్ అనేది పాకిస్థాన్‌కు భారత్ సిందూరం దిద్దినట్లు ఉందని, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ అధ్యక్షుడు హనుమాన్ బేనీవాల్ వ్యంగ్యంగా అన్నారు. ‘ఇక అప్పగింతలే తరువాయి, మీరెళ్లి పాకిస్థాన్‌ను తీసుకురండి’ అంటూ ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో నవ్వులు పూయించాయి. తనకు ఇచ్చిన సమయం ముగిసినట్టు గంట మోగడంపై అసహనానికి గురయ్యారు.

# పర్యావరణహితం
(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని వారసత్వ కట్టడాల సంరక్షణ, వాటిని పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకుగానూ కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించి దానిని మరింత బలోపేతం చేయాలన్నారు. పాతబస్తీలో మెట్రో పనుల పరిస్థితిపైనా సిఎం ఆరా తీశారు. అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున అక్కడ మెట్రో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మెట్రో ఇతర ఫేజ్‌ల అనుమతులు, తదితర విషయాల్లో ఏమాత్రం జాప్యాన్ని సహించబోమని హెచ్చరించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పనులు పూర్తయ్యే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని సిఎం ఆదేశించారు.

### వేగవంతంగా మూసీ రివర్ ఫ్రంట్ పనులు

మూసీ రివర్ ఫ్రంట్‌కు సంబంధించి హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరో వర్ వరకు పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధి కారులను ఆదేశించారు. ఓఆర్ఆర్ నుంచి మూసీ వైపు వచ్చే క్రమంలో కొత్వాల్‌గూడ జంక్షన్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌లకు ప్రతీకగా ఇండియా గేట్, గేట్ వే ఆఫ్ ఇండియా, చార్మినార్ లాంటి ఓ ల్యాండ్ మార్క్‌ను నిర్మించాలని, మూసీపై బ్రిడ్జి కమ్ బ్యారేజీలకు ప్రణాళికలు రూపొందించాలని సిఎం సూచించారు. అనుమతులు, నిబంధనల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని అధికారులకు తెలిపారు. నెహ్రూ జూ పార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల్లో పురోగతిపైనా సిఎం సమీక్షించారు. మీరాలం ట్యాంక్ ఎదుట ఏర్పాటు చేసిన ఎస్‌టిపిలు వాటి సామర్థ్యానికి అనుగుణంగా పని చేసేలా చూడాలని సిఎం ఆదేశించారు. జూ పార్క్, మీరాలం ట్యాంక్ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అధునాతన వసతులతో హోటల్ నిర్మించాలని, పార్క్, మీరాలం ట్యాంక్‌తోపాటు నగరాన్ని వీక్షించేలా హోటల్ ఉండాలని సిఎం అభిప్రాయపడ్డారు. సమీక్షలో సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, సిఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (హెచ్‌ఎండిఎ ఏరియా) కార్యదర్శులు ఇలంబర్తి, టి.కె.శ్రీదేవి, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె.శశాంక, వాటర్ బోర్డు ఎండి అశోక్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, మెట్రో రైలు ఎండి ఎన్.వి.ఎస్.రెడ్డి, ఎంఆర్‌డిసిఎల్ ఎండి ఇ.వి. నరసింహారెడ్డి, జెఎంఎడి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# అడగలేదు (మొదటి పేజీ తరువాయి)

వెనుక నిలబడలేదని ఆరోపించారు. అణ్వస్త్ర ప్రయోగం చేస్తామని పాకిస్థాన్ ఏమార్చేందుకు ప్రయత్నించిందనీ, కానీ అలాంటి అణ్వస్త్ర బెదిరింపులకు తలవంచబోమని భారతదేశం ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. ‘‘భారతదేశంలో అల్లర్లు రెచ్చగొట్టడంకోసమే పహల్గామ్ కుట్ర చేశారు, భారతదేశ ప్రజలు ఐక్యంగా ఉండి ఆ కుట్రలను వమ్ముచేశారు, నేను ఇప్పుడు ఈ పార్లమెంటు సమావేశాన్నిఒక విజయోత్సవంగా చేసుకుని మాట్లాడుతూ ఉంటే, అక్కడ ఉగ్రవాదుల కేంద్రకార్యాలయాలను ఈ విజయోత్సవం ధ్వంసం చేస్తోందన్నారు. ‘‘మన సాయుధ బలగాల శక్తిసామర్థ్యాలపై మనకు పూర్తి విశ్వాసం ఉంది, పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పడానికి వారికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం, అనుకున్నవిధంగానే మనబలగాలు వారికి సరైన గుణపాఠం చెప్పాయి, దీంతో ఉగ్రవాదుల వెనుక ఉన్న సూత్రధారులు ఇప్పటికీ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు’’ అన్నారు.‘‘మే తొమ్మిదో తేదీన అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ తనను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు మూడు నాలుగుసార్లు ప్రయత్నం చేశారు, కానీ నేను ఆ సమయంలో మన సాయుధబలగాలతో వరుస సమావేశాలలో ఊపిరిసలనంతగా నిమగ్నమయ్యాను’’ అని లోక్‌సభకు మోదీ తెలియజేశారు. ‘‘నేను తిరిగి ఆయనకు ఫోన్ చేశాను. అప్పుడు జె.డి.వాన్స్, పాకిస్థాన్ నుండి చాలా పెద్ద దాడి జరగబోతోంది అని నాకు చెప్పారు. ఒకవేళ పాకిస్థాన్ గనుక దాడి చేస్తే, మా దేశం కూడా అంతకంటే చాలాపెద్దస్థాయిలో దాడి చేస్తుంది, వారు తూటాలు ప్రయోగిస్తే, మేం ఫిరంగులు ప్రయోగిస్తాం అని సమాధానం చెప్పాను’’ అని లోక్‌సభకు మోదీ వివరించారు. అపాకిస్థాన్‌పై సైనికచర్యను ఆపమని ఏ దేశం నాయకుడూ భారత్‌ను అడగలేదని ఆయన పునరుద్ఘాటించారు. పాకిస్థాన్ వైమానిక స్థావరాలను భారతదేశం ధ్వంసం చేసిందనీ, ఇప్పటికీ అవన్నీ ఐసియులోనే ఉండిపోయాయని, ఏప్రిల్ 22న పహల్గామ్‌లో దాడికి పాల్పడిన వారి వెనుక ఉన్న సూత్రధారులు ఇప్పటికీ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని అన్నారు. ఐక్యరాజ్యసమితిలో మూడు దేశాలు తప్ప మిగిలిన అన్ని సభ్యదేశాలూ ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా నిలబడ్డాయన్నారు.‘‘ఎలాంటి దుస్సాహసం చేసినాగానీ ఆపరేషన్ సిందూర్ నుండి సింధు (సింధునదీ జలాల ఒప్పందం) వరకూ భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నవిషయం పాకిస్థాన్‌కు బాగా తెలుసు. ఇంతకుముందు కూడా ఉగ్రవాద దాడులు జరిగాయి, తమకేం జరగదని ఉగ్రవాదులవెనుక సూత్రధారులు భావించారు, కానీ తమను మట్టుబెట్టడంకోసం భారతదేశం తమ వద్దకు వస్తుందని ఇప్పుడు వారికి తెలిసివచ్చింది’’ అన్నారు. సైనికచర్య సందర్భంగా భారత్‌లో అంతర్గతంగా తయారైన డ్రోన్లు, క్షిపణులు పాకిస్థాన్ శక్తిసామర్థ్యాల డొల్లతనాన్ని బహిర్గతం చేశాయన్నారు.‘‘ఆపరేషన్ సింధూర్ సందర్భంగా భారతదేశ స్వయంసమృద్ధి సామర్థ్యం ఏమిటో ప్రపంచానికి తెలిసివచ్చింది, ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ భూభాగం లోలోపలికి దూసుకువెళ్ళి 22 నిమిషాల్లోనే ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేశాం, భారతదేశం తీసుకునే చర్యలను కొంతమేరకు ముందుగానే పసిగట్టిన పాకిస్థాన్ అను బెరింపులు జారీ చేసింది, కానీ మన సైన్యం పాకిస్థాన్‌లో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన తర్వాత ఇక ఏమీ చేయలేకపోయింది’’ అని మోదీ చెప్పారు. రాజకీయ స్వప్రయోజనాలకోసం కాంగ్రెస్‌నాయకులు తనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారని, కానీ భారత సైనికులు వారిని నిరుత్సాహ పరచడంతో నిష్ప్రయోజనమైన వారి ప్రకటనలన్నీ ఆగిపోయాయని ఆరోపించారు. ‘‘పాకిస్థాన్ ప్రోపగాండకు కాంగ్రెస్,దాని మిత్రపక్షాలు దురదృష్టవశాత్తూ అధికార ప్రతినిధులుగా మారారు, భారతదేశం స్వయం సమృద్ధి సాధిస్తే, కాంగ్రెస్‌పార్టీ మాత్రం సమస్యలు వెతుక్కోవడానికి ఇప్పుడు పాకిస్థాన్‌పైన ఆధారపడింది, పాకిస్థాన్‌కు కాంగ్రెస్‌పార్టీ క్లీన్‌చిట్ ఇచ్చి వారితో గళం కలుపుతుంటే యావత్ భారతదేశం ఆశ్చర్యంలో చూస్తోంది’’ అని మోదీ తీవ్ర ఆరోపణలు చేశారు.

## బాధ్యత (మొదటి పేజీ తరువాయి)

ఆయన పాల్గొంటూ కాంగ్రెస్ నాయకుడు ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. 2015లో ప్రధాని నరేంద్ర మోదీ ముందుగా షెడ్యూల్‌లో లేకుండానే పాకిస్థాన్‌కు పర్యటించడాన్ని ఎద్దేవా చేశారు. పెహల్గామ్ దుర్ఘటన తరువాత ప్రధాని నరేంద్ర మోదీ అఖిలపక్ష సమావేశానికి కాకుండా, బిహార్‌లో ప్రచారాని కి వెళ్ళడాన్ని ఆయన తప్పుబట్టారు. చివరకు ఇంత పెద్ద అంశంపై పార్లమెంటులో చర్చ జరుగుతున్నా ప్రధాని హాజరు కాకపోవడం చరిత్రలో ఇదే మొదటిసారి అని అన్నారు. జాతీయ భద్రత పట్ల మోదీ చిత్తశుద్ధిని ప్ర శ్నించా రు. జవాబుదారీతనం డిమాండ్ చేస్తూ, ఉగ్రదాడులను ఆపడంలో ప్ర భుత్వం తన వైఫల్యాలను అంగీకరించాలని అన్నారు. మోదీ ప్రభుత్వం అ హంకారం ఉన్నదని, పెహల్గామ్ ఉగ్రదాడి తరువాత ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేయాలని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడిగా తా ను, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాం ధీ రాసిన లేఖలకు స్పందన లేదని విమర్శించారు.

# జనరల్
STATE & REGIONAL NEWS

## పిటిషన్‌దారు అసభ్యకర ఆరోపణలు.. అతని న్యాయవాదికీ 'సుప్రీం' ధిక్కారణ నోటీసులు

**న్యూఢిల్లీ:** తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తిపై అసభ్యకరమైన ఆరోపణలు చేసినందుకు సుప్రీంకోర్టు మంగళవారం పిటిషనర్‌తోపాటు, అతని న్యాయవాదులకూ కోర్టుధిక్కార నోటీసులు జారీచేసింది. అదే సమయంలో పిటిషనర్ మరియు న్యాయవాదులకు అత్యున్నత న్యాయస్థానం షోకాజ్ నోటీసులు కూడా జారీచేసింది. పిటిషన్ ఉపసంహరణకు అనుమతించాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్‌తో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. పిటిషనర్ ఎన్.పెద్దిరాజు దాఖలుచేసిన బదిలీ పిటిషన్‌ను న్యాయవాది ఆనేకర్లు రితేష్‌పాటిల్ ద్వారా దాఖలు చేశారు. ఈ పిటిషన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్‌సి, ఎస్‌టి (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) యాక్ట్ కింద ఒక అంశంలో హైకోర్టు నుంచి ఊరట పొందిన విషయానికి సంబంధించినది. ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ ధర్మాసనం దీనిపై మాట్లాడుతూ 'ఇక్కడ మేం లాయర్లకు రక్షణ కల్పించేందుకు ప్రయత్నిస్తుంటాం. కానీ ఈ రకపు ప్రవర్తనను క్షమించి వదిలేసేది కాదు' అని తేల్చిచెప్పింది.

# ఢిల్లీ జర్నలిస్ట్‌లకు ప్రత్యేక కోటా

### తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి




**న్యూఢిల్లీ :** ఢిల్లీలో పనిచేసే జర్నలిస్ట్ లకు అక్రిడిటేషన్, ఆరోగ్య కార్డులు, ఇళ్ళ స్థలాల విషయంలో ఢిల్లీ కోటాను అమలు చేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పనిచేసే వారికి అక్రిడిటేషన్ ఉండేలా కొత్త నిబంధనలు త్వరలో అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజెయు)కు అనుబంధంగా పనిచేస్తున్న ఢిల్లీ తెలుగు జర్నలిస్ట్స్ అసోసియేషన్ (డిటిజెఎ) సమావేశం మంగళవారం తెలంగాణ, ఆంధ్రా భవన్‌లోని గురజాడ కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా ఐజెయు జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఐజెయు నాయకులు దేవులపల్లి అమర్, నరేందర్ రెడ్డి, సోమసుందర్, మాజిద్ హాజరయ్యారు. ఇళ్ళ స్థలాలు సైతం ఢిల్లీలో తెలుగు మీడియా సంస్థల కోసం పనిచేసే జర్నలిస్టులకు తెలంగాణ, ఏపి అనే తేడా లేకుండా అమలు చేయడానికి తమవంతు కృషి చేస్తానని కె.శ్రీనివాస్‌రెడ్డి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. హెల్త్ కార్డులు అందరికి వచ్చేలా చూస్తామని అన్నారు. రెండు రాష్ట్రాల కోసం ఢిల్లీలో పనిచేసే జర్నలిస్టులకు తెలంగాణ, ఏపి రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి సహకారం అందించాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ అన్నారు. జర్నలిస్టులు కేవలం అక్రిడిటేషన్, ఆరోగ్యం, ఇళ్ళ స్థలాలు మాత్రమే ఎక్కువగా అడుగుతుంటారని గుర్తు చేశారు. వారికి కావాల్సిన కనీస వసతులను కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి తమవంతు సహకారం అందిస్తానని వెల్లడించారు. సిఎం చంద్రబాబు అందరికీ అక్రిడిటేషన్లను ఇవ్వాలని చెప్పారని, అలాగే అమరావతిలో ఇండ్ల స్థలాల విషయంలోనూ ఢిల్లీ జర్నలిస్టులకు అందేలా చూస్తానని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, ఎదురయ్యే ఇబ్బందులు పరిష్కారానికి తమ యూనియన్ చేస్తున్న కృషిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం (టియుడబ్ల్యుజె) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. విరాహత్ అలీ, రామ నారాయణ, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియు డబ్ల్యుజె) అధ్యక్షులు ఐవి సుబ్బారావు వివరించారు.

**డిటిజెఎ అధ్యక్షులుగా టి.శ్రీనివాస్ రావు:** ఢిల్లీ తెలుగు జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టి.శ్రీనివాసరావు(టివి-5 బ్యూరో చీఫ్) ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.గోపీకృష్ణ (10టివి బ్యూరో చీఫ్), ప్రధాన కార్యదర్శిగా టి.సూర్యకిరణ్ (ఆంధ్రజ్యోతి చీఫ్ రిపోర్టర్)లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి. కళా శ్రీనివాస్ (ప్రైమ్ 9 బ్యూరో చీఫ్ ) ఎం.డి.మదార్ (వి6 బ్యూరో చీఫ్), కోశాధికారిగా ఎం.వి.శివరావు (బిగ్ న్యూస్ బ్యూరో చీఫ్), సంయుక్త కార్యదర్శులుగా ఎం.సత్య (ఆంధ్రప్రభ బ్యూరో చీఫ్), విద్యాసాగర్ (ఆంధ్రజ్యోతి కరస్పాండెంట్), ఎస్. నవీన్ కుమార్ (99 బ్యూరో చీఫ్)లు ఏకగ్రీవం

## టిమ్స్ ఆసుపత్రికి కమ్యూనిస్టు దిగ్గజం రావి నారాయణ రెడ్డి పేరు

### సిఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌బినగర్‌లో నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రికి తెలంగాణ రాజకీయ ఉద్యమ వైతాళికుడు, పద్మ భూషణ్, మాజీ ఎంపి, కమ్యూనిస్టు దిగ్గజం రావి నారాయణరెడ్డి ఆసుపత్రిగా నామకరణం చేయాలని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు సభ్యులు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. నాటి నిజాంరాజ్యంలో అన్ని ఉద్యమాలలో అగ్రభాగాన నిలిచిన నిజాం రాజ్యంలో వెట్టిచాకిరి, దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా 'అయ్యా నీ బాంచ' నన్నోళ్ళతోనే బందూకులు పట్టించి చారిత్రాత్మక రైతాంగ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించి నిజాం రాజును గద్దె దింపిన నిజాం నిరంకుశ పాలనను అంతమొందించిన ప్రజానాయకుడు రావి నారాయణ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపు నివ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమైనా ఆ మహానేతకు గుర్తింపు లభించే విధంగా ఎల్‌బినగర్ టిమ్స్ ఆసుపత్రికి ఆయన పేరు పెట్టాలని కోరారు. అదేవిధంగా రావినారాయణరెడ్డి నిర్మాణం చేసిన తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు ఆయన కోరిక ప్రకారం బంజారాహిల్స్‌లో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ట్రస్టు భవనం, రావి నారాయణరెడ్డి ఆడిటోరియం నిర్మాణం జరిగిందని, ఈ సముదాయానికి నాటి కేంద్ర హోం శాఖ మంత్రి శివరాజ్ పాటిల్, ఆడిటోరియాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభోత్సవం చేయగా, మాజీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారన్నారు. అయితే రావి నారాయణరెడ్డి కోరుకున్న తెలంగాణ పోరాటానికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్, గ్రంథాలయం, ఇతర నిరంతర కార్యక్రమాలను ఆర్థిక ఇబ్బందులు, అనివార్య కారణాలవల్ల పూర్తిచేయలేకపోయామని, వాటిని పూర్తిచేసేందుకు ప్రభుత్వం తరపున సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చాడ వెంకటరెడ్డిలు, కందిమళ్ల ప్రతాపరెడ్డి విజ్ఞప్తి చేశారు.

### మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే

# చట్ట ప్రకారం చర్యలు

### జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలితే ఎవరైనా సరే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్ అన్నారు. తెలంగాణలో జరుగుతున్న రెండు రోజుల జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) శిబిర సమావేశంలో భాగంగా మంగళవారం జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసిహెచ్‌ఆర్‌డి) రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అధికారులతో కమిషన్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించింది. రాష్ట్రంలోని ప్రధాన మానవ హక్కుల సమస్యలపై చర్చించి, వాటిని ఎదుర్కొనడంలో ప్రభుత్వ యంత్రాంగం చేపడుతున్న చర్యలు, సంక్షేమ చర్యల అమలును సమీక్షించింది. ఈ సమావేశానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్ అధ్యక్షత వహించగా, సభ్యులు జస్టిస్ బిద్యుత్ రంజన్ సారంగి, విజయ భారతి సాయనీ, తెలంగాణ రాష్ట్ర మాన వ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ పాల్గొన్నారు. కేంద్ర కమిషన్ తరఫున కార్యదర్శి జనరల్ భరత్ లాల్, డైరెక్టర్ జనరల్ (ఇన్వెస్టిగేషన్) ఆర్.పి. మీనా, డిప్యూటి రిజిస్ట్రార్ (లా) ఇంద్రజీత్, డాక్టర్ ముఖేష్, ఎస్ఎస్‌పి (ఇన్వెస్టిగేషన్) ఇలక్కియా కరుణాగరణ్ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, అధ్యక్షతన హోం, మహిళా, శిశు సంక్షేమం, విద్య, అటవీ, వ్యవసాయం, ఎస్‌సి అభివృద్ధి, పోలీస్ విభాగాల నుండి సీనియర్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, పోషకాహార లోపం, మనుషుల ప్రాణుల మధ్య చోటుచేసుకున్న ఘటనలు, ప్రాథమిక విద్యలో లోపాలు, ఎస్‌సి సంక్షేమం, రైతుల సమస్యలు, హక్కుల అంశాలపై చర్చ జరిగింది.

**రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్‌హెచ్‌ఆర్‌సి పనిచేస్తుంది : జస్టిస్ వి.రామసుబ్రమణియన్**

రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్‌హెచ్‌ఆర్‌సి పనిచేస్తుందని జస్టిస్ వి.రామసుబ్రమణియన్ అన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రానికి చెందిన 106 కేసులను పరిష్కరించామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి, డిజిపి, జైళ్ల శాఖ డిజి, అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించామన్నారు.

రైతుల సమస్యలు, మహిళలు, చిన్నారులపై దాడులు, దివ్యాంగుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నామని చెప్పారు. వసతిగృహాల్లో సౌకర్యాలలేమిపై అధికారులను ప్రశ్నించామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో ఇవ్వాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వివరించారు. మీడియా, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో వాస్తవాలను బట్టి సుమోటోగా విచారణ చేపడుతున్నామని జస్టిస్ వి. రామసుబ్రమణియన్ తెలిపారు. పోలీస్, జ్యుడిషియల్ కస్టడిలో మృతి చెందిన ఘటనల్లో ప్రత్యేకంగా దర్యాప్తు చేయిస్తున్నామన్నారు. సహజ మరణమా? అధికారులు కారణమా? అనే విషయాలపై దర్యాప్తు చేయిస్తామన్నారు. పోలీసు, జైలు అధికారుల తప్పిదం ఉంటే చర్యలకు సిఫార్సు చేస్తున్నామన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సిలో 34,865 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వీటిలో తెలంగాణకు సంబంధించిన కేవలం 780 ఉన్నాయని జస్టిస్ వి.రామసుబ్రమణియన్ తెలిపారు. మనవద్ద మంచి చట్టాలు, పథకాలు ఉన్నాయని, వాటి ఫలితాలు ప్రజలకు నిజంగా అందాలంటే అమలు గట్టిగా ఉండాలని రామసుబ్రమణియన్ అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమావేశంలో జరిగిన చర్చలను సమీక్షించి, కమిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం హక్కుల ఆధారిత పరిపాలనను బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తుందని హామీనిచ్చారు. వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు తమ విభాగాల వారిగా వివరాలను కమిషన్‌కు తెలిపారు. లగచర్ల ఘటన, గురుకుల పాఠశాల విద్యార్థుల విషయంపై బిఆర్‌ఎస్ నేతలు ఎన్‌హెచ్‌ఆర్‌సికి ఫిర్యాదు చేశారు. తమ పార్టీకి చెందిన నేతలు కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎమ్మెల్సీ శ్రవణ్, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు.




# కేంద్రంపై నెపం నెడుతున్న కాంగ్రెస్

### బిఆర్‌ఎస్ నాయకుల ఆరోపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీ లో 5,6,7 తేదీల్లో డ్రామాలు చేయబోతున్నదని, చివరికి కేంద్రంపై నెపం నెట్టబోతున్నదని బిఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఆగస్టు 8న కరీంనగర్‌లో సభను నిర్వహిస్తామని,అలాగే బిఆర్‌ఎస్ తరఫున ఢిల్లీలో రాష్ట్రపతిని కలుస్తామని అన్నారు.

బిసి బిల్లులను అసెంబ్లీ, మండలిలో తీర్మానించి రాష్ట్రపతికి పంపించిన తర్వాత, మళ్లీ ఆర్డినెన్స్‌ను ఎలా తీసుకొస్తారని వారు ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్లు ఆర్డినెన్స్, జిఒల తో రాబోదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసన మండలిలో ప్రధానప్రతిపక్ష నేత మధు సూధనా చారి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండాప్రకాష్ ముదిరాజ్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ మాట్లాడుతూ కార్పొరేషన్ చైర్మన్ పదవులలో 50 శాతం బిసిలకు ఇవ్వాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. బిసిలకు రక్షణ కవచంగా బిఆర్‌ఎస్ నిలుస్తుందన్నారు. బిసిలను బిజెపి మోసం చేస్తోందని మండిపడ్డారు. బిసి రిజర్వేషన్ల విషయంలో జయలలిత తమిళనాడు రాష్ట్ర అఖిలపక్షాన్ని నాలుగుసార్లు ఢిల్లీకి తీసుకెళ్లారని వారు అన్నారు.

### 42 శాతం రిజర్వేషన్ల సాధనకోసం

# 4 నుంచి ధర్నాచౌక్‌లో నిరాహార దీక్ష

### ఎమ్మెల్సీ కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు స్థానిక సంస్థలలో రాజకీయ, విద్య, ఉద్యోగ అవకాశాలలో 42 శాతం రిజర్వేషన్ల సాధనకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన ఒత్తిడిని పెంచేందుకు ఆగస్టు 4 నుంచి 7వ తేదీ వరకు 72 గంటల పాటు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సి కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో యునైటెడ్ పూలే ఫ్రంట్, బిసి సంఘాల నాయకులతో కలిసి కవిత మంగళవారం మీడి యా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు సూచన మేరకు సెప్టెంబర్ నెలాఖరులోపు ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని, గడువులోగా ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో, బిసిలకు రిజర్వేషన్ల కోటా పెంచడం కూడా అంతే ముఖ్యమన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిసి బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే, రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర వేయకుంటే, దీనిపైన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు న్యాయపోరాటం చేయలేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో తమిళనాడు ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాటు న్యాయపోరాటం చేసి, రిజర్వేషన్లు కల్పించిందని కవిత గుర్తు చేశారు. బిసి సిఎం, బిసి పిఎం అని చెబుతున్న బిజెపి తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల పెంపునకు ఎందుకు అడ్డుతగులుతోందని నిలదీశారు. ఢిల్లీలో ధర్నా అంటే అదేమైనా సత్రం భోజనమా?, మంత్రి పొన్నం బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని కవిత మండిపడ్డారు. ప్రభుత్వపరంగా అధికారికంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తే, అన్ని రాజకీయ పార్టీలను యుపిఎఫ్ కన్వీనర్ బొల్ల శివశంకర్, నాయకులు ఆలకుంట హరి, తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీలు, గిరిజనులు అమాయకులు

### మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఆదివాసులు, గిరిజనులు అమాయకులని, ఆదివాసులు గిరిజనులు తమ అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదముందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం నిజామాబాద్ పట్టణంలోని హరిత హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, మాజీ ఎంపి మధు యాష్కీగౌడ్, బెల్లయ్యనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసులు గిరిజనులు అమాయకులని, వారు తమ అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదముందన్నారు. వారిపై కొన్ని దుష్టశక్తులు మనువాదాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోని రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ హయాం నుంచి ఆదివాసుల కోసం దళిత గిరిజనులకు సమాజంలో సమానత్వం కోసం నేటివరకు పనిచేస్తూనే ఉందన్నారు. ఆదివాసుల మేలుకోసం కులగణన సర్వే చేయించిందని తెలంగాణలో చేసిన సర్వేపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. కులగణన సర్వే 90శాతం పూర్తయిందన్నారు. గిరిజనులు న్యాయపరమైన హక్కుల కోసం సంఘటితం కావాల్సిన అవసరముందని, అటవీ హక్కుల చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిందని, గిరిజనులు మొదట విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గత పదేళ్లలో బిఆర్‌ఎస్ తెలంగాణను అప్పులకుప్పగా మార్చిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మిగతా హామీల అమలుకోసం కృషి చేస్తామన్నారు. ఈ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన ఆదివాసీ గిరిజనులకు సరైన మార్గంలో నడిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేసేవరకు కష్టపడి పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మాట్లాడుతూ గిరిజనులు అటవీ భూములు, ఇతర వనరులు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. జల్ జమీన్ జంగిల్(నీరు, అటవీ, భూవనరులు)పై గిరిజన హక్కుల కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. సహజ వనరులపై గిరిజనుల హక్కులకోసం రాహుల్‌గాంధీ యాత్ర చేశారన్నారు. ప్రధానిగా రాహుల్‌గాంధీని చూడాలని మనందరి కల, ఈ కల కోసం కాంగ్రెస్ కార్యకర్తలు సైనికులుగా పని చేయాలన్నారు. ప్రజల ఆక్రందన, ఆవేదనను అర్థం చేసుకోవటమే రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర లక్ష్యమన్నారు. గిరిజనుల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. పెట్టుబడిదారుల లబ్ధికోసం మోడీ ప్రభుత్వం గిరిజనుల హక్కులను లాక్కోవటానికి కుట్ర పన్నుతోందన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

### సెప్టెంబర్ 1 నుంచి నిరధిక సమ్మె : ఎఐటియుసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల అన్ని డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే ఆగస్టు 6,7 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో నిరాహారదీక్షలు చేపడుతామని అప్పటికీ పరిష్కరించకపోతే సెప్టెంబర్ 1నుంచి నిరవధిక సమ్మెను చేపడుతామని రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రేంపావని, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు చక్రపాణి, ఎన్.రామక్రిష్ణ, ఎం.లక్ష్మణ్, బి.ప్రసాద్‌లు హెచ్చరించారు.

రాష్ట్రంలో ఉన్న పెండింగ్ బిల్లులు, అల్పాహారం బిల్లులు, వేతనాలు అన్ని కూడా జులై వరకు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం చెల్లించాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థికి తరగతితో సంబంధం లేకుండా మెను చార్జీలు రూ.25లు చెల్లించాలి లేకపోతే నిత్యావసర వస్తువులు, గ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయడంతోపాటు కార్మికులకు పనిభద్రత కల్పించాలి. ప్రభుత్వమే గుర్తింపు కార్డులు, ప్రొసీడింగ్ ఆర్డర్స్, డ్రెస్‌కోడ్ ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇయస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గ్రీన్ ఛానల్ లేదా పిఎఫ్ఎంఎస్ ద్వారా బడ్జెట్‌ను రిలీజ్ చేసి కార్మికుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సెప్టెంబర్ 1 నుంచి సమ్మె తప్పదని హెచ్చరించారు.

## ఘనంగా సింగరేణి సిఎండి బలరాం నాయక్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ ఖైరతాబాద్(హైదరాబాద్) :** సింగరేణి సంస్థను బలోపేతం చేస్తూ, పలువురు నిరుపేదలకు అండగా ఉంటూ ఒక డైనమిక్ ఆఫీసర్‌గా గొప్పస్థాయిలో ఉన్న సింగరేణి సిఎండి, చైర్మన్ బలరాం నాయక్ జీవితం అందరికీ ఆదర్శనీయమని గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్ చౌహన్ పేర్కొన్నారు. మంగళవారం గిరిజన శక్తి ఆధ్వర్యాన హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీలో బలరాం నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్‌టి హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వెంకటేశ్ చౌహన్ మాట్లాడుతూ డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్, సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో కష్టపడి ఓ మారుమూల తండాలోని పేద కుటుంబం నుంచి వచ్చి ఆదర్శవంతమైన సమాజంకోసం కృషిచేస్తున్న బలరాం నాయక్ పుట్టినరోజు పండుగ దినమన్నారు.యువ తెలంగాణ పత్రిక చైర్మన్ డా. మెండెం కిరణ్‌కుమార్ బలరాం నాయక్ ఒక ఐకాన్ అని కొనియాడారు.

# 72 గంటల దీక్ష గల్లీలో కాదు..ఢిల్లీలో చేయాలి

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** బిసి రిజర్వేషన్లపై బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కవిత 72 గంటల దీక్షను గల్లీలో కాకుండా ఢిల్లీలో చేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ అన్నారు. బిసి రిజర్వేషన్లపై గత బిఆర్‌ఎస్ పాలకులు కనీస ప్రయత్నం చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిసి రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ ఆమోదించిందని చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా ఆయన మాట్లాడుతూ కవిత బిసి పట్ల నిజమైన ప్రేమ గౌరవం ఉంటే ఢిల్లీలో మోదీపై, బిజెపిపై పోరాటం చేయాలని హితవు పలికారు. బిసి రిజర్వేషన్లను చట్ట బద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా అమలు చేయాలని ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ వేసిందన్నారు. బిసి రిజర్వేషన్లపై బిఆర్‌ఎస్ పార్టీ, బిజెపి సరైన అవగానన లేకుండా వ్యవరిస్తున్నారని విమర్శించారు. కవిత దీక్ష చేస్తామనడం అర్థంలేని పోరాటమని, పదేళ్లు అధికారంలో ఉండి కవిత బిసి రిజర్వేషన్లపై ఏ ఒక్క రోజు నోరు మెదపని కవిత తన రాజకీయ అవసరాలకు బిసి వాదం ఎత్తుకున్నారని ఆయన విమర్శించారు. బిసి బిల్లుపై, కులగణనపై బిఆర్‌ఎస్ పార్టీ వైఖరి ప్రకటించకపోవడం సిగ్గుచేటన్నారు. బిసి రిజర్వేషన్ల పట్ల కాంగ్రెస్ పార్టీ నిజాయితీ, నిబద్ధతతో ఉందని, తమిళనాడు తరహాలో తెలంగాణలో బిసి రిజర్వేషన్లను అమలు చేసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, ఇందుకు రాష్ట్రంలో సామాజిక విప్లవం తెచ్చిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ సామాజిక శక్తులు అండగా నిలవాలని ఆయన కోరారు.

IN THE COURT OF THE
V SENIOR CIVIL JUDGE ::
CITY CIVIL COURT ::
AT HYDERABAD
O.S.No. 607 of 2025
Between:
Dhadvai Yadamma & others ... Plaintiffs
AND
Mandal Revenue officer &
All Concerned ...Defendants
To,
All Concerned ...Defendants
NOTICE
That the above named Plaintiffs herein filed the above Suit against you for Legal Heir certificate and the case is posted to **07-08-2025.** Therefore you are hereby called upon to appear before the Hon'ble court above mentioned on **07-08-2025 at 10.30 AM** either in person or through counsel, otherwise the above matter will be heard and decided as per law.
(By order of the Hon'ble Court)
S.RAGHUVEER,
Advocate,
H.No.1-9-202/E/1/C/2/1,
Ramnagar, HYDERABAD.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: ఎల్‌బినగర్ సర్కిల్-4
NIT No. 16/EEC-4/BNR/GHMC/2025-26, టెండర్ ప్రకటన తేది: 28.07.2025
**పని పేరు:** అభివృద్ధి పని -1 నెం.లు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 30.07.2025న సా.05.00గం.ల నుండి 06.08.2025న సా.04.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి. సెల్: 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి .
DIPR R.O. No. : 5719-PP/CL/ADVT/1/2025-26, Date: 29-07-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము
శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్ - 500073 . ఫోన్ నెం: 9494252843, 040-23748247
టెండర్ నోటీస్ నెం.2/TEN/SVST/SNC/2025 ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన తేది: 29.07.2025
ఒక సంవత్సరం కాలపరిమితికి ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా అనగా తేది: 10.09.2025 నుండి 09.09.2026 వరకు దేవాలయములో ఈ దిగువ తెలియపరచినవాటి నిమిత్తం లైసెన్స్ హక్కుల కొరకై టెండర్ దారుల నుండిఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము ద్వార టెండర్లు కోరనైనది.

| క్ర.సం. | ఇ-ప్రొక్యూర్‌మెంట్ / సీల్డ్ టెండర్/బహిరంగ వేలము వివరములు | ధరావత్తు(E.M.D.) | టెండర్ షెడ్యుల్ ధర |
|---|---|---|---|
| 1 | కళ్యాణమండపం పూల అలంకరణ చేసుకొనే హక్కు | రూ.50,000/- | రూ.2000/- |
| 2 | కొబ్బరి కాయలు మరియు పూజ సామాగ్రి అమ్ముకునే హక్కు | రూ.50,000/- | రూ.1000/- |
| 3 | కళ్యాణమండపము నందు హౌస్ కీపింగ్ చేసుకొనే హక్కు | రూ.10,000/- | రూ.1000/- |
| 4 | దేవస్థానమునకు విద్యుత్ అలంకరణ చేయు హక్కు | రూ.10,000/- | రూ.1000/- |
| 5 | దేవస్థానమునకు పర్వదినముల యందు పూల అలంకరణ | రూ. 10,000/- | రూ.2000/- |
| 6 | దేవస్థానము రోజు వారి పూల దండలు సప్లయి చేయు హక్కు | రూ. 10,000/- | రూ.1000/- |
| 7 | సెక్యూరిటీ సర్వీసెస్ లైసెన్సు హక్కు | రూ. 10,000/- | రూ.1000/- |
| 8 | క్యూ లైన్ మరియు తడికెల పందిర్లు ఏర్పాటు చేయు హక్కు | రూ. 10,000/- | రూ.1000/- |
| 9 | దేవస్థానమునకు పాలు, పెరుగు సరఫరా చేయు హక్కు | రూ.2,000/- | రూ.500/- |
| 10 | దేవస్థానమునకు కూరగాయలు సరఫరా చేయు హక్కు | రూ.2,000/- | రూ.500/- |
| 11 | దేవస్థానమున గోశాలకు పశువుల దాన సరఫరా చేయు హక్కు | రూ.2,000/- | రూ.500/- |
| 12 | దేవస్థాన కళ్యాణమండపమునకు విద్యుత్ అలంకరణ చేయు హక్కు | రూ.10,000/- | రూ.1,000/- |

గమనిక:
1. ఆసక్తి గల వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పూర్తి వివరముల కొరకు www.tender.telangana.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.
2. తేది: 30.07.2025 నుండి 07.08.2025 సా 4:00 గంటల వరకు టెండర్ షెడ్యూల్ జారీ చేయబడును.
3. తేది: 08.08.2025 రోజు ఉ.11.00 గం.ల వరకు కొటేషన్స్ (సీల్డ్ టెండర్స్) స్వీకరించబడును.
4. తేది: 08.08.2025 రోజున టెక్నికల్ బిడ్ ఉ.11.30 ని.లకు ప్రైస్ బిడ్ 12.30 ని.లకు తెరువబడును.
6. ప్రైస్ బిడ్ విప్పిన తరువాత టెండరు దారుల సమక్షములో క్ర.సం.1 నుండి 12 వరకు సీల్డ్ కొటేషన్స్ తెరువబడును, తదుపరి బహిరంగ వేలము నిర్వహించబడును.
7. ఇ-ప్రొక్యూర్‌మెంట్ లేదా సీల్డ్ టెండర్‌లో పాల్గొన్న వారిని మాత్రమే బహిరంగ వేలములో పాల్గొనుటకు అనుమతించబడును.
నోట్: ఏ కారణములు తెలుపకనే టెండర్లు రద్దు చేయుటకు గాని వాయిదా వేయుటకు గాని కార్యనిర్వహణాధికారి గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరముల కొరకై దేవస్థాన కార్యాలయము నందు కాని ఫోన్ : 9494252843, 040-23748247 ద్వారా కాని సంప్రదించగలరు.
సి. అర్జున్ యాదవ్, చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి | శ్రీ స్వామివారి సేవలో | యం. శ్రీనివాస శర్మ కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 5730-PP/CL/ADVT/1/2025-26, Date: 29-07-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## కోర్టు టైం వేస్ట్ చేస్తారా?
### హైకోర్టు మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కోర్టు సమయాన్ని వృథా అయ్యే తరహాలో పిటిషన్ వేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది వ్యర్థ పిటిషన్లు వేస్తే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించింది. మృతి చెందిన వ్యక్తి పేరుపై భవనానికి ఇచ్చిన పర్యావరణ అనుమతులను రద్దు చేయాలని గతంలో ఒక పిటిషన్, అప్పటికే రేరాకు ఫిర్యాదు చేసిన వ్యక్తి మళ్లీ హైకోర్టులో రెండో పిటిషన్ వేయడాన్ని తప్పుపట్టింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం హఫీజ్‌పేట్‌లోని పలు సర్వే నెంబర్లల్లోని భూమిలో హైరైజ్ బిల్డింగ్‌ల నిర్మాణ అనుమతులపై శ్రీజయవర్ధన్ అనే వ్యక్తి రెండో పిటిషన్ వేయడాన్ని చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ శామ్‌కోషి డివిజన్‌బెంచ్ మంగళవారం విచారించింది. 2019లో కేంద్రం పర్యావరణ, ఇతర అనుమతులు లభించాయని పిటిషనర్ వాదన. దీనిపై ప్రభుత్వం తరపున అదనపు ఏజీ ఇమ్రాన్ ఖాన్ వాదిస్తూ, పిటిషనర్ రేరాకు ఫిర్యాదు చేశారని, గతంలో హైకోర్టులో పిటిషన్ వేశారని, ఇప్పుడు రెండో పిటిషన్ వేశారని చెప్పారు. దీనిపై హై కోర్టు, పిటిషనర్ తీరును తప్పుపట్టింది. పిటిషన్ వెనక్కి తీసుకునేందుకు అనుమతివ్వాలని పిటిషనర్ కోరడంతో హెచ్చరించాక అనుమతి మంజూరు చేసింది.



## పర్యావరణ హితంగా గణేశ్ చతుర్థిని
### తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గణేశ్ పండుగను పర్యావరణ అనుకూల విగ్రహాలకు పూజలు నిర్వహించాలని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రజలను కోరింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి) జారీ చేసిన సవరించిన మార్గదర్శకాలు, తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు (టిజి పిసిబి) పర్యావరణ అనుకూలమైన గణేశ్ చతుర్థి పండుగను నిర్ధారించడానికి సవరించిన మార్గదర్శకాలను జారీ చేసింది. విగ్రహ నిమజ్జనానికి సంబంధించి పెరుగుతున్న పర్యావరణ ఆందోళనల దృష్ట్యా, సిపిసిబి ఈ క్రింది కీలక ఆదేశాలను జారీ చేసింది. ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ లేదా ఇతర బయోడెగ్రడబుల్ చెందని పదార్థాలకు బదులుగా సహజ బంకమట్టితో తయారు చేసిన పర్యావరణ అనుకూల విగ్రహాలను ఉపయోగించాలి. నీటి వనరుల రసాయన కాలుష్యాన్ని తగ్గించడానికి విగ్రహాలను చందనం (గంధం), పసుపు, గెరువా (ఎర్ర ఓచర్) వంటి బయోడిగ్రేడబుల్ ఆర్గానిక్ రంగులతో అలంకరించాలి. స్థానిక అధికారులు విగ్రహ నిమజ్జనం కోసం ప్రత్యేకంగా తాత్కాలిక కృత్రిమ చెరువులు లేదా ట్యాంకులను సృష్టించి నిర్వహించాలి. సహజ జల వనరులను రక్షించడానికి ఈ నిర్మాణాలను నిమజ్జన కాలం అంతటా నిర్వహించాలి. పర్యావరణ ప్రమాదాలను నివారించడానికి నిమజ్జన చెరువులలో నిలిచిపోయిన అన్ని రకాల మురుగునీటిని పటిక లేదా సున్నం ఉపయోగించి ముందే శుద్ధి చేయాలి. నిమజ్జన ప్రక్రియలో ఉత్పన్నమయ్యే ఘన వ్యర్థాలను 2016 ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు ప్రకారం సేకరించి పారవేయాలి. పౌరులు, మట్టి విగ్రహ తయారీదారులు, పూజా పండళ్లు, విక్రేతలు మార్గదర్శకాలను పాటించాలని, పర్యావరణ స్పృహతో కూడిన వేడుకలలో పాల్గొనాలని కోరారు. ఈ చొరవకు మద్దతుగా విద్యా ప్రచారాలు, అవగాహన డ్రైవ్‌లు నిర్వహించబడతాయి. నదులు, నీటి వనరులను రక్షించడం, నీటి నాణ్యతను మెరుగుపరచడం కోసం చేసే ఈ చర్యలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. స్థానిక సంస్థలు, ఈ ఆదేశాల అమలు చేసే సంస్థల సమన్వయంతో టిజి పిసిబి, సిపిసిబి ఈ మార్గదర్శకాల అమలును పర్యవేక్షిస్తాయి.

# జూబ్లీహిల్స్‌లో స్థానిక నేతకే టికెట్ ఇస్తాం
### జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోనే జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నిక కోసం అధికార కాంగ్రెస్ పార్టీ సన్నహాలు ప్రారంభించింది. గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సంచలన వ్యాఖలు చేశారు. ఇందిరానగర్ భద్రాచలం కేప్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ టికెట్ ఎవరికి కేటాయించాలన్న విషయాన్ని పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. ఉప ఎన్నికలో అభ్యర్థిగా పక్కా స్థానిక అభ్యర్థినే రంగంలోకి దింపనున్నట్లు స్పష్టత ఇచ్చారు. అభ్యర్థి ఎవరైనా ఐక్యంగా పని చేసి కాం గ్రెస్ జెండా ఎగురేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నిక ఫలితమే రిపీట్ కానున్నట్లు విశ్వసం వ్యక్తం చేశారు. బలమైన అభ్యర్థి కోసం క్షేత్ర స్థాయిలో సర్వే చేయిస్తున్నట్లు, టికెట్ అభ్యర్థిస్తున్న నేతల్లో కొందరు లోకల్ లీడర్లకు సానుకూలమైన మార్కులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ క్యాడర్ కూడా లోకల్ లీడర్‌కు అవకాశమిస్తే గెలిపించుకుంటామని చెబుతుండటంతో వారి అభ్యర్థన మేరకు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం ఉండనున్నట్లు వెల్లడించారు. ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని వివరించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరానికి సంబంధించి గత ప్రభుత్వం నగర శివారులో కొల్లూరులో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించినప్పటికీ, అక్కడ కి పోయే పరిస్థితి లేదన్నారు. నిరుపేదలకు ఉపాధి నగరంలో ఉండగా, వారికి ఊరవతల ఇండ్లు నిర్మించటంతో వారు అక్కడ ఉండలేకపోతున్నారన్నారు. కానీ తమ ప్రభుత్వం పేదలు నివసించే ప్రాంతంలోనే ఇల్లు కట్టాలని ప్రణాళికలను అమలు చేస్తుందని చెప్పారు. స్థలాలు ఉన్న వారికి ఇల్లు మంజూరు చేయడంతో పాటు స్థలాలు లేని వారికి ఎలా ఇళ్లు ఇవ్వాలన్నదే తాము ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నూతన్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, హైదరాబాద్‌లో దాదాపు 50 వేల రేషన్ కార్డులు తనిఖీలు పూర్తయ్యాయన్నారు. 2 లక్షల 80 వేల యూనిట్లు ఆరు కిలోల సన్న బియ్యం తీసుకునే అవకాశం లబ్దిదారులు పొందరాని తెలిపారు.

### స్థానికతపై సాంకేతాలతో జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌లో నయా జోష్..

స్థానిక నేతనే బరిలో దింపుతామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టమైన సాంకేతాలు ఇవ్వడంలో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ శ్రేణుల్లో నయా జోష్ నెలకొంది. స్థానికత ప్రతిపాదికన ఎంపిక ప్రక్రియ చేపడితే మాజీ కార్పొరేటర్ సీనియర్ నేత గుర్రం మురళి గౌడ్, మరో స్థానిక నేత నవీన్ యాదవ్‌లు టికెట్ రేసులో ఉన్నారు. మురళి గౌడ్, నవీన్ యాదవ్‌లు టికెట్ కోసం తీవ్రంగా పోటీపడుతున్నారు. అభ్యర్థి ఎంపికపై పార్టీ అధిష్టానం వివిధ మార్గాల్లో సర్వేలు జరిపిస్తుంది. ఈ సర్వేల ఆధారంగా అభ్యర్థిని ఎంపిక ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార పార్టీ టికెట్ కోసం స్థానికేతరులైన లీడర్ల పేర్లే ఎక్కువగా విన్పిస్తుండగా, ఈ సారి స్థానిక నేతకే టికెట్ కేటాయిస్తే తాము గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని స్థానిక పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. ప్రధానంగా హైదరాబాద్ రాజకీయాల్లో బిసి సామాజిక వర్గానికి చెందిన గౌడ్, యాదవ్ నేతలు కీలక పాత్ర పోషిస్తుంటారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరపైన సిటీ రాజకీయాల్లో దివంగత మాజీ మంత్రి ముఖేష్ గౌడ్, యాదవ్ కులానికి చెందిన తలసాని శ్రీనివాసయాదవ్ టిడిపి, బిఆర్‌ఎస్ పార్టీల నుంచి ప్రాతినిధ్యం వహించారు. వీరిలో తలసాని శ్రీనివాసయాదవ్ ఇప్పటికి సనత్‌నగర్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతుండగా, హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీలో ఒక్క నియోజకవర్గం నుంచి కూడా గౌడ్ సామాజిక వర్గానికి చెందిన నేతల ప్రాతినిధ్యం లేదు. యాదవ్ సామాజిక వర్గానికి వస్తే అనిల్ కుమార్ యాదవ్‌ను ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యునిగా అవకాశమిచ్చింది. తాజాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక టికెట్ రేసులో స్థానిక నేత, మాజీ కార్పొరేటర్ మురళీ గౌడ్ ఉన్నారు. బిసి రిజర్వేషన్లు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బిసి గౌడ్ కులానికి చెందిన మురళి గౌడ్‌కు టికెట్ కేటాయిస్తే ఉప ఎన్నికలో అధికార పార్టీ గెలుపు సులువవుతుందని స్థానిక పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. పైగా మురళీ గౌడ్ ఓ దఫా కార్పొరేటర్ గా, ఆ తర్వాత ఆయన కుమారుడు సంజయ్ మరో సారి కార్పొరేటర్‌గా అనేక అభివృద్ధి పనులు చేపట్టి, క్లాస్ ప్లస్ మాస్ ఓటర్లతో సత్సంబంధాలున్నట్లు, ఆ సంబంధాలు ఆయన గెలుపుకు దోహదపడుతాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మిగిలిన స్థానికేతర నేతలకు టికెట్లు కేటాయిస్తే వారు కనీసం ప్రజలకు కూడా అందుబాటులో ఉండరని, మురళి గౌడ్ అయితే నియోజకవర్గంలోనే నివాసం, వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తూ అందరికీ అందుబాటులో ఉంటారని స్థానిక పార్టీ శ్రేణుల అభిప్రాయంగా ఉందని తెలిసింది.

## డిఎస్‌సి–2003 టీచర్లకు పాత పెన్షన్ : హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ : డిఎస్‌సి–2003 నోటిఫికేషన్ కింద భర్తీ అయిన టీచర్లకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని హైకోర్టు తీర్పు చెప్పింది. 2003 నోటిఫికేషన్ ప్రకారం నియమితులైన తమకు పాత పెన్షన్ విధానం కాకుండా కాం ట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని అమలు చేయడం చెల్లదన్న పిటిషనర్ల వాదనను ఆమోదించింది. ఈ మేరకు జస్టిస్ నగేష్ భీమపాక మంగళవారం తీ ర్పు చెప్పారు. నోటిఫికేషన్ జారీ, ఆపై నియామక ప్రక్రియ పూర్తి వివరాలను పరిగణనలోకి తీసుకుని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్న పిటిషనర్ల వాదనను ఆమోదిస్తున్నట్లు తెలిపారు. పిటిషనర్ల లాయర్లు వాదిస్తూ, 2003 కింద నోటిఫికేషన్ కింద నియమితులైన పిటినర్లకు 2004 ఆగస్టు 31 వరకు అమల్లో ఉన్న పాత పెన్షన్ విధానాన్ని అమ లు చేయాలని, అలా చేయకుండా 2004 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని అమలు చేయడం చెల్లదని చెప్పారు. 2003 నాటికి ముందున్న టీచర్ పోస్టుల ఖాళీల భర్తీకి 2003లో నోటిఫికేషన్ వెలువడిందని,ఈ ఎంపిక ప్రక్రియ 2004 జూన్ నాటికి పూ ర్తయ్యిందని, అయితే, పాలనాపర ఆలస్యంతో 2005 నవంబర్‌లో నియామక ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. దీని ఫలితంగా కాంట్రిబ్యూటరీ పె న్షన్ పథకాన్ని అమలు చేశారని, దీంతో డీఎస్సీ– 2008 నోటిఫికేషన్ కింద నియమితులైన వాళ్లకు అన్యాయం జరుగుతోందన్నారు వాదనల తర్వాత హైకోర్టు.. పాలనాపరమైన కారణంగా జాప్యం చేయడం వల్ల జూన్‌లో నియామక ప్రక్రియ పూర్తయినప్పటికీ నియామకాలు జాప్యం అయ్యాయని గుర్తించింది. పిటిషనర్లు నష్టపోవడానికి వీల్లేదని, డీఎస్సీ–2008 నోటిఫికేషన్ కింద నియమితులైన వాళ్లకు పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తూ తీర్పు చెప్పింది.

# మెరిట్ ఆధారంగానే గురుకులాల్లో అడ్మిషన్లు

- 31న 'ఇంటర్'లో స్పాట్ అడ్మిషన్లు
- ముగిసిన 5 నుంచి 9వ తరగతి అడ్మిషన్లు..
- డబ్బులతో అడ్మిషన్ ఇప్పిస్తామంటే నమ్మొద్దు : అలుగు వర్షిణి



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లోని అన్ని పాఠశాలల్లో ప్రవేశాలన్నీ పూర్తిగా మెరిట్ ఆధారంగా జరుగుతున్నాయని టిజిడబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి డాక్టర్ వి.ఎస్. అలగు వర్షిణి స్పష్టం చేసారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని టిజిడబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అలుగు వర్షిణి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అన్ని సీట్లు ఇప్పటికే భర్తి చేశామని,అడ్మీషన్లు ఇప్పిస్తామని చెబుతున్న వారి మాటలు విని మోసపోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. సీటు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, మెరిట్ ద్వారా మాత్రమే సీటు దక్కుతుందన్నారు. ఇంటర్‌లో అడ్మిషన్ నిమ్మితం ఈనెల 30(బుధవారం ) నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో ఖాళీ సీట్ల జాబితాను అందుబాటులో పెడుతామని, అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు 10వ తరగతి మార్కుల మెమో, జనన ధృవీకరణ పత్రం లేదా టిసి, కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు.ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ. 2లక్షల లోపు ఉండాలని, సిబిఎస్ఇ,ఐసిఎస్ఇ సహా ఇతర గుర్తింపు పొందిన బోర్డుల విద్యార్థులు కూడా అర్హులేనని ఆమె వివరించారు. ప్రవేశాల విధానంలో 75 శాతం సీట్లు ఎస్‌సి విద్యార్థులకు, 25 శాతం ఇతర వర్గాలకు కేటాయించామని, మెరిట్ ఆధారంగా ఆ సీట్లను అర్హులైన వారిని ఎంపిక చేస్తామన్నారు. 'సీట్లు ఇప్పిస్తామని ఏజెంట్లు, మధ్యవర్తులు అడ్మిషన్లు ఇప్పిస్తామంటే మోసపోవద్దని, వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రత్యేక పరిస్థితుల్లో అర్హత ఉన్న విద్యార్థులకు మాత్రమే, సంబంధిత జిల్లా స్థాయి కమిటీల అనుమతి మేరకు అవసరమైన ధృవపత్రాలతో ప్రవేశాలు కల్పిస్తామని వివరించారు.

### ఆహార సరఫరాలో సంస్కరణలు...

సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు ఆహార సరఫరా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టామని అలగువర్షిణి అన్నారు. పిల్లలకు నాణ్యమైన, పోషకాహార భోజనాలు అందించేందుకు కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని (సెంట్రలైజడ్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ) రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు తక్కువ బిడ్డింగ్‌ను కోడ్స్ చేసి,టెండర్లను దక్కించుకుని, తక్కువ నాణ్యత గల ఆహారాన్ని సరఫరా చేసే విధానానికి చెక్ పెట్టామని తెలిపారు. ఈ కొత్త విధానంలో జిల్లా కలెక్టర్ల సమక్షంలో, జిల్లా కొనుగోలు కమిటీల పర్యవేక్షణలో డైట్ ప్రొవిజన్స్, కూరగాయలు వంటి వస్తువులు జిల్లా స్థాయిలో కొనుగోలు చేస్తారని అన్నారు . మాంసం కోసం మండల స్థాయిలో టెండర్లను ఆహ్వానిస్తామని, అర్హత కలిగిన టెండర్లలో లాటరీ విధానాన్ని అనుసరించి, విక్రేతల ఎంపిక జరుగుతుందన్నారు. కొనుగోలు ప్రక్రియలో స్థానిక మహిళా సంఘాలు, మండల మహిళా సమాఖ్యలు, యువజన సంఘాలను భాగస్వాములుగా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వర్షిణి అన్నారు.

# దూకుడు పెంచిన హైడ్రా

- అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం
- మూసీ నది గర్భంలో ఆక్రమణల తొలగింపు



ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరం నడిబొడ్డున, ఎంజిబిఎస్, హైకోర్టు ఒక వైపు, మరో వైపు ఉస్మానియా ఆసుపత్రి.. ఇలా వేలాది మంది సంచరించే ప్రాంతంలో కబ్జాల పర్వం కొనసాగింది. మూసీ నది గర్భంలో 20 నుంచి 25 మీటర్ల మేర మట్టిని నింపి రోడ్డుకు సమాంతరంగా చేసి ఆక్రమణలకు ఒడికట్టారు. ఆ ఆక్రమణలను హైడ్రా మంగళవారం తొలగించింది. ఉదయం 6 గంటలకు ప్రారంభించి, మధ్యాహ్నం 1 గంటకు పూర్తి చేసింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి 9.62 ఎకరాల భూమిని కాపాడింది. వాహనాల పార్కింగ్, పండ్లను నిలవ ఉంచేందుకు ఫ్రీజర్ల ఏర్పాటుతో పాటు నర్సరీ పేరిట నిర్వహిస్తున్న అక్రమ వ్యాపారానికి హైడ్రా అడ్డుకట్ట వేసింది. చాదరఘాట్ బ్రిడ్జి నుంచి పాత బస్తీ ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వరకు పలు ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించింది. మూసీ ఆక్రమణలపై ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా చర్య లు తీసుకుంది. షెడ్డులు వేసుకుని నివాసముంటు న్న వారి విషయంలో ఇబ్బంది లేకుండా జాగ్రత్త పడింది.

### కోర్టు ధిక్కరణ కేసులున్నా కొనసాగిన కబ్జాలు..

తికారం సింగ్ 3.10 ఎకరాల మేర కబ్జా చేశారు. 1.30 ఎకరాల మేర పూనమ్ చాంద్ యాదవ్ ఆక్రమించారు. 5.22 ఎకరాల మేర జయకృష్ణ కబ్జా చేశారు. వీరిపై కోర్టు దిక్కరణ కేసులు కూడా ఉన్నాయి. ఈ కబ్జాలపై హైకోర్టు గతంలోనే కన్నెర్ర జేసింది. వెంటనే ఆక్రమణలను తొలగించాలని కూడా రెవెన్యూ అధికారులను ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల మేరకు నాటి హైదరాబాద్ కలెక్టర్ వారిపై కేసులు కూడా పెట్టారు. ఇలా కోర్టు ధిక్కరణతో పాటు పోలీసు కేసులకు వెరవకుండా కబ్జాల పర్వం కొనసాగించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రధానంగా వాడారు. పండ్లను నిలువ చేసేందుకు ఫ్రీజర్లు కూడా ఏర్పాటు చేశారు. నర్సరీని కొంత మేర పెంచి వ్యాపార దందా కొనసాగిస్తున్నారు. అక్కడ కార్యాలయాల నిమిత్తం చిన్న షెడ్డులు కూడా నిర్మించారు. ఒక్కో వాహనానికి రోజుకు రూ. 300ల వరకూ వసూలు చేసి బస్సులు, లారీల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. నదీ గర్భంలోకి ఆక్రమణలకు పాల్పడి వ్యాపారాలు చేయడమే కాకుండా, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు పరిసర ప్రాంతాల ప్రజలు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

### 20 మీటర్ల మేర మట్టితో నింపి..

ఒకటి రెండు రోజుల్లో జరిగిన ఆక్రమణలు కావివి. మూసీ నదికి నిజాం కాలంలో రాతితో కట్టిన రిటైనింగ్ వాల్ స్పష్టంగా ఉంది. నదిలోంచి పైన రోడుకు సమాంతరం చేసేందుకు వేలాది లారీలతో మట్టిని, నిర్మాణ వ్యర్థాలను పోశారు. ఇలా దశాబ్దాలుగా మూసీ నదిలో మట్టిని పోసి 20 మీటర్లకు పైగా నింపారు. అఫ్జల్‌గంజ్ రహదారికి సమాంతరంగా నదిని మార్చేశారు. వందల వేలాది బస్సులు, లారీల పార్కింగ్‌కోసం వినియోగిస్తుంటే వాటిని ఖాళీ చేయించారు. షెడ్డులు వేసుకుని వ్యాపారం చేస్తుంటే వాటిని తొలగించి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఇక్కడ ఫొటోలు చూస్తే.. వాహనాల పార్కింగ్‌తో మూసీ ఎలా నిండి ఉంది, తర్వాత ఎలా ఖాళీ అయ్యిందనేది స్పష్టమౌతుంది. మూసీ పరీవాహకం కబ్జాలను తొలగించిన హైడ్రాకు స్థానికులు అభినందనలు తెలిపారు.

### మూసీ సుందరీకరణతో సంబంధం లేదు..

మూసీ సుందరీకరణ పనులతో హైడ్రాకు సంబంధం లేదు. నదిలో ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించడం వరకే హైడ్రా పరమితమైంది. మూసీని మట్టితో నింపి వ్యాపారానికి అడ్డాగా మార్చుకోవడంపైనే హైడ్రా చర్యలు తీసుకుంది. మూసీ సుందరీకరణ, అభివృద్ధిలో హైడ్రా భాగస్వామ్యం అవ్వడంలేదని స్పష్టం చేసింది. ఓఆర్ఆర్ పరిధిలో నాలాలు, చెరువులు, పార్కులు, రహదారుల కబ్జాలను తొలగించిన మాదిరే మూసీ నదిలో ఆక్రమణలను తొలగించామని హైడ్రా పేర్కొంది.

## పరిగి నుంచి కాంగ్రెస్ పాదయాత్ర ప్రారంభం
### వర్ధన్నపేటలో మొదటి దశ యాత్ర ముగింపు



ప్రజాపక్షం / హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించేందుకు చేపట్టిన పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాలు మొదటి విడతగా ఈ నెల 31వ తేదీన పరిగిలో ప్రారంభమై ఆగస్టు 6వ తేదీన వర్ధన్నపేటలో ముగుస్తుందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ ప్రకటించారు. మొదటి దశలో రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలో పరిగి, మెదక్ జిల్లాలో ఆందోల్, నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, ఆదిలాబాద్ జిల్లాలో ఖానాపూర్, కరీంనగర్ జిల్లాలో చొప్పదండి, వరంగల్ జిల్లాలో వర్ధన్నపేటలో పాదయాత్రలు జరుగుతాయని వెల్లడించారు. ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్.కుమార్‌గౌడ్ అధ్యతన పది ఉమ్మడి జిల్లాల ఇంచార్జ్‌లు,ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శిలతో సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. సమావేశం అనంతరం మహేష్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ బిసిల గురించి కవిత పదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండు చట్టాలు తీసుకొచ్చామని, ఎవరెన్ని చెప్పినా బిసిలకు కాంగ్రెస్ న్యాయం చేస్తుంది అనడానికి టిపిసిసి అధ్యక్షునిగా తాను, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క నిదర్శనమన్నారు. గంగుల కమలాకర్ పదేళ్లు మంత్రిగా ఉండి బిసిల రిజర్వేషన్‌ను తగ్గిస్తే ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముఖేష్ గౌడ్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీకి సేవ చేశారని, ముఖేష్‌గౌడ్, శివశంకర్ విగ్రహం పెట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగుతున్నారని, ఈ విషయంపై సిఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

## రాజీవ్ స్వగృహ ఫ్లాట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లోని బండ్లగూడ, పోచారం ప్రాంతాల్లోని రాజీవ్ స్వగృహ కా ర్పొరేషన్ ఆధ్వర్యంలోని ఫ్లాట్ల కొనుగోలుకు ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. బండ్లగూడ, పోచారంలలోని ఫ్లాట్ల కోసం సుమారు 1900 మం దికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారంనాడు 600లకు పైగా దరఖాస్తులు అందాయి. దీం తో బుధవారం ఉదయం ఫ్లాట్ల కేటాయింపులకు సం బంధించి లాటరీ ప్రక్రియను బండ్లగూడ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభించనున్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతం తెలిపారు. బండ్లగూడలో ప్రాజెక్టులో ఇఎండి చెల్లించినట్లు ఇచ్చిన రశీదులను పోచారం ప్రాజెక్టులో సమర్పించి, అక్కడి ఫ్లాట్ల కొనుగోలుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో తొర్రూర్, బహదూర్ పల్లి, కుర్మల్ గూడా ప్రాంతాల్లోని ఆగస్టు 4,5,6 తేదీల్లో జరిగే ఓపెన్ ఫ్లాట్ల విక్రయానికి బండ్లగూడలో పొం దిన రశీదుతో వేలంపాటలో పాల్గొనాలని ఆయన వివరించారు.

### 'పోచారం'కు రేపటితో గడువు ముగింపు

ఘట్‌కేసర్ పోచారం ప్రాంతంలోని 601 ఫ్లాట్ల విక్రయానికి రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఈ నెల మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 31చివరి గడువు విధించారు. లాటరీ ప్రక్రియను ఆగస్టు 1,2 తేదీల్లో నిర్వహించనున్నారు. నోలాస్, నో ప్రాఫిట్ విధానంలో (లాభాపేక్ష లేకుండా) నిర్మాణానికి అయిన వ్యయంతోనే వీటిని విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించినంది. పోచారం ప్రాంతంలో సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ ధర కేవలం రూ. 13 లక్షలు కాగా, డబుల్ బెడ్ రూమ్ రూ. 19 లక్షల్లో అందుబాటులో ఉన్నది. అన్ని రకాల సదుపాయాలతో పాటు కబ్ బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి కాగానే గృహప్రవేశం చేసేందుకు వీలుగా ఫ్లాట్లు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎండి వి.పి గౌతం విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడం 'ప్రజా ప్రతినిధి లక్ష్యం, లక్షణం'
### ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క



ప్రజాపక్షం/వికారాబాద్ /తాండూర్:ప్రజా సమస్యల పరిష్కరించడం ప్రజా ప్రతినిధుల లక్ష్యం, లక్షణమని రాష్ట ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం తాండూర్ నియోజకవర్గంలో రూ.230కోట్ల నిధులతో పలు సంక్షేమ అభివృద్ధికి శంకుస్థాపనలు, రూ.30కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన , రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఐటీ భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి తాండూర్ ఎమ్మెల్యే భయ్యాని మనోహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందనెల్లిలో ఏర్పాటు చేసిన సభలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా సమస్యలు, బాధలను అర్థం చేసుకొని ప్రజాపాలనను చేపట్టడం జరుగుతుందన్నారు. గత పది సంవత్సరాల్లో చేపట్టని పనులన్నింటిని పెద్ద మొత్తంలో నిధులను కేటాయించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతందని మంత్రి తెలిపారు. రాష్టంలో రేషన్ కార్డు లేని అర్హులైన పేదవారికి కార్డులను అందిస్తామని, రాష్టంలో కోటీ 20లక్షల కుటుంబాలకు గాను 95లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులను అందింస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇండ్లు లేని ప్రతి పేదవాడికి ఇంటి నిర్మాణాల నిమిత్తం ప్రతి నియోజకవర్గనికి మొదటి విడుతగా 3500 మంజూరుమంజూరు చేస్తు ,ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుడికి 5లక్షల చొప్పున జమ చేయడం జరుగుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవాడికి వైద్య సదుపాయల నిమిత్తం ఆరోగ్యశ్రీ రూ. 10లక్షలకు అందించడం జరుగుతందని అయన అన్నారు. జనాభ ప్రాతిపదికను బహుజనుల రిజర్వేషన్ 42శాతనికి పెంచుతూ ప్రభుత్వ తీర్మనాన్ని కేంద్రానికి సమర్పించినట్లు అయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఆమోదం తెలుపుతుందని అశిస్తున్నామని మంత్రి అన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలో ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రజలందరికి అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. పరిశ్రమల ఐటి శాఖ మంత్రి శ్రీధర్ మాట్లాడుతూ , సంక్షేమ కార్యక్రమాలు పొందేందుకు రేషన్ కార్డులు ఉన్నవారికి సన్న రకం బియ్యం పొందుతున్నారని దీనివల్ల ఎంతమంది పేదలు లబ్ధి పొందుతున్నారని మంత్రి తెలిపారు. వికారాబాద్ నుండి తాండూర్ వరకు రూ. 63వేల కోట్ల వ్యవయంతో నిర్మాణాలకు నాంది పలకడం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ చీప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటునే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి , అదనపు కలెక్టర్ ఉమశంకర్ ప్రసాద్, ఆర్యవేశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వసుజాత , డిసిసిబి చైర్మన్ సత్తయ్య, తదితరులు పాల్గోన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఉగ్రవాదం ఎప్పటికీ గెలవదు : ఫరూఖ్



**శ్రీనగర్ :** పహల్గామ్ ఉగ్రవాద దాడికి పాల్పడిన వారిని నిర్మూలించడం ఉగ్రవాదం విజయవంతం కాదని ఒక పాఠం అని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా పేర్కొన్నారు. మంగళవారం శ్రీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'నేను వారిని చూడలేదు, వారు ఎవరో నాకు తెలియదు. వారిని చూసిన వ్యక్తులు మాత్రమే గుర్తించగలరు. వారు చంపబడి ఉంటే, అది మంచి విషయం. ఉగ్రవాదం ఎప్పటికీ విజయం సాధించదని వారికి పాఠం నేర్పింది' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. పహల్గామ్ మారణహోమం నిర్వహించిన ముగ్గురు ఉగ్రవాదులను శ్రీనగర్ సమీపంలో సైన్యం, సిఆర్‌పిఎఫ్, జమ్ముకశ్మీర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భద్రతా దళాలు హతమార్చాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం లోక్‌సభలో ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రత్యేక చర్చలో పాల్గొన్న షా, సోమవారం ఆపరేషన్ మహాదేవ్ కింద ఉగ్రవాదులు హతమయ్యారన్నారు. వారిని సులేమాన్ అలియాస్ ఫైజల్, అఫ్ఘని, జిబ్రాన్‌గా గుర్తించినట్లు చెప్పారు.

# కేరళ నన్స్...అరెస్ట్ దిగ్భ్రాంతికరం

**• మానవ అక్రమరవాణా అభియోగాలపై సిపిఐ ఎంపి పి.సంధోష్‌కుమార్ ఆక్షేపణ • ఈ దేశం ఏమైనా 'బనానా రిపబ్లిక్'గా మారిందా? అని విస్మయం వ్యక్తం**



**న్యూఢిల్లీ :** మానవ అక్రమ రవాణా, బలవంతపు మార్పిడి అభియోగాలపై కేరళ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేథలిక్ నన్స్‌ను బిజెపి పాలిత ఛత్తీస్‌గఢ్‌లో అరెస్ట్ చేయడం ఒక వింతను తలపిస్తుందని, ఈ చర్య 'దిగ్భ్రాంతికరం' అని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఎంపి పి.సందోష్‌కుమార్ అన్నారు. ఈ వింత చర్యను చూస్తే ఈ దేశం ఏమైనా 'బనానా రిపబ్లిక్'గా మారిందా ? అని సందోష్‌కుమార్ ప్రశ్నించారు. మీడియా వార్తల ప్రకారం...ఇటీవల కేరళకు చెందిన కేథలిక్ నన్స్ ఛత్తీస్‌గఢ్‌లోని ఒక రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ అయినట్లు వార్తలు ప్రసారం అయ్యాయన్నారు.వారిపై మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడుల అభియోగాలు మోపడం దారుణమన్నారు. ఇది ఒక వింతమాత్రమే కాదు, దిగ్భ్రాంతికరమైన కేసు. మానవ అక్రమరవాణా కేసు ఏదైతే ఉందో అది భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్ 143 కింద అభియోగాలు నమోదు అయ్యాయని, ఈ మానవ అక్రమ రవాణా నేరంలో ఒకరి కంటే ఎక్కువమంది భాగస్వాములైతే 10సంవత్సరాలకు పైగానే జైలుశిక్షకు శిక్షార్హులు అవుతారని కేరళ రాష్ట్ర సిపిఐ నాయకుడు, ఎంపి సందోష్‌కుమార్ మంగళవారం ఇక్కడ 'పిటిఐ' వీడియోస్‌కు ఇచ్చిన 'ఇంటర్వ్యూ'లో చెప్పారు. దుర్గ్ స్టేషన్ నుండి ఆగ్రా స్టేషన్‌కు మానవ అక్రమ రవాణానా? అసలు ఇది అంతా ఏమిటి? ఈ దేశం ఏమైనా బనానా రిపబ్లిక్‌గా మారిపోయిందా? అని ఎంపి సందోష్‌కుమార్ విస్మయం వ్యక్తం చేశారు. బిజెపి పాలనలో మైనారిటీలు అందరినీ లక్ష్యంగా చేసుకుంటున్నారు. నన్స్, ఫాదర్స్ వారి డ్రెస్సు ధరించాలంటేనే భయపడిపోతున్నారని చెప్పారు. ఈ సంఘటన మరోసారి బిజెపి చేత బహిర్గతం అయ్యిందని వామపక్ష నేత, ఎంపి సందోష్‌కుమార్ వెల్లడించారు. దేశంలో గత ఏడాది క్రిస్టియన్లకు వ్యతిరేకంగా 834కు పైగా దౌర్జన్య సంఘటనలు నమోదయ్యాయన్నారు. 'ఈ ఏడాది కూడా ఇలాంటి సంఘటనలు నిరవధికంగా సంభవిస్తున్నాయి. మేం వాటితో రాజీ పడే ప్రసక్తేలేదు. మేం మాత్రం ఇలాంటి వాటిపై నిరవధిక పోరాటం కొనసాగిస్తాం'అని సందోష్ కుమార్ వివరించారు. కుమార్ మాట్లాడుతూ వామపక్ష పార్టీలకు చెందిన ప్రతినిధి బృందం ఒకటి ప్రస్తుతం రాయ్‌పూర్, దుర్గ్‌లను సందర్శిస్తున్నదని చెప్పారు. 'ఈ కేథలిక్ నన్స్‌ను తక్షణమే తప్పకుండా విడుదల చేయాలి. వారికి వ్యతిరేకంగా అభియోగాలు మోపేందుకు ఏ అంశమూ లేదు, మేం దానిపై తప్పకుండా పోరాడతాం' అని ఆయన చెప్పారు. ఈ ఇద్దరు నన్స్ అరెస్ట్ రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రతిపక్షనాయకులు మాట్లాడుతూ ఇది క్రిస్టియన్లపై జరిగిన దాడి అని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఈ అంశంపై మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని, ఆయన 'బస్తర్ నుంచి వచ్చిన మన కూతుళ్ల సురక్షితం పట్ల తనకు ఆందోళనగా ఉందని సాయి చెప్పారు. అయితే కేరళ రాష్ట్ర బిజెపి శాఖ మంగళవారం విష్ణుదేవ్ సాయి వ్యాఖ్యలను తోసిపుచ్చింది. నన్స్ ఎలాంటి మానవ అక్రమ రవాణా, బలవంతపు మార్పిడిలలో భాగస్వామ్యం కాలేదని తేల్చిచెప్పింది.

# 22 మంది చిన్నారులను దత్తత తీసుకోనున్న రాహుల్‌గాంధీ



**రాజౌరి/జమ్ము :** ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జమ్ముకశ్మీర్ పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎల్ఓసి) వెంబడి పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తల్లిదండులిద్దరినీ లేదా అందులో ఒకరిని కోల్పోయిన 22 మంది పిల్లల విద్యకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ స్పాన్సర్ చేస్తారని పార్టీ నాయకుడు ఒకరు తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి భాగస్వామి అయిన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి)తో ఎలాంటి విభేదాలును కూడా ప్రదేశ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా స్పష్టం చేశారు. అయితే గత తొమ్మిది నెలలుగా అధికార పార్టీతో సమన్వయ కమిటీ ఏర్పాటు కోసం తమ పార్టీ వేచి ఉందని అన్నారు. పాకిస్థాన్ కాల్పుల్లో (మే 7–10 మధ్య) చాలా మంది పౌరులు మరణించారు. తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. విధ్వంసకర కాల్పుల తర్వాత రాహుల్ గాంధీ పూంచ్‌ను సందర్శించి, మృతుల కుటుంబాలను పరామర్శించారు. తల్లిదండ్రులను కోల్పోయిన పాఠశాలకు వెళ్లే పిల్లల జాబితాను సిద్ధం చేయాలని ఆయన తమను కోరారని కర్రా చెప్పారు. ముఖ్యంగా అన్నదాతలను కోల్పోయి పాఠశాలకు వెళ్లే పిల్లల జాబితాను సిద్ధం చేయాలన్నారు. తదనుగుణంగా తాము ఆ జాబితాను ఆయనకు సమర్పించామని, మూడు రోజుల పర్యటనలో రాజౌరికి చేరుకున్న కర్రా సోమవారం మీడియాతో మాట్లాడారు. ఒక్క పూంచ్ జిల్లాలోనే 22 మంది పిల్లల జాబితా కాంగ్రెస్ వద్ద ఉందని, మూడు రోజుల పర్యటన ముగింపులో పిల్లల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. జమ్ముకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన షెల్లింగ్, డ్రోన్ దాడుల్లో 28 మంది పౌరులు మరణించగా, అందులో 13 మంది చిన్నారులు ఉన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు మే నెలలో ఆపరేషన్ సిందూర్ కింద సరిహద్దు వెంబడి ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై క్షిపణి దాడులు చేసింది. బాధిత పిల్లల విద్య కోసం ప్రతిపక్ష నాయకుడు పంపిన ఆర్థిక సహాయాన్ని అందజేయడానికి మంగళవారం పూంచ్‌ను సందర్శిస్తున్నట్లు కర్రా చెప్పారు. పిల్లల చదువులు ప్రభావితం కాకుండా వారికి సహాయం అందించడం దీని లక్ష్యమన్నారు.

# సిందూర్‌పై చర్చకు తివారీ, థరూర్ దూరం!

**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో జరిగే చర్చకు కాంగ్రెస్ నేతలు శశిథరూర్, మనీశ్ తివారీలను ఆ పార్టీ దూరం పెట్టింది. దీనిపై తివారీ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అందులో తాను భారత్ వైపే మాట్లాడతానని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచదేశాలకు వివరించడానికి వెళ్లిన అఖిలపక్ష బృందంలో థరూర్, తివారీ ఉన్నారు. ఈ ఆపరేషన్‌పై జరిగే చర్చలో తమను ఎందుకు దూరం పెట్టారనే దానిపై ఓ వార్తా సంస్థ రాసిన కథనాన్ని తివారీ ఎక్స్‌లో పంచుకున్నారు. దానికి పూరబ్ ఔర్ పశ్చిమ్ అనే బాలీవుడ్ సినిమాలోని దేశభక్తి గీతంలో కొన్ని వ్యాఖ్యలను జోడించారు. భారతీయుడిగా తాను దేశ వైభవాన్నే కోరుకుంటాననేది దాని అర్థం. దీనికి ముందు చర్చల్లో తాను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని తివారీ అభ్యర్థన పంపారని పార్టీ వర్గాలు ఓ వార్తా సంస్థకు తెలిపాయి. ఆపరేషన్‌పై జరిగే చర్చల్లో థరూర్ ఉండాలని కాంగ్రెస్ కోరిందని, అయితే, పార్టీ చెప్పినవిధంగా మాట్లాడాలని కోరినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కానీ, దీనికి ఆయన నిరాకరించినట్లు సమాచారం. దీనిపై విలేకరులు ప్రశ్నించగా... మౌనవ్రతం, మౌనవ్రతం అంటూ థరూర్ బదులిచ్చారు.

# టైగర్ రిజర్వ్‌లో 2021 నుంచి 50 శాతం పులులు మృతి



**న్యూఢిల్లీ :** భారతదేశంలో 2021 నుండి 2025 మధ్యలో ఇప్పటి వరకు జరిగిన పులుల మరణాలలో సగానికి పైగా రక్షిత అభయారణ్యాల వెలుపల సంభవించాయని, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలోనే అత్యధిక సంఖ్యలో సంభవించాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టిసిఎ) ప్రకారం నాలుగేళ్లలో 667 పులులు మరణించగా, 341 లేదా 51 శాతం టైగర్ మరణాలు అభయారణ్యాల వెలుపల సంభవించాయి. సంవత్సరాల వారీగా డేటా ప్రకారం 2021లో 129 పులులు, 2022లో 122, 2023లో 182, 2024లో 126, 2025లో ఇప్పటివరకు 108 పులులు మృతి చెందాయి. రిజర్వ్‌ల వెలుపల మరణాల సంఖ్య 2021లో 64, 2022లో 52, 2023లో 100, 2024లో 65, 2025లో ఇప్పటివరకు 60గా ఉంది. మహారాష్ట్రలో అత్యధికంగా 111 పులులు అభయారణ్యాల వెలుపల మరణించగా, మధ్యప్రదేశ్‌లో 90 మరణాలు సంభవించాయి. 2021లో మహారాష్ట్రలో 23, మధ్యప్రదేశ్‌లో 18, కేరళలో ఐదు, తెలంగాణాలో నాలుగు చనిపోయాయి. 2022లో మహారాష్ట్రలో 18, మధ్యప్రదేశ్‌లో 12, కేరళ, ఉత్తరాఖండ్‌లో నాలుగు చొప్పున ప్రాణాలు కోల్పోయాయి. 2023లో మహారాష్ట్రలో అభయారణ్యాల వెలుపల 34, మధ్యప్రదేశ్‌లో 13, కేరళ, ఉత్తరాఖండ్‌లో 11 చొప్పున, కర్ణాటకలో ఆరు పులులు మృతి చెందాయి. 2024లో మధ్యప్రదేశ్‌లో 24, మహారాష్ట్రలో 16 పులులు అభయారణ్యాల వెలుపల మరణించాయి. ఈ సంవత్సరం, ఇప్పటి వరకు మహారాష్ట్రలో అభయారణ్యాల వెలుపల 20, మధ్యప్రదేశ్‌లో 13, కేరళలో ఎనిమిది, కర్ణాటకలో ఏడు పులులు అభయారణ్యాల వెలుపల మరణించాయి. 2012– 2024 మధ్య 1,519 పులులు అభయారణ్యాల వెలుపల మరణించగా, 634 లేదా 42 శాతం మరణాలు అభయారణ్యాల వెలుపల సంభవించాయని ఎన్‌డిసిఎ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుత భారతదేశంలోని అంచనా వేసిన 3,682 పులులలో దాదాపు 30 శాతం నోటిఫైడ్ టైగర్ రిజర్వ్‌ల వెలుపల నివసిస్తున్నాయి. ఈ ప్రాంతాలలో పెరుగుతున్న మానవ–పులుల సంఘర్షణను పరిష్కరించడానికి, ప్రభుత్వం త్వరలో టైగర్స్ అవుట్‌సైడ్ టైగర్ రిజర్వ్ (టిఓటిఆర్) ప్రాజెక్టును ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది 17 రాష్ట్రాలలో 80 అటవీ విభాగాలను కవర్ చేస్తుంది. 2022లో నిర్వహించిన తాజా పులుల జనాభా అంచనా ప్రకారం, మధ్యప్రదేశ్‌లో దాదాపు 785 పులులు, కర్ణాటకలో 563, ఉత్తరాఖండ్‌లో 560, మహారాష్ట్రలో 444, తమిళనాడులో 306, అసోంలో 229, కేరళలో 213, ఉత్తరప్రదేశ్‌లో 205 పులులు ఉన్నాయి.

# రోజుకో రీతిలో విపక్షాల నిరసన



**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా మంగళవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ఇండియా కూటమి పార్టీలకు చెందిన పలువురు ఎంపిలు నిరసన తెలిపారు. పార్లమెంట్‌లో కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందు కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఆర్‌జెడి, వామపక్ష పార్టీలతో సహ పలువురు ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంటు మకర ద్వారం మెట్లపై జరిగిన నిరసనలో పాల్గొని నినాదాలు చేశారు. 'ఓట్ కి చోరి బంద్ కరో (ఓట్ల దొంగతనాన్ని ఆపండి)' 'సిఆర్ వాపస్‌లో (రోల్‌బ్యాక్ సిఆర్)' వంటి నినాదాలు చేశారు. 'ఓట్ల దోపిడీని ఆపండి' అని వ్రాసిన ప్లకార్డులతో పాటు ఇసి, ప్రభుత్వం మధ్య 'కుట్ర'ను చిత్రీకరించే ప్లకార్డులను కూడా ప్రతిపక్ష ఎంపిలు ప్రదర్శించారు. కాగా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సిఆర్)కు వ్యతిరేకంగా పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్‌లో ప్రతిపక్షాలు ప్రతిరోజూ వేర్వేరు పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ఓటర్ల ఓటు హక్కును తొలగించడమే లక్ష్యంగా ఇసి చేపట్టిన కసరత్తు ఉందని ఆరోపిస్తున్నారు. ఉభయ సభల్లోనూ ఈ అంశంపై చర్చ జరగాలని కూడా వారు డిమాండ్ చేస్తున్నారు.

### రాజ్యసభలో వాయిదాల పర్వం

బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితాతో సహా వివిధ అంశాలపై చర్చించడానికి ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా నోటీసులను తిరస్కరించిన తర్వాత రాజ్యసభ కార్యకలాపాలు మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. ఉదయం జాబితా పత్రాలు సభ్యులకు అందించిన తర్వాత, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలస కార్మికులపై వివక్ష చూపుతున్నారని, ఉపాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా వంటి వివిధ అంశాలపై చర్చ కోరుతూ రూల్ 267 కింద తనకు 24 నోటీసులు వచ్చాయని చెప్పారు. అయితే ఆయన వాయిదా నోటీసులను తిరస్కరించారు. దీనిపై విపక్ష సభ్యులు నిరసించారు. నిరసనలు కొనసాగుతుండగా, కార్యకలాపాలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

### లోక్‌సభలో సజావుగా ప్రశ్నోత్తరాలు

21వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత మంగళవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయం సజావుగా సాగింది. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతో సభలో పదే పదే గందరగోళం నెలకొన్న విషయం విదితమే. అయితే సోమవారం సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై చర్చ జరుగుతుందని ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు మొదటి అర్ధభాగంలో అంతరాయం కలిగించాయి. ఆరు రోజుల తరువాత ప్రశ్నోత్తరాల సమయాన్ని మంగళవారం అంతరాయం లేకుండా జరిగింది. కీలక మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలు చర్చకు వస్తున్నందున, ప్రభుత్వం జవాబుదారీగా ఉండడంతో సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో పాల్గొనాలని స్పీకర్ ఓం బిర్లా విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రపతి బిల్లుల ఆమోదంపై 19 నుంచి విచారణ

**న్యూఢిల్లీ:** రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా తేల్చాలని కోర్టులు నిర్దేశించవచ్చా అన్న అంశంపై ఆగస్టు 19 నుంచి విచారణ జరగనుంది. ఈ విషయంపై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఇప్పటికే అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆగస్టు 12లోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని పేర్కొంది. శాసనసభలు ఆమోదించిన బిల్లులపై ఆయా రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్టకాల వ్యవధిలోగా చర్యలు తీసుకోవాలని ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనిపై స్పందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తనకు రాజ్యాంగంలోని 143(1) అధికరణం ద్వారా సంక్రమించిన అధికారాలు ఉపయోగించుకొని 14 కీలక ప్రశ్నలను అత్యున్నత న్యాయస్థానం ముందుంచారు. ప్రజా ప్రయోజనంతో ముడిపడివున్న చట్టపరమైన అంశాలపై రాష్ట్రపతి సుప్రీం కోర్టు అభిప్రాయం తెలుసుకునేందుకు ఆ కోర్టు ముందు తన ప్రశ్నలను ఉంచవచ్చని, సుప్రీంకోర్టు దానిపై విచారణ జరిపి తన అభిప్రాయాన్ని రాష్ట్రపతికి తెలియజేయవచ్చని 143(1) అధికరణం తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలోనే వచ్చే నెల విచారణ జరగనుంది.

# బస్సు–ట్రక్కు ఢీకొని ఆరుగురు కన్వారియాలు మృతి

**24 మందికి గాయాలు**

**రాంచీ/డియోఘర్ :** జార్ఖండ్‌లోని డియోఘర్ జిల్లాలో మంగళవారం భక్తులతో వెళ్తున్న బస్సు, వంట గ్యాస్ సిలిండర్లతో నిండిన ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో కనీసం ఆరుగురు కన్వారియాలు మృతి చెందగా, 24 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మోహన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జమునియా అటవీ ప్రాంతంలో ఉదయం 5.30 గంటల ప్రాంతంలో బస్సుట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని వారు తెలిపారు. దేయోఘర్‌లోని జమునియా చౌక్‌లో జరిగిన ప్రమాదంలో ఆరుగురు భక్తులు మరణించగా, 24 మంది గాయపడ్డారని, గాయపడిన 24 మందిలో ఎనిమిది మందిని దేవోఘర్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. మిగిలిన వారు సదర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని దేవోఘర్ డిప్యూటీ కమిషనర్ నమన్ ప్రియేష్ లక్రా తెలిపారు. ముందుగా, కన్వారియాలతో కూడిన బస్సు గ్యాస్ సిలిండర్లను రవాణా చేస్తున్న ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఇన్‌స్పెక్టర్ జనరల్ (దుమ్కా జోన్) శైలేంద్ర కుమార్ సిన్హా పిటిఐకి తెలిపారు.ఢీకొన్న తర్వాత, డ్రైవర్ బస్సు నుండి పడిపోయాడు. స్టీరింగ్ వీల్ వెనుక ఎవరూ లేకుండా వాహనం కొంతసేపు కదులుతూనే ఉండి, ఇటుకల కుప్పను ఢీకొన్న తర్వాత ఆగిపోయిందని ఐజి చెప్పారు. అయితే, ఎంపి నిషికాంత్ దూబే, ప్రమాదంలో 18 మంది కన్వారియాలు మరణించారని 'ఎక్స్'లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆరుగురు మాత్రమే ప్రాణాలు కోల్పోయారని పోలీసులు నిర్ధారించగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో కనీసం 24 మంది కన్వారియాలు గాయపడి, దుమ్కాలోని సరయ్యహాత్ పిహెచ్‌సితో సహా వివిధ ఆసుపత్రులు, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించబడ్డారని మరో అధికారి తెలిపారు. అనేక మంది గాయపడిన వారి పరిస్థితి తీవ్రంగా ఉన్నందున ప్రాణ నష్టం పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. ప్రమాదం తర్వాత జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని ఆయన అన్నారు. దేయోఘర్ సబ్ డివిజనల్ ఆఫీసర్ రవి కుమార్ మాట్లాడుతూ కన్వారియాలు బాసుకినాథ్ ఆలయానికి వెళ్తున్నారని అన్నారు. సివిల్ సర్జన్, దేయోఘర్ తెలిపిన వివరాల ప్రకారం, మరణించిన వారిలో బస్సు డ్రైవర్ సుభాష్ టూరి, ఇతరులు గయాకు చెందిన సుమన్ కుమారి, పీయూష్, వైశాలి, దుర్గావతి దేవి, బెట్టియాకు చెందిన జాంకీ దేవి ఉన్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఎక్స్'లో సంతాపం తెలిపారు.

# మాటమార్చిన చిరాగ్ పాశ్వాన్



**పట్నా:** కేంద్రమంత్రి, లోక్‌జనశక్తి పార్టీ(పాశ్వాన్) అధినేత చిరాగ్ పాశ్వాన్ మాటమార్చారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. నితీశ్ సర్కారుకు మద్దతిచ్చినందుకు చింతిస్తున్నానని ఇటీవల విమర్శించిన చిరాగ్... తాజాగా యూటర్న్ తీసుకోవడం గమనార్హం. ఇక్కడ ఓ కార్యక్రమంలో పాల్గొన్న చిరాగ్ మాట్లాడుతూ 'ప్రధాని మోదీపై నా ప్రేమ, నిబద్ధత నిరంతరం ఉంటాయని ఉద్ఘాటిస్తున్నా. మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల ఫలితాల అనంతరం నితీశ్ మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారు. కచ్చితంగా ఆయన సీఎం అవుతారు' అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ గురించి ప్రస్తావిస్తూ ఈ ప్రక్రియ గతంలో నాలుగుసార్లు జరిగిందన్నారు. ఇప్పుడు డిజిటల్ టెక్నాలజీతో అనుసంధానమవుతోందని చెప్పుకొచ్చారు. దీనిపై ప్రతిపక్షం గందరగోళం చేయాల్సిన అవసరం లేదన్నారు. జాబితా నుంచి అనర్హులను మాత్రమే తొలగిస్తున్నట్లు తెలిపారు. ప్రతిసారి ఎన్నికల తర్వాత ఏదోఒక ఫిర్యాదు లేవనెత్తడం ప్రతిపక్షాలకు అలవాటైపోయిందని విమర్శించారు. ఈ ఎన్నికల్లో వారికి ఈవీఎంలు బాగానే ఉన్నాయి. ఓటర్ల జాబితానే సమస్య అని ఎద్దేవా చేశారు. ఎస్ఐఆర్ ఇప్పుడు బీహార్‌లో జరుగుతుంది. ఆ తర్వాత పశ్చిమబెంగాల్, తమిళనాడు సహా దేశవ్యాప్తంగా జరుగుతాయన్నారు. ఎన్డీఏ విడిపోవాలని ప్రతిపక్షం కోరుకుంటుందని చిరాగ్ ఆరోపించారు. ఎన్నికల్లో సొంత బలంతో గెలవలేక... ప్రత్యర్థి పక్షాన్ని బలహీనపరిచి గెలవాలని చూస్తోందన్నారు..

# 'నేడు' నింగిలోకి ప్రతిష్ఠాత్మక 'నిసార్'

### 27.30 గంటల కౌంట్‌డౌన్
### నిసార్ గుప్పెట్లో భూగ్రహ వైపరీత్యాల కదలికలు



**శ్రీహరికోట:** నాసా–ఇస్రోలు ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన భూపరిశీలక ఉపగ్రహం 'నిసార్' (నాసా–ఇస్రో సింథటిక్ అరెర్చుర్ రాడార్) ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. నిర్ణీత ప్రకారం బుధవారం సాయంత్రం 5.40 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి నింగిలోకి దూసుకుపోతుంది. 27.30 గంటల కౌంట్‌డౌన్ కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం 2.10 గంటలకు ప్రారంభమైంది. ఎంతోకాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రయోగంవల్ల భూగ్రహం అంతటా ఎక్కడైనా సంభవించే ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన సమాచారం ముందుగా సేకరించవచ్చు. అంటే యావత్ భూగ్రహంలో ప్రకృతి వైపరీత్యాల కదలికలు ఇకమీదట నిసార్ గుప్పెట్లోకి వస్తాయి. ప్రపంచవ్యాప్తంగా లభించే ఈ ముందస్తు సమాచారాన్ని ప్రతి 12 రోజులకు ఒకసారి భూమికి పంపుతుంది. భూతలాన్ని, సముద్రాలను, పర్వతాలను, మంచు ప్రాంతాలను ఇది పరిశీలిస్తుంది. ప్రధానంగా భూమి, మంచు కదలికలలో తేడాలను, వాటిల్లో వచ్చే వైపరీత్యాలను పరిశీలించడం నిసార్ ప్రధాన లక్ష్యం.

భూ స్థిరకక్ష్యలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టేందుకు ఇతర దేశాలపై ఆధారపడకుండా దేశీయంగా తయారు చేసిన జిఎస్ఎల్‌వి (భూ సమస్థితి ఉపగ్రహ వాహకనౌక) ద్వారా ఈ ఉపగ్రహాన్ని పంపుతారు.నిసార్ భూపరిశీలన ఉపగ్రహం సూర్యసమవర్తన కక్ష్యలో పరిభ్రమించేందుకు వీలుగా జిఎస్ఎల్‌వి శ్రేణి ఎంకె 2 వాహకనౌక నింగిలోకి తీసుకెళుతుంది. నాసా–ఇస్రో రెండు అంతరిక్ష పరిశోధనా సంస్థలూ ఉమ్మడి ఒప్పందంతో దశాబ్దకాలంపైగా కృషిచేసి ఈ ప్రయోగానికి రంగం సిద్ధం చేశాయి. నిసార్‌ను ఇస్రో తయారు చేసింది. లాంచ్‌ప్యాడ్ నుండి బయలుదేరిన తర్వాత చెన్నైకి 135 కి.మీ తూర్పు దిశగా ప్రయాణించి 19 నిమిషాల వ్యవధిలో ఇచ్చిన బాధ్యతలు పూర్తి చేస్తుంది. 51.7 మీటర్ల ఎత్తుగల ఈ వాహకనౌక మూడు దశలలో ఉపగ్రహాన్ని నిర్దేశిత గమ్యానికి చేరుస్తుంది. శాస్త్రవేత్తలు నిర్దేశించిన కక్ష్యలోకి అంటే 740 కి.మీ ఎత్తులోకి నిసార్ ఉపగ్రహాన్ని పంపుతుంది.

నిసార్ ఉపగ్రహం అత్యంత అధునాతనమైన రాడార్ ఇమేజింగ్‌లను ఉపయోగించి భూమిపై ఉన్న నేలను, మంచు ఎత్తులను అత్యంత సమీపం నుండి కొలతలు తీసి, పర్యావరణంలో మార్పులను పరిశీలించి భూతలకేంద్రానికి పంపిస్తుంది. అత్యవసర సమయాలలో అంటే ప్రకృతి వైపరీత్యాల సమయంలో దీనిద్వారా మనకు ముందస్తు హెచ్చరికలు లభిస్తాయి. భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వతాలు బద్దలుకావడం, పర్యావరణ అవాంతరాలు, మంచు పలకల పతనం వంటివాటితోసహా కొన్ని ఇతర గ్రహాలకు సంబంధించిన సంక్లిష్టమైన సహజ ప్రక్రియలను కూడా పరిశీలించడానికి ఈ నిసార్ ఉపగ్రహం ఎంతో ఉపయోగపడుతుంది. మూడు సంవత్సరాల పాటు ఈ నిసార్ క్రియాశీలంగా తన బాధ్యతలు నిర్వహిస్తుంది. ఉచితంగా అందుబాటులో ఉండే ఈ సమాచారాన్ని అత్యవసర సమయాలలో గంటల వ్యవధిలోనే అందరికీ అందుబాటులోకి తీసుకువస్తారు. సాధారణ సమాచారాన్ని ఒకటి రెండు రోజులు ఆలస్యంగా అందిస్తారు. ఇంతకుముందు కూడా భారతదేశం రీసోర్స్ శాట్, రీశాట్‌లను నింగిలోకి పంపింది. కానీ ఈ ఉపగ్రహాలు పంపిన సమాచారం కేవలం భారతదేశ భూభాగానికి మాత్రమే పరిమితమైనవి. ఈ నిసార్ మాత్రం ఇందుకు భిన్నంగా భూమ్మీద ఎక్కడ వైపరీత్యాలు వచ్చినా ఆ సమాచారాన్ని నమోదు చేసి భూ కేంద్రానికి పంపుతుంది. నాసా చెప్పిన సమాచారం ప్రకారం, నిసార్ మిషన్ ఇప్పటివరకూ సాధించిన విజయాల వారసత్వ పునాదులపై తయారైంది. ఇటీవల యాక్సియం మిషన్–4 ద్వారా ఇస్రో,నాసాలు ఉమ్మడిగా నలుగురు వ్యోమగాములను విజయవంతంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపి తిరిగి విజయవంతంగా భూమికి తీసుకువచ్చాయి. ఈ విధంగా చేయడం ఇదే మొదటిసారి కాగా, ఆ వరుసలో నిసార్ ప్రయోగం రెండవది.

2008లో ఇస్రో మొదటిసారి చంద్రుడిమీదకు చంద్రయాన్–1 ప్రయోగం విజయంతంగా చేసింది. 3,400 కంటేఎక్కువసార్లు ఇది చంద్రుడిచుట్టూ పరిభ్రమించింది. అత్యంత క్రయోజనిక్ ఇంజన్లతో రూపొందించిన జిఎస్ఎల్‌వి తరం వాహకనౌకలు 2001 నుండి ఇప్పటివరకూ నింగిలోకి దూసుకెళ్ళి తమ లక్ష్యాలను నెరవేరుస్తున్నాయి. అందులోభాగం ఇప్పుడు జిఎస్ఎల్‌వి–ఎఫ్ 16 ఎంకె 2 కొత్తశాఖ వాహకనౌకకు ప్రతిష్ఠాత్మకమైన 'నిసార్'ను నింగిలోకి తీసుకెళ్ళే బాధ్యతలు అప్పగించారు. శ్రీహరికోట నుండి ప్రయోగించే 102వ ప్రయోగంగా 'నిసార్' ఇస్రో చరిత్రలో నమోదవుతుంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాషింగ్టన్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిపిన సమావేశంలో తీసుకున్న నిర్ణయంవల్ల రెండు దేశాల అంతరిక్ష సంస్థలూ సంయుక్తంగా భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రోత్సాహం వచ్చింది.

# ప్రళయ్ క్షిపణి పరీక్షలు విజయవంతం



**భువనేశ్వర్:** భారత రక్షణరంగ పరిశోధన సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన ప్రళయ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. ఒడిశాలోని అబ్దుల్ కలామ్ ద్వీపంలో 28, 29 తేదీల్లో నిర్వహించిన టెస్ట్‌లు విజయవంతమయ్యాయి. ఈ క్షిపణి అత్యధిక, అత్యల్ప రేంజిని అంచనా వేయడానికి యూజర్ ఎవల్యూషన్ ట్రయల్స్‌ను నిర్వహించారు. డీఆర్‌డీవో ప్రకారం రెండు టెస్ట్‌ల్లో క్షిపణి అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించింది. అన్ని ప్రమాణాలను ప్రళయ్ అందుకొందని అధికారులు వెల్లడించారు. దీంతో ఇది వినియోగానికి సిద్ధంగా ఉందని తేలినట్లైంది. ప్రళయ్ స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి. యుద్ధరంగాల్లో నేరుగా వినియోగించేందుకు వీలుగా దీనిని తయారుచేశారు. భారత వాయుసేన, సైన్యం అవసరాలకు తగినట్లు దీనిని తీర్చిదిద్దారు. ఇది 150 నుంచి 500 కిలోమీటర్ల లోపు లక్ష్యాలను ఛేదించగలదు. 350 నుంచి 700 కిలోల అణుశీర్షాలను మోసుకెళ్లగలదు. శత్రువుల కమాండ్ సెంటర్లు, లాజిస్టిక్స్ హబ్‌లను ఇది లక్ష్యంగా చేసుకోగలదు. వాహనాలపై ఉంచి దీన్ని ఎక్కడికంటే అక్కడికి తరలించడానికి అవకాశం ఉంది.

ప్రజాపక్షం
బుధవారం, 30 జులై

# బిహార్‌లో ఇసిఐ సంకటం

ఆగస్టు 1 బహు దగ్గరిలోకి వచ్చింది. బిహార్‌లో భారత ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా చేబట్టిన ''ప్రత్యేక ముమ్మర రివిజన్'' (ఎస్ఐఆర్–సర్) ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించటానికి అది నిర్దేశించిన రోజు అది. రెండో వైపున జనవరి 2025 నాటి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదై ఉన్నవారిలో 65లక్షల మంది దరఖాస్తు ఫారాలు సమర్పించలేదని ఇసి అధికారికంగా చెబుతుండగా, దాదాపు కోటి మంది ఓట్ల తొలగింపునకు లగ్నం పెట్టారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అప్‌లోడ్ చేసిన దరఖాస్తుల్లో కూడా బూత్‌స్థాయి అధికారులనబడేవారే ఇంటింటికీ వెళ్లి వాకబు చేయకుండానే వారే వివరాలు నింపి వారే సంతకాలు చేసిన అక్రమాలు పెద్ద ఎత్తున జరిగినట్లు ఆరోపణలున్నాయి. సుప్రీంకోర్టు జులై 10న విచారణలో 'సలహాయిచ్చిన' ఆధార్, ఓటరు ఎపిక్‌కార్డు, రేషన్‌కార్డులను ఓటరు ధృవీకరణకు ఇసి అంగీకరించక పోవటం కూడా సమస్యాత్మకంగా మారింది. జులై 28న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం మీరు అన్నట్లు ''రేషన్‌కార్డులకు సంబంధించి అవి సులభంగా ఫోర్జరీ చేయవచ్చు. కాని ఆధార్, ఎపిక్ కార్డులకు కొంత పవిత్రత ఉంది, అవి నిజమైనవనే భావన ఉంది''. వాటిని అంగీకరించండని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల బాగ్చీలతో కూడిన ధర్మాసనం మరోసారి ఇసికి చెప్పింది. పైమూడు గుర్తింపు కార్డులు సులభంగా ఫోర్జరీ జరగవచ్చన్న ఇసి వాదన నేపథ్యంలో ధర్మాసనం పైవ్యాఖ్య చేసింది. అయితే ఈ పర్యాయం కూడా అది ఉత్తర్వు కాదు, సలహా పునరుద్ఘాటన మాత్రమే. పిటిషనర్‌లు భయపడుతున్నట్లు , భారీగా ఓట్ల తొలగింపు జరిగితే మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియను అక్కడికక్కడే రద్దు చేస్తామని ధర్మాసనం ఇసికి హెచ్చరిక చేసింది. తుది విచారణను ఆగస్టు 12,13 తేదీలకు మంగళవారం నాడు బెంచి వాయిదా వేసింది.

ఓటర్ల ధృవీకరణకు ఇసి ప్రకటించిన 11 ఆధారపత్రాలు ఫోర్జరీకి అవకాశం లేనివిగా అది భావించటం, ఎంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లతో జారీ చేసే ఆధార్, ఇసియే స్వయంగా ఇచ్చే ఓటరు ఎపిక్ కార్డు ఫోర్జరీకి అవకాశమున్నవిగా ఎన్నికల కమిషన్ వాదించటమే వింత. జెడియు ఎంపి ఒకరు ఇలా వాఖ్యానించారు. ''క్షేత్రస్థాయి వాస్తవాలు ఇసికి తెలియవు. ఎస్ఐఆర్‌ను వారిపై రుద్దారు''. ఇది వాస్తవానికి దగ్గరిగా ఉంది. రాష్ట్రంలో ఒకవైపు వరదలు, మరోవైపు వ్యవసాయ పనులు, సహజంగానే పదుల లక్షల సంఖ్యలో బిహారీ శ్రామికులు పొట్టచేతబట్టుకుని వలస పోతుంటారు. ఇసి లెక్క ప్రకారమే 32 లక్షల మంది ఓటర్లు శాశ్వతంగా రాష్ట్రం నుంచి మకాం మార్చారు. వారే వలస కార్మికులు. ఈ పరిస్థితుల్లో ఓటర్లు నెలరోజుల వ్యవధిలో జనన, నివాస ధృవీకరణ పత్రాలు ఆర్‌డిఓ లేక మున్సిపాలిటీల నుంచి పొంది ఓటరు దఖాస్తు చేయటం సాధ్యమా? రాష్ట్రంలో నిరక్షరాస్యత, నిరుద్యోగం ఎక్కువ. పక్కా ఇళ్లు లేక గుడిసెల్లో తలదాచుకునే పేదలు ఎందరో! వారి నివాసాలకు ఇంటి నెంబర్లే ఉండవు, ఇక ధృవీకరణ ఎక్కడ నుంచి వస్తుంది. దళితులు, బిసిలు, మైనారిటీ ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించి పాలక బిజెపి–జెడియు కూటమికి లబ్ధి చేకూర్చటానికి ఇప్పుడీ సమగ్ర రివిజన్ విన్యాసం చేపట్టారనే నిందకు ఇసిఐ గురైంది. నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలుండగా ఈ తమాషాలో దురుద్దేశం తప్ప నిజాయితీ ఉందా? రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ ఈ ప్రక్రియను ఆదినుంచీ వ్యతిరేకిస్తున్నాయి. అవసరమైతే ఎన్నికలు బహిష్కరించే విషయం ఆలోచిస్తామంటున్నాయి.

ఆగస్టు నెల అంతా ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులకు అవకాశం ఉంది. ఎన్నికల కమిషన్ ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి ఆధార్, ఓటరు కార్డులను ధృవీకరణ పత్రాలుగా అంగీకరిస్తే, జరిగిన తప్పులను దిద్దుకునే అవకాశం ఉంటుంది. ఎవరి ఆదేశాల ప్రకారమో మొండిగా పెద్ద ఎత్తున ఓటర్ల తొలగింపుకే నిబద్ధమైతే సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురి కావచ్చు. అది మొదటికే మోసం తెస్తుంది. ఇప్పుడు బంతి ఇసి కోర్టులో ఉంది.

# రష్యా చమురుపై ఇయు ఆంక్షలు
# భారత్‌పై నిష్ఫలమా?



నంటూ బెనర్జీ

రష్యా చమురును బయటి దేశాలు కొనుగోలు చేయకుండా నిరోధించడానికి యూరోపియన్ యూనియన్ (ఇయు) చట్ట విరుద్ధంగా తనకు తానే అధికారాలను ఆపాదించుకున్నట్లు కనిపిస్తోంది. ఇయులో సభ్యత్వం లేని దేశాలపై తన అభిప్రాయాన్ని రుద్దేందుకు దానికి ఎలాంటి అధికారం లేదు. కాబట్టి, రష్యా ఇంధన ఎగుమతులను లక్ష్యంగా ఇయు ఆంక్షల తాజా విస్తరణ ఇయులోని 27 సభ్య దేశాలు, అందులో పనిచేసే సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. అంతకు మించి కాదు. ఇయు దేశాలకు విక్రయించే రష్యా చమురుపై ధరల నిర్ణయించడంలో పరిమితులు, షిప్పింగ్, బీమాపై ఆంక్షలు వంటి నిర్ణయాలను అమలు చేయడానికి ఇయుకు అధికారం ఉంది. అంతే తప్ప అంతర్జాతీయ మార్కెట్‌లో రష్యా చమురును ఇయు ఏతర దేశాలు కొనుగోలు చేయకుండా ఇయు ఏతర జెండా క్యారియర్లు, బీమా సంస్థలను ఉపయోగించుకొని ఇయు చట్టబద్ధంగా నిషేధించలేదు. భారతదేశం, చైనా వంటి దేశాలపై ఇయుకి ఎటువంటి అధికార పరిధి లేదు. గత జూన్ నెలలో రష్యా ముడి చమురు ఎగుమతులలో ఈ రెండు దేశాలు కలిసి దాదాపు 85 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

గుజరాత్‌కు చెందిన నయరా ఎనర్జీ (గతంలో ఎస్సార్ ఆయిల్)ని మూసివేయడానికి ఇయు ప్రయత్నిస్తే అది చట్టవిరుద్ధం. ఇందులో రష్యా చమురు దిగ్గజం రోస్‌నెఫ్ట్ 49.13 శాతం వాటాను కలిగి ఉంది. లేదా రష్యా నుండి ముడి చమురును దిగుమతి చేసుకోకుండా భారతీయ చమురు శుద్ధి కర్మాగారాలను నిరోధించడానికి ప్రయత్నిస్తే అది కూడా చట్టవిరుద్ధం. రిలయెన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) శుద్ధి చేసిన ఉత్పత్తులను ప్రాసెస్ చేయడానికి, ఎగుమతి చేయడానికి రష్యా ముడి చమురును భారతదేశంలో అతిపెద్ద దిగుమతిదారు. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ (ఎల్ఎస్ఇజి) షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం, ఆర్ఐఎల్ ఈ ఏడాది మొదటి ఏడు నెలల్లో సగటున నెలకు 2.83 మిలియన్ బ్యారెళ్ల డీజిల్, 1.5 మిలియన్ బ్యారెళ్ల జెట్ ఇంధనాన్ని యూరప్‌కు రవాణా చేసింది. రోస్‌నెఫ్ట్ సింగ్‌పూర్‌లో తన అనుబంధ సంస్థ రోస్‌నెఫ్ట్ సింగపూర్ పిటిఇ. లిమిటెడ్ ద్వారా ప్రాంతీయ ప్రాజెక్టులను నిర్వహించడానికి, ఆసియా–పసిఫిక్ ప్రాంతంపై రోస్‌నెఫ్ట్ వ్యూహాత్మక దృష్టిలో భాగంగా చమురు, పెట్రోలియం ఉత్పత్తుల అంతర్జాతీయ వాణిజ్యాన్ని అభివృద్ధి చేయడానికి ఉద్దేశించబడింది. ఇది ఇంధన వినియోగంలో గణనీయమైన వృద్ధిని చూడవచ్చని అంచనా. ఇది చైనాలోని టియాంజిన్‌లో ఒక రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను నిర్మించడానికి పెట్రోచైనాతో ఒక జాయింట్ వెంచర్‌ను కూడా కలిగి ఉంది.

రష్యాకు వ్యతిరేకంగా జూలై 18న ఆమోదించబడిన తన 18వ ఆంక్షల ప్యాకేజీలో ఇయు మూడవ దేశాల నుండి రష్యా ముడి చమురు నుండి తయారైన శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులను నిషేధించింది. అయితే, భారతదేశం, చైనా తగ్గింపు ధరతో రష్యా ముడి చమురుని కొనుగోలు చేస్తూనే ఉంటాయని అంచనా. అయితే ఆర్ఐఎల్ వంటి కొన్ని భారతీయ శుద్ధి కర్మాగారాలు శుద్ధి చేసిన రష్యా ముడి చమురును ఇయు సభ్య దేశాలకు తిరిగి ఎగుమతి చేయడం కష్టంగా భావిస్తాయి.

ఇయు కొత్త ఆంక్షల తర్వాత మరింత రాయితీ ఇవ్వబడే శుద్ధి చేసిన రష్యా ముడి చమురు తిరిగి ఎగుమతి చేయడానికి ఆర్ఐఎల్ నూతన మార్గాలను లేదా కొత్త గమ్యస్థానాలను వెతుక్కోవాల్సి ఉంటుంది లేదా పెద్ద ఆర్థిక దెబ్బను ఎదుర్కోవలసి ఉంటుంది. మొత్తంగా, భారతీయ శుద్ధి కర్మాగార పరిశ్రమ కోరుకుంటే శుద్ధి చేసిన రష్యా ముడి చమురును తిరిగి ఎగుమతి చేయడానికి మార్గాలను కనుగొనవలసి ఉంటుంది. ఇది అంత సులభమైన పని కాకపోవచ్చు.



ఇది నార్వే, యుకె, స్విట్జర్లాండ్, కెనడా, యుఎస్ సహా కొన్ని పాశ్చాత్య దేశాలను మినహాయించింది. ఇది ఇయు పోర్టులు, డాక్‌లను అందుబాటులో చేయకుండా లేదా పాత చమురు ట్యాంకర్ల 'షాడో ఫ్లీట్' అని పిలవబడే వాటిని అడ్డుకోవడానికి షిప్ టు షిప్ చమురు మార్పిడి చేపట్టకుండా నౌకలను నిషేధించింది. ఇవి రష్యా చమురును రవాణా చేయడానికి, ఆంక్షలను అధిగమించడానికి ఉపయోగించబడుతున్నాయని నివేదించబడింది. అమెరికా ఈ చర్యను కొంతవరకు ప్రతిఘటించిందని, ఇయు సొంతంగా ముందుకు సాగడానికి అనుమతించిందని గమనించాలి. ఎందుకంటే చమురు ఎక్కువగా డాలర్లలో వర్తకం చేయబడుతుంది. దీనికి చెల్లింపు క్లియరింగ్ అమెరికా బ్యాంకులచే నియంత్రించబడుతుంది. ఇయు కొత్త ఆంక్షల ప్యాకేజీ రష్యా చమురు, సహజవాయువు ఎగుమతులను దెబ్బతీయడం చాలా మటుకు అసంభవం.

భారతదేశం సంవత్సరానికి 15 బిలియన్ల విలువైన శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను యూరప్‌కు సరఫరా చేసేది. భారతదేశం 2024–25లో రష్యా నుండి 50.3 బిలియన్‌ల అమెరికా డాలర్‌ల విలువైన ముడి చమురును దిగుమతి చేసుకుంది. భారతదేశం ముడి చమురు మొత్తంలో రష్యా చమురు వాటా 44 శాతం కంటే ఎక్కువ. అనేక ఇయు ఏతర దేశాలు శుద్ధి చేసిన ముడి చమురును, ముఖ్యంగా రష్యా ముడి చమురు నుండి పొందిన శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటాయి. రష్యా ముడి చమురు,శుద్ధి చేసిన ఉత్పత్తులకు భారతదేశం, చైనా, టర్కీ ముఖ్యమైన కొనుగోలుదారులు. ఇతర ముఖ్యమైన శుద్ధి చేసిన ముడి చమురు దిగుమతిదారులు దక్షిణ కొరియా, తైవాన్. ఇయు ఆంక్షల తాజా ప్యాకేజీ రష్యా ముడి చమురును మరింత చౌకగా మారుస్తుంది. ఇది రష్యా ముడి ధరను బ్యారెల్‌కు 60 డాలర్‌ల నుండి 47.60 డాలర్‌లకి తగ్గిస్తుంది. సెప్టెంబర్ 3న అమలులోకి వచ్చే కొత్త పరిమితి, ఇది ఎల్లప్పుడూ సగటు రష్యా ముడి ధరల కంటే 15 శాతం తక్కువగా ఉండేలా చూసే వ్యవస్థను కూడా కలిగి ఉంది.

అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) ప్రకారం, రష్యా గత సంవత్సరం చమురు అమ్మకం ద్వారా సుమారు 192 బిలియన్‌ల అమెరికా డాలర్లను సంపాదించింది. అందులో కొంత భాగాన్ని తగ్గించడం ద్వారా ఆ దేశం ఎగుమతి ఆదాయానికి నష్టాన్ని కలిగించవచ్చు, కానీ రష్యా రోజుకు ఏడు మిలియన్ బ్యారెళ్ళకు పైగా చమురు ఎగుమతి అకస్మాత్తుగా నిలిచిపోతే, ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరగడం ద్వారా మిగిలిన ప్రపంచానికి కూడా నష్టం కలిగించవచ్చు. ఏదేమైనా, రష్యా చమురును ప్రధానంగా దిగుమతి చేసుకునే రెండు దేశాలు భారతదేశం, చైనాలు రష్యా చమురు దిగుమతిపై ఇయు విధించిన 'యూనివర్సల్ బ్యాన్ (సార్వత్రిక నిషేధం)' లేదా రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో సంధిలో భాగంగా అమెరికా అలాంటి నిషేధాన్ని బలవంతంగా ఆదేశించే ముప్పుకు లోబడి ఉండవు. యాదృచ్ఛికంగా, భారతదేశం, చైనా రెండూ ఉక్రెయిన్‌తో మంచి సంబంధాలను కలిగి ఉన్నాయి. గత సంవత్సరం, ఉక్రెయిన్ నుండి భారతదేశం దిగుమతులు 1.036 బిలియన్‌ల అమెరికన్ డాలర్లు కాగా, ఉక్రెయిన్‌కు భారతదేశం ఎగుమతులు 0.187 బిలియన్‌ల అమెరికన్ డాలర్లు. అదే కాలానికి రెండు దేశాల మధ్య మొత్తం వాణిజ్య టర్నోవర్ 1.224 4బిలియన్ డాలరు యుఎన్ కామ్‌ట్రేడ్ డేటా ప్రకారం, ఉక్రెయిన్ నుండి చైనా దిగుమతులుమొత్తం2.68 బిలియన్‌ల అమెరికన్ డాలర్లు.

ఇప్పటివరకు, రష్యా చమురు, సహజవాయువు ఎగుమతులపై ఇయు నిషేధంతో భారతదేశం, చైనా రెండూ ప్రభావితం అయినట్లు కనిపించడం లేదు. భారతదేశ పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పురి మార్కెట్ దాదాపు సాధారణంగా పని చేయడం కొనసాగిస్తుందని భావిస్తున్నారు. రోస్‌నెఫ్ట్‌పై ఇయు దృష్టి ఆందోళన కలిగిస్తుంది. రష్యా చమురు ఎగుమతులపై నిషేధాన్ని మరింత కఠినతరం చేయాలని ఇయు ఆలోచించకముందే, నయారా ఎనర్జీలో తన మెజారిటీ వాటాను విక్రయించడానికి ఆర్ఐఎల్ తో సహా కొంతమంది భారతీయ కొనుగోలుదారులతో రోస్‌నెఫ్ట్ చర్చలు జరుపుతున్నట్లు భావించారు. రష్యాపై ఇయు కొత్త ఆంక్షల ప్రకటన తర్వాత చమురు మార్కెట్లు కఠినం కాలేదని భారతీయ పెట్రోలియం మంత్రి మామూలుగానే సంతోషంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇయుకి భారతదేశం 15బిలియన్ల అమెరికన్ డాలర్ల శుద్ధి చేసిన పెట్రో ఉత్పత్తుల ఎగుమతి దెబ్బ తిన్నప్పటికీ, దేశం ఇప్పటికే శుద్ధి చేసిన పెట్రోలియం ఎగుమతికి కొత్త మార్కెట్లను అన్వేషిస్తోంది. గత సంవత్సరం ఎగుమతి ఆదాయం 85 బిలియన్ డాలర్లు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, దిగుమతి ఆధారిత భారతదేశం తన ఇంధన భద్రతను అలాగే ఎగుమతి వాణిజ్యాన్ని రక్షించుకోవడానికి బలమైన వ్యూహాన్ని రూపొందించాలి.

# ఈ మరణాలను ఆపేదెలా?

కళాశాలల్లో, కోచింగ్ సెంటర్లలో మార్కుల కోసం, ర్యాంకుల కోసం జరిగే తీవ్రమైన పోటీలో ఎంతో మంది యువత తమ చిరునవ్వులు పోగొట్టుకుంటున్నారు. వారి మనసులలో పేరుకుపోయిన ఒత్తిడి, బయటకు చెప్పుకోలేని బాధ, చివరికి ప్రాణాలు తీసుకోవడానికి దారితీస్తోంది. ఈ భయంకరమైన పరిస్థితిని గుర్తించిన సుప్రీంకోర్టు 25జూలై 2025న కీలకమైన తీర్పు ఇచ్చింది. 'నేర్చుకోవడంలో ఆనందం పోయి, ర్యాంకులు, ఫలితాలు, నిరంతర పోటీ ఆందోళనగా మారిపోయింది' అని న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై మద్దతు ఇవ్వడానికి, ఆత్మహత్యలను నివారించడానికి దేశంలో సమగ్రమైన, అమలు చేయదగిన చట్టపరమైన నియంత్రణలు లేవని కోర్టు లోతుగా విశ్లేషించింది. విద్యార్థుల ఆత్మహత్యలను ఆపడానికి 15 ముఖ్యమైన సూత్రాలతో కూడిన ఒక ప్రణాళికను ప్రకటించింది. విద్య అంటే కేవలం చదువు మాత్రమే కాదు, పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ఈ తీర్పు తేటతెల్లం చేసింది.

### గణాంకాలు చెప్పే కఠిన వాస్తవం:

జాతీయ నేర గణాంక సంస్థ 2022 నాటి 'యాక్సిడెంటల్ డెత్స్ అండ్ సూసైడ్స్ ఇన్ ఇండియా' నివేదిక మన దేశంలో ఆత్మహత్య చేసుకున్న వారిలో 7.6%మంది విద్యార్థులే అని పేర్కొంది. 2022లో సుమారు 13,044 మంది విద్యార్థులు తమ ప్రాణాలు తీసుకున్నారు. వీరిలో 2,248 మంది కేవలం పరీక్షలలో ఫెయిల్ అవడం వల్లే చనిపోయారని స్పష్టం చేసింది. 2001లో 5,425 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా 2022 నాటికి ఈ సంఖ్య 13,044కి చేరింది. నియంత్రణ లేని కోచింగ్ పరిశ్రమ ఎలా యువత జీవితాలను ప్రమాదంలో పడేస్తుందో విశ్లేషిస్తుంది.

### సుప్రీంకోర్టు జోక్యం ఎందుకు?

ఈ తీర్పునకు తక్షణ కారణం, సుక్దేబ్ సాహా అనే ఒక తండ్రి తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై చేసిన పోరాటం. విశాఖపట్నంలోని ఒక కోచింగ్ సెంటర్‌లో నీట్ కోసం చదువుతున్న అతని 17 ఏళ్ల కుమార్తె 2023 జూలై 14న హాస్టల్ పైకప్పు నుండి పడిపోయి అనుమానాస్పదంగా మరణించింది. ఈ సంఘటనపై పోలీసులు సరిగా విచారించడం లేదని కోచింగ్ సెంటర్ యాజమాన్యం నిజాలను దాచిపెడుతోందని ఆరోపిస్తూ సాహా హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ న్యాయం జరగకపోవడంతో చివరికి సుప్రీం కోర్టుకు వచ్చారు. ఈ కేసును విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం, ఆ ఒక్క సంఘటనను కేవలం వ్యక్తిగత విషాదంగా చూడకుండా అది దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక సంక్షోభానికి, విద్యావ్యవస్థలోని 'వ్యవస్థాగత లోపం'కు నిదర్శనంగా విశ్లేషించింది. పోలీసు దర్యాప్తులో 'లోతైన లోపాలు' ఉన్నాయని, 'కీలక ఆధారాలను దాచిపెట్టే అవకాశం' ఉందని గమనించి సీబీఐ విచారణకు ఆదేశించడం ద్వారా వ్యవస్థల మధ్య జవాబుదారీతనం లేకపోవడం పైనా కోర్టు పరోక్షంగా దృష్టి సారించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, జీవించే హక్కు పరిధిలో మానసిక ఆరోగ్యం ఒక అంతర్భాగమని కోర్టు స్పష్టం చేసింది. ఈ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అందుకే ఈ ఆదేశాలను జారీ చేయాల్సి వచ్చిందని పేర్కొంది.

### సంస్థలే జవాబుదారీ వహించాలి:

విద్యార్థుల సమస్యలు విద్యా సంస్థలు పట్టించుకోకపోయినా, ఆ నిర్లక్ష్యం ఆత్మహత్యకు దారితీస్తే, ఆ సంస్థలే బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు గట్టిగా హెచ్చరించింది. ఈ తీర్పు విద్యార్థుల మానసిక ఆరోగ్యం మరియు శ్రేయస్సును కాపాడటానికి ఒక బహుళరంగ విధానాన్ని ప్రతిబింబిస్తుంది, ప్రతి సూత్రం ఒక నిర్దిష్ట సమస్యను పరిష్కరించడానికి రూపొందించబడింది. అన్ని విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు ఒకే రకమైన మానసిక ఆరోగ్య విధానాన్ని పాటించాలి. ఇది దేశవ్యాప్తంగా మానసిక ఆరోగ్యానికి ఒక ప్రామాణిక విధానాన్ని ఏర్పాటు చేయాలి. 100 మందికి పైగా విద్యార్థులున్న ప్రతి విద్యా సంస్థలో కనీసం ఒక అర్హత కలిగిన కౌన్సెలర్, సైకాలజిస్ట్‌ను తప్పనిసరిగా నియమించాలి. చిన్న సంస్థలు తగినంత మంది కౌన్సెలర్‌లు ఉండేలా చూసుకోవాలి. పరీక్షా సమయాల్లో విద్యార్థి బృందాలకు మెంటార్‌లను కేటాయించాలి. మానసిక ఆరోగ్య సేవలు, స్థానిక ఆసుపత్రులు, ఆత్మహత్య నివారణ హెల్ప్‌లైన్‌లకు తక్షణ రెఫరల్ కోసం అన్ని విద్యా సంస్థలు ప్రోటోకాల్‌లను ఏర్పాటు చేయాలి.

వార్షిక తనిఖీలు జవాబుదారీతనాన్ని పెంచుతాయి. కేవలం మార్కుల వెనుక పరిగెత్తే ధోరణిని వదిలి పెట్టి, పిల్లల సమగ్ర అభివృద్ధికి, మానసిక స్థితిస్థాపకతను ప్రోత్సహించే విద్య వైపు మన సమాజం మళ్లినప్పుడే సాధ్యమవుతుంది.


– జనక మోహన రావు దుంగ
8247045230

# సరోగసి అంటే వ్యాపారమా?



అంజాద్ మియా
9000517186
(హైదరాబాద్)

మాతృత్వం అనేది వర్ణణాతీతమైన అనుభూతి. జీవితంలో అపరిమితమైన ప్రేమ, త్యాగం, కృషి, దయ, ఆరాధనలాంటి అద్భుతమైన గుణాల కలయికల సంగమం ఒక తల్లి మాత్రమే. తన పిల్లల కోసం తన జీవితాన్ని సంపూర్ణంగా అర్పిస్తుంది మాతృమూర్తి. తల్లి గొప్పతనం చెప్పకుండానే మనసుకు అర్థమవుతుంది. ఆమె ప్రేమకి, దయకి, అంకితభావానికి ప్రపంచంలో ఎటువంటి పదాలు తగవు. అలాంటి అమ్మ ప్రేమ అంగట్లో అరువుగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటూ అమ్మ ప్రేమకే మచ్చగా మారుతున్నారు కొందరు. అవునూ, ఈ మధ్యకాలంలో సరోగసి అనే కొత్త వ్యాపారం చాప కింద నీరుల వ్యాప్తి చెందుతూ సంవత్సరానికి కొన్ని వేల కోట్ల వ్యాపార స్థావరంగా మారి అమాయక ప్రజల జీవితాల చిచ్చుల రాజేస్తోంది. దానికి ప్రత్యక్ష నిదర్శనంగా సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో జరిగిన ఘటనను చెప్పవచ్చు. అసలు ఈ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో ఏం జరిగింది. ఇంతకీ సరోగసి అంటే ఏంటి.? దేశం మొత్తంలో ఇలాంటి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్లు ఎన్ని ఉన్నాయి. వాటిలో ఏంచేస్తుంటారు..? మన చట్టాలు ఏం చెప్తున్నాయి. మొదలైన విషయాలు తెలుసుకుందాం..!



సరోగసి అంటే అద్దెగర్భం. అంటే ఏదైనా కారణం చేత తన సొంత గర్భం ద్వారా కాకుండా మరో మహిళా యొక్క గర్భం ద్వారా పిల్లల్ని కనడం. దీనినే సరోగసి అంటారు. ఈ సరోగసి అనేది మన ప్రాచీనకాలం నుండే కొనసాగుతూ వస్తున్న విధానంగా చెప్పవచ్చు. ఒకసారి మన పురాణాలు ఇతిహాసాలను గమనించినట్లయితే మనకు ఈ సరోగసి అక్కడక్కడ దర్శనమిస్తుంది. అయితే లిఖితపూర్వకమైన ఆధారాలు 17వ శతాబ్దంలో బాబ్లియోన్ (ప్రస్తుత ఇరాక్) సంస్కృతిలో లభించాయి. ఎవరికైతే పిల్లలు జన్మించలేదో వారు విడాకులు తీసుకోకుండా వేరే మహిళతో పిల్లలను కనవచ్చు అని చారిత్రాత్మక ఆధారాలు లభించాయి. ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు జరిగాయి. ఫలితంగా 1978లో లండన్‌లో లూయిస్ జాయ్ బ్రౌన్ అనే మొట్టమొదటి టెస్ట్ ట్యూబ్ బేబీ జన్మించాడు. ఆ తర్వాత అమెరికాలో 1985లో మొట్టమొదటిసారి ఈ సరోగసిపై కేసు నమోదైయింది. ఇక అప్పనుండి నేటి వరకి ఈ సరోగసి అనే విధానం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే ఇక్కడ ప్రశ్న ఉత్పన్నమవుతుంది, సరోగసి ఎలా చేస్తారు, అది ఎన్ని రకాలుగా ఉంటుంది, భారతదేశంలో ఈ సరోగసికి అనుమతి ఉందా.? భారతీయ చట్టాలు ఏం చెప్తున్నాయి తెలుసుకుందాం.? సాధారణంగా సరోగసి రెండు రకాలుగా ఉంటుం ది. ఒకటి జెస్టేషనల్ సరోగసి, రెండోది బయోలాజికల్ సరోగసి. జెస్టేషనల్ సరోగసి ఈ పద్ధతిలో భార్య భర్తల నుండి అంటే భర్త నుండి వీర్యాన్ని భార్య అండాన్ని తీసుకొని ల్యాబ్‌లో ఫలదీకరణం చేస్తారు. అలా ఫలదీకరణం చేసిన పిండాన్ని ఎవరైతే ఈ సరోగసికి సానుకూలంగా ఒప్పుకుంటారో ఆమె గర్భంలోకి ప్రవేశపెడతారు. ఈ పద్ధతిలో గర్భంతో ఉన్న మహిళకు ఆమె కడుపులో ఉన్న బిడ్డకు ఎలాంటి జన్యుపరమైన సంబంధం ఉండదు. కేవలం గర్భం మాత్రమే ఆమెది ఉంటుంది. 9 నెలల తర్వాత ఆ బిడ్డను కని అసలైన తల్లిదండ్రులకు ఇవ్వడం జరుగుతుంది. ఇక బయోలాజికల్ సరోగసి అంటే ఒక భార్యాభర్తల జంటలో ఏదైనా అనారోగ్య సమస్యల కారణంగా భార్యకు అండాల ఉత్పత్తి ఆగిపోయినట్లయితే లేదా ఇతర అనారోగ్య సమస్యలు ఉంటే కేవలం భర్త యొక్క వీర్యాన్ని తీసుకొని ఎవరైతే ఈ సరోగసికి సానుకూలంగా ఉంటారో ఆ మహిళ నుండి అండాలను స్వీకరించి ల్యాబ్‌లో ఫలదీకరణం చేస్తారు. అలా ఫలదీకరణం చేసిన అండం పిండంగా మారినప్పుడు ఆ పిండాన్ని ఆ సదరు మహిళ గర్భంలోకి ప్రవేశపెడతారు. ఈ ప్రక్రియనే బయాలజికల్ సరోగసి అంటారు. ఈ పద్ధతిలో అండం గర్భం రెండు ఒకే మహిళకు సంబంధించి ఉంటాయి కాబట్టి ఈ విధానంలో భార్య కేవలం నామమాత్రపు పాత్ర పోషిస్తుంది. పూర్తి బాధ్యత అంతా సరోగెట్ తల్లిపై ఉంటుంది.

అయితే ఈ తతంగం అంతా చాలా సమయంతో డబ్బుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి ఈ సరోగసికి సులువైన మార్గం మానవ అక్రమ రవాణా అంటే ఒక స్త్రీని కొన్ని రోజుల పాటు అద్దెకు తీసుకుని ఆమెతో కొంత కాలం సహజీవనం చేసిన తర్వాత ఏ పిల్లనో, పిల్లాడో పుట్టిన వెంటనే ఆ బిడ్డను తీసుకొని వెళ్లిపోవడం అన్నమాట. ఈ సరోగసి ప్రోత్సహించే క్లినిక్‌లు దేశవ్యాప్తంగా కొకొల్లలుగా ఉన్నాయి. ఈ క్లినిక్‌లు నిరుపేద స్త్రీలనే ప్రధానంగా టార్గెట్ చేసుకొని ఎవరైతే ధనవంతులుగా ఉండి, పిల్లలు కలుగని వారై ఉంటారో వారినుండి లక్షల్లో వసూలు చేసి, నిరుపేద స్త్రీలకు డబ్బులు ఆశచూపించి ఈ సరోగసికి ఒప్పిస్తారు. ఈ పద్ధతి ద్వారా గర్భం దాల్చిన ఆమెను కొంతకాలం తమ పర్యవేక్షణలో ఉంచుకొని బిడ్డ పుట్టిన తర్వాత కొంతమొత్తంలో ఆమెకు అప్పజెప్పి ఆమెను బయటికి గెంటేస్తారు. ఆ తర్వాత ఆమెకు దేవుడే దిక్కు. ఈ విధంగా పుట్టిన పిల్లలకు మగబిడ్డ అయితే ఒకరేటు. ఆడపిల్ల అయితే ఒక రేటు చొప్పున అమ్మేస్తుంటారు. ఈ మధ్య బాలీవుడ్ సెలబ్రెటీలైన తుషార్ కపూర్, కరణ్ జోహార్, షారూఖ్ ఖాన్, అమీర్ ఖాన్ లాంటి వారు ఈ పద్ధతి వైపు మొగ్గుచూపించడం ద్వారా ఈ వ్యాపారానికి ఇంకా డిమాండ్ పెరిగిందని చెప్పవచ్చు. మన కండల వీరుడైన సల్మాన్ ఖాన్ సైతం పెళ్లి వద్దు, సరోగసి ముద్దు అని పేర్కొన్నాడు.

ఈ సరోగసి వ్యాపారాన్ని నివారించడానికి కేంద్ర ప్రభుత్వం 2021 చట్టం చేసి కొన్ని కఠినమైన ఆంక్షలు, నియమ నిబంధనలు విధించినప్పటికి గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యాపారం ఇంకా జోరుగా కొనసాగుతూనే ఉంది. కోట్లలో డబ్బులు చేతులు మారుతూ అమాయక ప్రజల జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నారు. లేకపోతే బీరు బిర్యానీ ఇచ్చి పురుషుల వీర్యాన్ని తీసుకొని వేరే మహిళ అండాలతో ఫలదీకరణం చేయడం ఏంటండీ.? సిగ్గుచేటు కాకపోతే. సరోగసి అంటే అమ్మ అనే పిలుపుకోసం పరితపించే వారి ఆకాంక్షలను నెరవేర్చే సుమార్గం. అలాంటి మార్గాన్ని డబ్బుకోసం ఇంత నీచంగా మార్చి సొమ్ము చేసుకోవడం అనేది ఏమాత్రం తగదు. ఇప్పటికైనా మన ప్రభుత్వాలు మేల్కొని ఈ సరోగసి క్లినిక్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ అమాయక ప్రజలు జీవితంలో వెలుగులు నింపాలని ఆశిద్దాం...!

# స్నేహం ఓ అద్వితీయ అమృతహస్తం

స్నేహం చేయని మనిషి ఉండడు. స్నేహితులు లేని తనువు ఉండదు. ప్రతి వ్యక్తి జీవితంలో స్నేహానికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. స్నేహితుల హస్తాలు నిస్వార్థ నేస్తాలు. బంధువులతో లేని ఓ అపురూపమైన అనుబంధం స్నేహితులతో ఉంటుంది. కొన్ని సమయాల్లో కుటుంబ సభ్యులతో పంచుకోలేని విషయాలను సహితం స్నేహితులతో పంచుకుంటాం. మనకు స్నేహితులు అనేకులు ఉండవచ్చు కాని ప్రాణ మిత్రులు కొద్ది మంది మాత్రమే ఉంటా రు. ప్రాణ స్నేహితులతో మనం అన్ని విషయాలను దాపరికం లేకుండా పంచుకుంటాం. స్నేహం అంటే ఓ త్యాగం, ఆపదలో అభయ హస్తం, కష్టాల్లో ఓ శీతల నేస్తం, ఆపదలో సాంత్వన చేకూర్చే మహా వృక్షం. ప్రాణ స్నేహితులకు ప్రత్యామ్నాయం ఉండదు. మనసుకు ప్రశాంతత, శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది స్నేహ హస్తం. సహానుభూతికి ఓ చక్కని ఉదాహరణ స్నేహం. పరస్పర గౌరవానికి, త్యాగానికి చిరునామా ఫ్రెండ్‌షిప్. సన్నిహిత మిత్రుడు అంటే ఓ మహా నమ్మకం. స్నేహానికి వయోభేదం లేదు. చంటి వాడి నుంచి పండు ముసలి వరకు అందరికీ స్నేహితులు ఉంటా రు, వద్దన్నా ఆనందాలను వడ్డిస్తూ ఉంటారు. స్నేహం విలువను తెలుసుకోవడం, మంచి స్నేహితులతో సంబంధాలు కొనసాగించడం, అపార్థాలను నివృత్తి చేసుకొని స్నేహాన్ని కొనసాగించడం, భేదాభిప్రాయాలను దూరం చేసుకోవడం. పౌర సమాజంలో శాంతి పందిరి వేయడానికి అనుకూలమైన అనువైన సందర్భంగా ప్రతి ఏట జులై 30న అంతర్జాతీయ స్నేహ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే) పాటించాలని 2011లో ఐరాస తీర్మానం చేయడం, ప్రతి ఏట పాటించడం కొనసాగుతున్నది. 2025 అంతర్జాతీయ స్నేహ దినం ఇతివృత్తంగా స్నేహం : శాంతి, సంఘీభావం, సంస్కృతుల మధ్య అవగాహనలను పెం పొందించే వారధి అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. వివిధ దేశాలు, జాతులు, మతాలు, కులాలు, అసమానతలను మరిచి అందరం స్నేహ బంధంతో ఏకం కావడమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటాం. స్నేహ బంధం పరమ పవిత్రమైనది. నిజమైన స్నేహితుల మధ్య విడదీయరాని ప్రేమ అనే అభేద్య బంధం పెనవేసుకొని ఉంటుంది. మంచి స్నేహితులు కొన్ని విషయాల్లో విభేదించినా, సదా ఒక్కటిగానే ఉంటారు.



చిన్ననాడే స్నేహం అనే బంధం మొలకెత్తుతుంది. అమ్మనాన్న తర్వాత మన సంక్షేమాన్ని, శ్రేయస్సును నిస్వార్థంగా తలుస్తూ మన వెంట నడిచే వ్యక్తులు మన ప్రాణ మిత్రులు మాత్రమే. బడికి వెళ్లడంతో మనకు నూతన స్నేహితులు పుడతారు. వారితోనే మన దినచర్య ముడిపడి ఉంటుంది. చదవడం, ఆడడం, పాడడం, మాట్లాడుకోవడం, సరదాగా తిరగడం లాంటివి మన ప్రాణ స్నేహితులతోనే ముడిపడి ఉంటాయి. ఒకే కంచంలో తిని ఒకే మంచంలో పడుకునే స్థాయికి స్నేహం ఎదుగుతుంది. తరగతులు పెరిగిన కొద్దీ తరగతులు మారుతూ, కొత్త మిత్రులు వచ్చి చేరతారు. పాత మిత్రుల స్నేహం కొనసాగుతూనే ఉంటుంది. స్నేహితులు పెరిగిన కొద్దీ బయటి ప్రపంచం కొత్తగా కనిపిస్తుంది. అందరి సంసృతీ వారసత్వాలు అర్థం అవుతాయి. మన జీవితానికి లక్ష్యాలను కూడా మిత్రులు నిర్ణయించుకునే స్థాయి కూడా వస్తుంది.

అంతర్జాతీయ స్నేహ దినం వేదికగా పాత మిత్రులను కలవడం, కొత్త మిత్రులతో సరదాగా గడపడం, ఆపాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ పంచుకోవడం, తమ తమ అనుభవాలను పంచుకోవడం, స్నేహితుల కష్టాలను తెలుసుకొని సహాయం చేయడం, సామాజిక మాధ్యమాల్లో స్నేహ బంధాల విలువను వివరించడం, పాత స్నేహితులతో ఉన్న ఫోటోలను పంచుకోవడం, హాపీ ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకోవడం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు.

– బి.ఎం
9949700037

## పలు ప్రాంతాలలో అధికారుల పర్యటన

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర నాయక్, గండి మైసమ్మ ఎమ్మార్వో సయ్యద్ అబ్దుల్ మతిన్‌లు మున్సిపల్ పరిధిలో ఉన్నటు వంటి స్లమ్‌లలో గుడిసెలు, మట్టి గోడలు మొదలగు ఇండ్లలో ఉన్న వారిని గుర్తించి, ఒకటే దగ్గర నివసించే ఫ్యామిలీలు మినిమం 400 గజాలు పైన ఉన్న వారి స్థలంలో వారికి ఇష్టమైతే, వారివద్ద నుండి రాతపూర్వకంగా అగ్రిమెంట్ తీసుకొని డబుల్ బెడ్‌రూమ్ కట్టించి ఇవ్వటానికి, ప్రాంతాలను పరిశీలించారు. బహదూర్ పల్లి తండా, దొమ్మర పోచంపల్లి సాయి పూజ కాలనీ సర్వేనెంబర్ 120 గాగిలాపూర్ సర్వేనెంబర్



214 ప్రాంతంలో వెరిఫికేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, వార్డ్ ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చర్లపల్లి సిఐగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి పోలీస్ స్టేషన్ నూతన సిఐగా ఎ.సుధాకర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకు ముందు సరూర్ నగర్ ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు. చర్లపల్లి సిఐగా విధులు నిర్వహించిన రవికుమార్ ఆదిభట్ల పోలీస్ స్టేషన్ కు బదిలీపై వెళ్లారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని, అసాంఘిక కార్య క్రమాలపై చర్యలు తీసుకుంటానని తెలిపారు.



## మహాసభలకు విరాళాలిచ్చి సహకరించాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేసే సిపిఐ రాష్ట్ర మహాసభలకు విరివిగా విరాళాలిచ్చి సహకరించాలని సిపిఐ, ఎఐవైఎఫ్‌లు కోరాయి. మంగళవారం సిపిఐ ఘట్‌కేసర్ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్రల ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లో మహాసభలకు సంబంధించి కరపత్రాలు పంచుతూ కూపన్లతో విరివిగా విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం కోసం తాపత్రయ పడకుండా ప్రజలతో మమేకమవుతూ ప్రజా సమస్యలను భుజస్కందాలపై మోస్తూ పోరాటం చేయటమే సిపిఐ సిద్ధాంత మన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఘట్‌కేసర్ మండల కార్యదర్శి సంపంగి శివ సిపిఐ సీనియర్ నేతలు కల్లూరు జయచంద్ర తదిత రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పూల మొక్కలు పంపిణీ

**ప్రజాపక్షం/నాగారం:** ప్రతి ఒక్కరూ మూడు మొక్కలను నాటాలని మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంత్ నగర్ కాలనీ రోడ్ నంబర్ 1లో కాలనీ వాసులకు పూల మొక్కలను పంపిణీ చేశారు. కాలనీలో మొక్కలను నాటి పచ్చదనంగా మార్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, కాలనీవాసులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరుకు వినతి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలంటూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌లు కోరారు. మంగళవారం వారు జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కల్సి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన వార్డు కార్యాలయానికి లిఫ్ట్ ఏర్పాటు చేయాలని, హిందూ స్మశాన వాటికను వైకుంఠధామంగా తీర్చి దిద్దాలని, రైతు బజార్ పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు నిర్మించాలని, విఎస్‌టి కాలనీలో సిమెంట్ రోడ్ల కోసం మంజూరైన రూ. 20లక్షల ప్రతిపాదనలను పునపరిశీలించాలని, పటేల్‌కుంట చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు.

## ఏటవె సెంటర్‌లో ప్రవేశానికి శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట్:** శామీర్‌పేటలోని ప్రభుత్వ ఏటవె పారిశ్రామిక శిక్షణా సంస్థలో ఏటిసి అడ్వన్డ్స ట్రైనింగ్ సెంటర్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సులలో ప్రవేశానికై దరఖాస్తులు సీకరించబడుతున్నామయని కళాశాల ప్రిన్సిపాల్ వి.లలిత తెలిపారు. మ్యాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్, కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యు ఫాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిసన్ యసంగ్ అడ్వాన్డ్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్), అడ్వాన్డ్స్ సిఎన్‌సి మిషనింగ్ మెకానిక్ ఎలక్ట్రిక్ వెవాకిల్ కోర్సులకు ఆన్‌లైన్‌లో పదవ తరగతి www.iti.telangana. gov. in ద్వారా రిజిస్ట్రేషన్ కోసం బోనఫైడ్, ఎస్ఎస్‌సి ధ్రువీకరణ పత్రం, మెయిల్ ఐడి పత్రం, ఫోన్ నంబర్, ఫోటోతో ఇంటర్‌నెట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



## బంగారు మైసమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, భౌరంపేట్‌లో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ భౌరంపేట్ బంగారు మైసమ్మ తల్లి ఆలయ నూతన కమిటీని భౌరంపేట్ గ్రామ పెద్దలు, ప్రజలు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అధ్యక్షులు ఎస్.రంగారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు మిద్దెల యాదిరెడ్డి, ఉపాధ్యక్షులు గా ఎస్.సురేందర్ రెడ్డి, మిద్దెల బాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా నాచారం మురళీ యాదవ్, సర్గారి ధర్మారెడ్డి కోశాధికారిగా మిద్దెల మల్లారెడ్డి, కార్యదర్శిగా బెంబేడీ హన్మంత్ రెడ్డి, బైళ్ల గోపాల్, చింతకింది సురేష్ ఎన్నుకున్నారు.

కార్యనిర్వాహక సంస్థ సభ్యులు గా నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటరామ్, సత్తిరెడ్డి, తలారి నాగరాజు, చింతా మల్లేష్, బెంబెడి మహేందర్ రెడ్డి, దమ్మగారి రాజిరెడ్డి, సుడె రాఘవరెడ్డి, బాల్ రెడ్డి గారి చంద్రశేఖర్ రెడ్డి, నాచారం నరసింహా యాదవ్, మన్నే బాలారాజ్, కమిటీ సలహాదారులుగా కొమ్ము జీవన్, ఆకుల యాదయ్య, కుమ్మరి నాగభూషణం, బెంబెడి బసంత్ రెడ్డి, ఎర్రోళ్ల జంగారెడ్డి, పోషి మహేష్, గణేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరిని కలుపుకొని పోయి, అందరితో కలిసి ఆలయ అభివృద్ధికి తమవంతు పూర్తి సహకారం అందిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజలు, భక్తులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ పంటతో ఆర్థికంగా బలపడాలి

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/వికారాబాద్:** పామాయిల్ పంటలు సాగుచేస్తూ అధిక దిగుబడులతో ఆర్థికంగా బలపడాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు రైతులకు సూచించారు. మంగళవారం వికారాబాద్ శివారు ప్రాంతం కొత్రేపల్లిలోని కాసాని జ్ఞానేశ్వర్ వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వ్యవసాయ మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునే దిశగా పనిచేస్తుందన్నారు. పామాయిల్ పంట సాగుతో అధిక లాభాలు ఆర్జించడంతో పాటు మూడు సంవత్సరాల పాటు అంతర్గత కూరగాయ పంటలతో పాటు వ్యవసాయం సాగు చేయవచ్చని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం సబ్సిడీని అందజేస్తు రైతులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. రైతులకు మొక్కలు ఇవ్వడంతో పాటు డ్రిప్ పరికరాలను అందించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ పంటలను సాగు చేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని అదేవిధంగా మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు వేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అయన తెలిపారు. అధిక దిగుబడి వచ్చే విత్తనాలను రైతులకు అందించాలని మంత్రి సూచించారు. జిల్లాలో పెద్ద మొత్తంలో ఆయిల్ పామ్ పంటలను సాగుచేసినట్లయితే రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఫ్యాక్టరీని శంకుస్థాపన చేసుకుందామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునే దిశగా రైతుల భరోసా, రైతూబీమా పథకాలను అమలుపరుస్తున్నామని త్వరలోనే పంటల బీమా ను కూడా వర్తింప చేస్తామని మంత్రి తెలిపారు. శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధికంగా ప్రాముఖ్యత నిస్తూ రైతుల సంక్షేమకోసం పనిచేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నరలోనే వ్యవసాయరంగం కోసం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందని, రైతులను రుణభారం నుండి విముక్తులను చేయడానికి 25లక్షల మంది రైతులకు చెందిన 21వేల కోట్ల రుణాలను మాఫీ చేయడం జరిగిందని సభాపతి తెలిపారు. రైతు భరోసాను ఏడాదికి ఎకరానికి 12 వేలకు పెంచి కేవలం తొమ్మిది రోజులలో ఖాతాలలో వేయడం జరిగిందని, రైతుబీమా, సన్న రకాల వడ్లకు బోనస్ తదితర వాటిని అమలు చేస్తున్నాం అన్నారు.

మన దేశం ఏడాదికి లక్ష కోట్ల విలువైన ఆయిల్ పాంను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటుందని కాబట్టి మన దగ్గర ఎప్పటికీ డిమాండ్ ఉంటుందని ఆయిల్ పామ్ తోటల సాగుకు ఆసక్తి ఉన్న రైతులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని స్పీకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ హష్మిన్ భాష, డిప్యూటీ డైరెక్టర్ నీరజ గాంధీ, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమలశాఖ అధికారి సత్తార్, వ్యవసాయశాఖ అధికారి రాజారత్నం, ఆర్‌డిఒ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## మోసాలకు పాల్పడే ఆస్పత్రులపై చర్యలు

### వైద్యారోగ్య శాఖాధికారులకు సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** ప్రజల బలహీనతలను ఆసరాగా తీసుకొని మోసాలకు పాల్పడే ఆస్పత్రులను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ అలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ కోరారు.

మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైద్యరోగ్య శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రయివేట్ ఆస్పత్రుల్లో దోపిడీలు, మోసాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇటీవల రాజధానిలోని కీలక ప్రాంతమైన సికింద్రాబాద్‌లో సృష్టి ఫెర్టిలిటి సెంటర్‌లో జరిగిన ఉదంతం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. అదే విధంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయాలని కోరారు. జవహర్‌నగర్ ప్రాంతంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరారు.

సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు.

# నిధులు కేటాయించినా పనుల్లో ఎందుకు అలసత్వం?

### అధికారులపై అసహనం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి మెట్రో పార్క్ వద్ద ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, ఎస్ఎన్‌డిపి, జిహెచ్ఎంసి,అధికారులతో నియోజకవర్గంలోని సమస్యల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా నియోజకవర్గంలోని నాళా లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కొరకై గతంలోని 103 కోట్లు నిధులు కేటాయించామని, కానీ పనుల్లో ఎందుకు అలసత్వం చూపుతున్నారని అధికారులపై అసహన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రామారావు నగర్ నాల అభివృద్ధి విషయంలో అలాగే భరత్ నగర్ వద్ద నాల నిర్మాణంలో మైసమ్మ చెరువు నుంచి పనులు చేపట్టకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఫతేనగర్ లోని దీన్ దయాల్ నగర్, జింకలవాడ నాలా అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని, కేపిహెచ్బి డివిజన్ కల్వరి టెంపుల్ వద్ద పైప్లైన్ నిర్మాణం డ్రైనేజ్ అభివృద్ధి కొరకు కూడా నిధులు కేటాయించినా పనుల్లో అలసత్వం వహిస్తున్నారని అన్నారు. కేపిహెచ్బి డివిజన్లో పెరుగుతున్న హాస్టల్స్ వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవుతుందని, కెపిహెచ్‌బిలో ముఖ్యంగా హాస్టల్స్ వల్ల సమస్య తలెత్తుతుంది. 1800 హాస్టల్స్ ఉన్నాయి. ఎలాంటి పర్మిషన్ లేవు. టౌన్ ప్లానింగ్ వాళ్ళు విచ్చల విడిగా పర్మిషన్లు ఇస్తున్నారు. కాంట్రాక్టర్ లు జాప్యం వహిస్తున్నారు వారికి నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు. బ్లాక్ లిస్ట్ లో పెట్టండి, అధికారులు ఏదైనా వర్క్ స్టార్ట్ అయ్యే ముందు సమాచారం ఉండదు. కార్పొరేటర్ల కు గౌరవం లేదు. కూకట్‌పల్లి కి ఫండ్ విషయంలో లో అన్యాయం జరిగింది. పక్క నియోజక వర్గంలో మంచి రోడ్లు తవ్వి రోడ్లు వేస్తున్నారు అని ఆరోపించారు.

బాలనగర్ డివిజన్ ఇందిరానగర్, శ్రీశ్రీ నగర్ లో రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఎక్కడికక్కడ వీధి దీపాలు పునరుద్ధరించాలని తెలిపారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కూకట్పల్లి నియోజకవర్గంలో డ్రైనేజ్ వ్యవస్థ దాదాపు 80 పూర్తి చేసుకున్నామని అలాగే వాటర్ వర్క్స్ పనులు 90 పూర్తి చేసుకున్నామని ఆనాడు త్వరిత గతిన పనులు పూర్తి చేసుకోబట్టే ఈరోజు నాడు నియోజకవర్గంలో కొంత మేర అయిన ఊపిరి పీల్చుకోగలుగుతున్నామని అన్నారు. ఎక్కడైనా నిధులు ఇబ్బంది ఉంటే తమకు తెలియజేయాలని నిధులు విడుదలైనా కూడా పనులు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజ్ ,నాలాల విషయంలో అలసత్వం వహించవద్దని, అలాగే నూతనంగా మంజూరు అయిన పనులకు త్వరగా టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభం అయ్యేలా వెంటనే చర్యలు తీసుకోవాలని పనులు త్వరగా పూర్తిచేసి తదుపరి సమావేశానికి సిద్ధంగా ఉండాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దాం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, సభిహా గౌసుద్దీన్, మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, పగడాల బాబురావు, మరియు ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్, హెచ్ఎండిఏ, ఎస్ఎన్‌డిపి, జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో ఇంటింటికీ మద్యం

### కేబినెట్ ఆమోదించడం సిగ్గుమాలిన చర్య : బిఆర్ఎస్

**ప్రజాపక్షం/ వికారాబాద్ :** కాంగ్రెస్ పాలనలో ఇంటింటికి మద్యం క్యాబినెట్ ఆమోదించడం సిగ్గు మాలిన చర్య అని వికారాబాద్ మండల వర్కింగ్ అధ్యక్షులు పగిల అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేక ప్ర.ల నుండి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక తెలంగాణ ప్రజలను మత్తులో మొంచి కాలం గడపాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రాభుత్వం అన్నారు.

కేసిఆర్ పాలనలో ఇంటికి తాగునీళ్లు ఇస్తే కాంగ్రెస్ పాలనలో గ్రామ గ్రామానికి వైన్స్ పెట్టి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర అదాయం దండుకోవాలని చుస్తుంది అని అన్నారు. గతంలో రేవంత్‌రెడ్డి కేసిఆర్ తెలంగాణను తాగుబోతు తెలంగాణ మార్చిందని ఆరోపించి ఎన్నికల మేనిసెస్టోలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మద్యం పాలసీ చట్ట సవరణ చేయడం సీగ్గ చేటు అన్నారు. ప్రస్తుతం ఉన్న వైన్‌షాప్ ల లైసెన్సులను ఫీజు 2లక్ష రూపాయలుచ ఉన్నదాన్ని 3లక్షలకు పెండచడం ఏమిటి అన్నారు. మేనిఫెస్టోలో తెలంగాణ యువతకు నిరుద్యోగులకు వచ్చిన హామీలను అమలు చేయలేక విచ్చలవిడిగా మద్యం విక్రయించి తెలంగాణ యువతను మద్యం మత్తులో ముంచాలని కుట్ర జరుగుతుందని అన్నారు.

# స్పోర్ట్స్ పాఠశాలలో క్రీడా పోటీలు ప్రారంభం

### ప్రారంభించిన మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట్ :** ఉత్సాహంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు.హకీంపేట్ లోని తెలంగాణ క్రీడా పాఠశాలలో మేడ్చల్ జిల్లా స్థాయి అండర్ 8,10,12,14,16, 18,20,మెన్ అండ్ ఉమెన్ అర్థమెటిక్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించినట్లు నిర్వాహ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ తెలిపారు. ఉదయం ప్రారంభమైన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి హాజరై క్రీడాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటే క్రీడలను ఎంచుకొని తగిన శిక్షణలో ముందుకు సాగాలని విద్యార్థి దశ ఇందుకు ఎంతో ముఖ్యమని విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని తెలియజేశారు. వివిధ పాఠశాలల కళాశాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు సాధించినారు,ముగింపు కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ వచ్చేనెల మూడు నాలుగు తారీకులలో హనుమకొండలో జరిగే 14వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో మేడ్చల్ జిల్లా తరపున ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పాల్గొనడం జరుగుతుందని తెలియజేశారు. వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను ఎంపిక చేయటం జరుగుతుందని తెలియజేశారు. అదే విధంగా ఏడవ తారీఖు జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి జావలిన్ త్రూటీలలో విద్యార్థులను ఎంపిక చేయటం జరిగిందని, క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి తమ పాఠశాలకు మేడ్చల్ జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని మున్ముందు క్రీడాకారులు ఉత్తమ శిక్షణలో ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ రాజు, వైస్ ప్రెసిడెంట్ అశోక్, టెక్నికల్ కమిటీ మెంబర్స్ శేఖర్, సునీల్, మల్లికార్జున్, భద్రం, మణికంఠ, హర్ష, స్పోర్ట్స్ స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ గోపాల్, ప్రభాకర్, శంకర్, క్రీడాకారులు క్రీడాకారుల తల్లిదండ్రులు వివిధ పాఠశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## నాగదేవత దయతో ప్రజలు సంతోషంగా ఉండాలి

### బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** మంగళవారం రోజు 127 రంగారెడ్డి నగర్ డివిజన్ గిరి నగర్ నాగ దేవత ఆలయం లో నిర్వహించిన నాగదేవత కళ్యాణ మహోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అత్యంత శుభదినమైన నాగుల పంచమి పర్వదినాన నిర్వహిస్తున్న ఈ కళ్యాణ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, నాగదేవత అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు శంకరయ్య, ఖాదర్, ఓంకార్ రెడ్డి, జల్దా లక్ష్మీనాథ్, క్రాంతి యాదవ్, బంటి (సాయి కిరణ్), రమ్మీ, అల్లావుద్దీన్, మహిళా అధ్యక్షురాలు తారక రాణి, భారతి, ఈశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు అమరేందర్ చారి, ఉదయ్ గంజి, సురేష్, ఎ.వరలక్ష్మి, శ్రీకాంత్, వినోద్, జయంత్, శ్రీకాంత్, కె.నాగరాజు, బస్తీ వాసులు కొండ శ్రీకాంత్, యశ్వంత్, నవీన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## కీసర నూతన సిఐగా ఆంజనేయులు

**ప్రజాపక్షం/నాగారం:** కీసర పోలీస్ స్టేషన్ నూతన సిఐగా అర్వపల్లి ఆంజనేయులు మంగళవారం బాధ్యత లు స్వీకరించారు. ఈయన ఇంతకుముందుకు స్పెషల్ బ్రాంచ్ బోనగిరిలో విధులు నిర్వహించా రు. కీసర పిఎస్‌లో సిఐగా విధులు నిర్వహించిన కె.శ్రీనివాస్ ఎస్‌ఓటి1కి బదిలీపై వెళ్లారు. ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు సాగుతానని,శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తానని నూతన సిఐ తెలిపారు.



## సాంఘిక సంక్షేమ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతగిరిపల్లి బాలుర గురుకుల కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ లో తక్షణ ప్రవేశాలు చేపడుతున్నట్లు ప్రిన్సిపల్ డి.రమాదేవి తెలిపారు. ఖాళీగా ఉన్న బైపిసి , ఎంపిసి గ్రూపుల్లో ఎంపికైన వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. విద్యార్థులు ఈనెల 31వ తేదీన ఉదయం 9గంటలకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు ,కులం ,అదయం ,పదవ తరగతి మెమో, 3 పాస్ పోర్టులు ,3సెట్ల జీరాక్స్ కాఫీలు తీసుకుని హాజరుకావాలని తెలిపారు. అభ్యర్థుల నుండి అప్లికేసన్ తీసుకోని మధ్యహ్నం 1గంటలవరకు తీసుకోబడును అనంతరం సయత్రం 4గంటలకు జాబితాను ప్రదర్శిస్తామని తెలిపారు.

## భర్తపై హత్యాయత్నం : భార్య అరెస్ట్

**ప్రజాపక్షం/దుండిగల్ :** భర్తపై హత్యాయత్నానికి ప్రయత్నించిన భార్యను వారి స్నేహితులను అరెస్ట్ చేసిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాందాస్ నాయక్ (33) నివాసం రాజీవ్ గృహకల్ప, ప్రగతి నగర్, పెద్దగూడెం తాండ వనపర్తి జిల్లా వాస్తవ్యులు. రాందాస్ నాయక్‌కు పదహారేళ్ల క్రితం జ్యోతి అనే మహిళతో వివాహం జరిగిందనీ వీరికి ఇద్దరు సంతానం. ఇదిలా ఉండగా కొన్ని సంవత్సరాల నుంచి రాందాస్ నాయక్, జ్యోతి ల మధ్య గొడవల కారణంగా జ్యోతి మూడేళ్ల నుంచి విడివిడిగా జీవనం కొనసాగిస్తున్నారు. రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్నారని జ్యోతి మరియు రాందాస్ నాయకుల ఇరువురి పెద్దమనుషులు భార్యాభర్తలు కలిసి ఉండాలని సర్ది చెప్పి ఇద్దరూ జ్యోతి ఉండే రాజీవ్ గృహకల్పలోని ఇంటిలో ఉండేలా చూశారు.

మళ్లీ ఇద్దరిమధ్యా గొడవలు రావడంతో జ్యోతి ఎలాగైనా రాందాస్ నాయకుని చంపేయాలి అనే ఉద్దేశంతో తన స్నేహితుడైన గోపి, బంధువైన హేమంతులతో చర్చించి తేదీ 26.7.2025 నాడు రాత్రి ఎనిమిదిన్నర గంటలకు జ్యోతి రాందాస్ నాయక్‌కు ఫోన్‌చేసి ప్రగతి నగర్ కు రమ్మనగా రాందాస్ నాయక్ అక్కడికి రావడం పథకం ప్రకారం, హేమంత్, గోపి, జ్యోతిలు చంపేయాలని పన్నాగం పన్ని, గోపిను మద్యం సేవిద్దాం అని చెప్పి విఎన్‌ఆర్ కాలేజ్ పక్కన ఉన్న చివాస్ వైన్స్ వద్దకు రాందాస్ నాయక్ గోపి తన బైక్‌పై ఎక్కించుకొని వెళ్లారు. షాపులో మద్యం తీసుకొని తర్వాత బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో ఉన్న లహరి గ్రీన్‌పార్క్ ప్రాంతంలో రాందాస్ నాయక్ ను గోపి, శ్రీకాంత్,హేమంత్ స్నేహితుడైన శ్రీకాంత్ కరీముద్దీన్, సుబోధులు మూకుమ్మడిగా మద్యం సీసాలతో, రాళ్లతో దాడిచేసి, రాందాస్ నాయక్ చనిపోయాడు అని భావించి అక్కడ నుంచి నిందితులు పారిపోయారు. అనంతరం స్పృహలోకి వచ్చిన రాందాస్ నాయక్ రాజీవ్ గృహకల్పలో ఉంటున్న తమ్ముడి ఇంటికి వెళ్లి తర్వాత మమత ఆసుపత్రికి చికిత్స తీసుకొని బాచుపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని జీరో ఎఫ్ఐఆర్‌ను దుండిగల్ పిఎస్‌కు ట్రాన్స్ఫర్ చేసి కేసును నమోదు చేసుకున్న దుండిగల్ పోలీసులు ఆరుగురి నిందితులను అరెస్టు చేశారు.

## ఆర్‌డిఒ చెప్పే విషయాల్లో వాస్తవం లేదు

ఫార్మా వ్యతిరేక ఉద్యమ నాయకురాలు కవుల సరస్వతి

**ప్రజాపక్షం/యాచారం :** ఇబ్రహింపట్నం ఆర్‌డిఒ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని ఫార్మా వ్యతిరేక ఉద్యమ నాయకురాలు కవుల సరస్వతి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రైతుల విషయంలో ఆర్‌డిఒ కోర్టు ఇచ్చిన తీర్పులను గౌరవించడం లేదన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేయడానికి పేపర్ల ద్వారా తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారన్నారు. ఫార్మాసిటీ భూసేకరణ విషయంలో అవార్డు జారీ చేసిన భూములు మా స్వాధీనంలో ఉన్నట్లే అని ఇచ్చిన ప్రకటన అసత్యమన్నారు. అవార్డు జారీ చేసిన అట్టి అవార్డును సవాలు చేస్తూ రైతులు హైకోర్టులో 12 కేసులు ( మేడిపల్లి, కుర్మిద్ద) కేసుల్లో రద్దు చేశారన్నారు. మిగతా కేసుల్లో భూమి స్వాధీనం చేసుకోవద్దని అదేశాలుండగా భూమి మాదే మా స్వాధీనంలో ఉందని ఆర్‌డిఒ చెప్పడం సరైంది కాదని ఆమె అన్నారు. కోర్టు అదేశాలున్నాయి, ఫార్మా సిటికి భూములు ఇవ్వని రైతుల పేర్లను ఆన్‌లైన్ లో నమోదు చేయాలని కోరారు. దీంతో అధికారులకు చట్టాలపై అవగాహన లేదని అర్థమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

## ప్రభుత్వ భూమి కబ్జా.. ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని ఫిర్యాదు

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రభుత్వ భూమి కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం ఆరోపించారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణ సిఐ విజయ్‌కుమార్, ఎసిపి లక్ష్మీనారాయణకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా మహ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ ఫరూఖ్‌నగర్‌లో సర్వే నంబర్ 10, 11లకు పక్కన ప్రభుత్వ భూమి ఉందని, పట్టా భూమితోపాటు ప్రభుత్వ భూమిని అక్రమించుకొని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని ఫరూఖ్‌నగర్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, ప్రభుత్వ భూమిని పరిశీలించి అధికారులు వెళ్ళిన మరుసటి రోజు తనపై హత్యాయత్నం చేసేందుకు కొంతమంది వచ్చారని , దాంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పట్టాదారుల నుండి తనకు ప్రాణాపాయం ఉందని, తనకు ఏమి జరిగినా పూర్తి బాధ్యత వారిదేనని పేర్కొన్నారు.

## సిబ్బందికి పిపిఇ కిట్ల పంపిణీ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రజల కోసం అనునిత్యం పనిచేసే జిహెచ్ఎంసి ఎంటమాలజీ సిబ్బందికి వారి వ్యక్తి గత రక్షణకు ప్రభుత్వం అందిస్తున్న పిపిఇ కిట్లను బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం వార్డు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీ ప్రజల కోసం ప్రతి దినం శ్రమించి జిహెచ్ఎంసి సిబ్బంది కార్మికులు అనారోగ్యాలకు గురికాకుండా కిట్లు పంపిణి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఇ రవీందర్‌రెడ్డి, సూపర్వైజర్ నరేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకుందాం

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు సూచించారు. మంగళవారం పట్టణంలోని సాయిరాజా పంక్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన పట్టణ కమిటీ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు ఐక్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో గజ్జల ప్రవీణ్, నర్సింహా, గట్టొజు విజయ్, రమేష్, రామకృష్ణ, అనిల్ గౌడ్, కుదుముల బాలరాజు, శ్యామ్ సుందర్, అనితలు పాల్గొన్నారు.

## కొరత లేకుండా ఎరువులు పంపిణీ

ఫరూఖ్‌నగర్ వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కొరత లేకుండా అన్నదాతలకు ఎరువులను పంపిణీ చేస్తున్నామని ఫరూఖ్‌నగర్ వ్యవసాయశాఖ అధికారి నిశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆదర్శ రైతు సేవా కేంద్రం, ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘంలో 676 యూరియా బస్తాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రం2లో 220బస్తాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. యూరియా కొరత లేకుండా అన్నదాతలకు అవసరం మేరకు అంధిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి తేజ, ప్రాథమిక సహకార సంఘం నిర్వాహకులు, ఆగ్రో సేవా కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

## పార్టీ బలపేతానికి పనిచేయాలి

అందెల శ్రీరాములు యాదవ్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** పార్టీని బలపరిచే దిశగా నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మంగళవారం నాదర్‌గుల్ బిజెపి కార్యాలయంలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు రాజభూపాల్ సహకారంతో బడంగ్‌పేట కార్పొరేషన్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షులుగా క్యారగారి అరవింద్, గుజ్జుల పద్మారావు, అగ్రిసెట్టి సైదులు, ఎ.నర్మదా, ప్రధాన కార్యదర్శులుగా రావుల మల్లేష్, కొంతం మురళీదర్‌రెడ్డి, కోశాధకారి అర్చన, కార్యదర్శులు ఎం.ప్రవీణ్‌గౌడ్, చైతన్యశెట్టి, ఎస్.రాంచందర్, పి.పద్మజ, కార్యవర్గ సభ్యులుగా మహేందర్, మౌనిక, స్నేహ, అభిలాష్‌రెడ్డి, గణేష్, కుమార్, దారా సంతోష్, లక్ష్మణ్, గడ్డం మధుతేజ నియమితులయ్యారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** మన్సూరాబాద్ ఎల్ పిటి మార్కెట్ పక్కన ఉన్న హైరేంజ్, సిందూర అపార్ట్మెంట్ వాసులు ఎదురుకుంటున్న ట్రాఫిక్, శానిటేషన్ కష్టాలను శానిటేషన్ డిఇ నీలిమతో కలిసి మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు మునగాల హరీష్ రెడ్డి, శ్రీధర్ గౌడ్,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## జీవాలకు టీకాలు వేయించాలి

జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్‌రావు



**ప్రజాపక్షం/యాచారం :** రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ మధుసూధన్ రావు అన్నారు. మంగళవారం యాచారం గ్రామ పంచాయతీ పరిధిలోని గాండ్ల గూడ, మొగుళ్ళవంపు గ్రామాల్లో నీలి నాలుక వ్యాధి టీకాలను గొర్రెలు, మేకలలో వేశారు. ఈ సందర్భంగా మధుసూధన్ రావు మాట్లాడుతూ సీజనల్‌లో వచ్చే వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రేఖా, వీరారెడ్డి, వి.శివాని, వెంకటయ్య, వసంత తదితరులు పాల్గొన్నారు.

# నగరంలోని నిరుపేదలకు ఉపాధి ఉన్న చోటే ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో నివసిస్తున్న నిరుపేదలు తమ ఉపాధి అవకాశాలు కోల్పోకుండా వారి నివాస ప్రాంతాలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నాయకులు అజారుద్దీన్, నవీన్ యాదవ్‌లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజాపాలన ప్రభుత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరానికి సంబంధించి గత ప్రభుత్వం సిటీ అవతల కొల్లూరులో ఇల్లు కట్టించడంతో ఉపాధిని కోల్పోతామనే భయంతో నిరుపేదలు అక్కడికి పోయే పరిస్థితి లేదన్నారు. అందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉపాధి ఉన్న చోటే వారు నివసించే దగ్గరే ఇల్లు కట్టాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోందని మంత్రి తెలిపారు. స్థలాలు ఉన్న వారికి ఇల్లు మంజూరు చేయడంతో పాటు స్థలాలు లేని వారికి ఎలా ఇల్లు ఇవ్వాలని అనే అంశంపై పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నూతన్ రేషన్ కార్డులు పంపిణీ వేగవంతమైందని, ఇప్పటికే దాదాపు 50 వేల రేషన్ కార్డులు వెరిఫికేషన్ పూర్తి అయ్యాయని తెలిపారు. హైదరాబాద్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అనేక ఫ్లై ఓవర్‌లు అండర్ పాస్‌లు, ఎస్‌టిపిలు, పార్క్‌లు డ్రెయినేజీలు నిర్మిస్తున్నామన్నారు. కృష్ణ, గోదావరిల నుంచి కాంగ్రెస్ హయాంలో తెచ్చిన నీరు తప్పా తెలంగాణ వచ్చిన తర్వాత గత బిఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు గత ప్రభుత్వం అదనంగా ఒక్క చుక్క నీరు తేలేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మెరుగైన సేవలు, అభివృద్ధి కోసం అధికార పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు.

## మేధో సంపత్తి హక్కులపై అవగాహన

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పివి నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వ విద్యాలయంలోని రాజేంద్ర నగర్ పశువైద్య కాలేజీలో మేధో సంపత్తి హక్కులపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పిజి,పిహెచ్ డి విద్యార్థులు పాల్గొన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సహాయంతో సదస్సునిర్వహించబడింది. ప్రారంభ సమావేశంలో యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీస్ డాక్టర్ ఉదయ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మేధో సంపత్తి హక్కుల విశ్వవిద్యాలయ నోడల్ ఆఫీసర్, విశ్వవిద్యాలయ పరిశోధన డైరెక్టర్ డాక్టర్ హరికృష్ణ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కల్పనా శాస్త్ర,డాక్టర్ రాధికలు మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ, పేటెంట్ దాఖలాకు సంబంధించిన ప్రక్రియలపై ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమం ముగింపు సమావేశానికి విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ శరత్ చంద్ర, పరిశోధన డైరెక్టర్ డాక్టర్ హరికృష్ణ హాజరై ఇలాంటి ప్రయోజనకరమైన శిబిరాల ద్వారా పరిశోధకులు, అధ్యాపకులు మరింతగా మేధో సంపత్తి హక్కులు సాధించే దిశగా ముందుకు సాగాలని చెప్పారు.




## ప్రజా ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు





జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్/ఎల్‌బినగర్ :** గ్రేటర్ హైదరాబాద్ ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టామని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో జిహెచ్ఎంసి మంగళవారం నుంచి ప్రారంభించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని కమిషనర్ చార్మినార్, ఎల్.బి. నగర్ జోన్‌లోని పలు ప్రాంతాల్లో క్షేత్ర పరిశీలన చేశారు. ఈ డ్రైవ్‌లో భాగంగా రోడ్లు, కాలనీలు, బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. మురుగు కాల్వలను శుభ్రం చేసి, నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. దోమల బెడదను నివారించడానికి ఎంటమలాజీ అధికారులు ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లను ముమ్మరం కార్యక్రమాలు చేపట్టారు. క్షేత్ర పరిశీలన అనంతరం డ్రైవ్‌ను ప్రభావంతంగా చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ పారిశుద్ధ్యానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా, చెత్త బుట్టల్లోనే వేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంటికి వచ్చిన స్వచ్ఛ ఆటోల కే చెత్త అందివ్వాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ డ్రైవ్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు కూడా పాల్గొని, తమ వంతు సహాయాన్ని అందించి, కాలనీ పరిశుభ్రతకు దోహదపడే విధంగా తమ వంతు బాధ్యతా తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ఈ పారిశుద్ధ్య డ్రైవ్‌కు మరింత మెరుగ్గా చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ శాసనసభ్యులు జుల్ఫికర్ అలీ, శాసనమండలి సభ్యుడు రహమత్ బైగ్, కార్పొరేటర్లు మహమ్మద్ ముస్తఫా అలీ, సయ్యద్ సోహైల్ ఖాద్రీ, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న, ఎల్‌బి నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరావు, జిహెచ్ఎంసి జలమండలి మేనేజర్ అశోక్‌రెడ్డి, ఎసిపి ప్రతాప్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎండి రఫీ, ఎంహెచ్ఒ నగేష్, ఎఇ విగ్నేశ్వరి, ఏయు బిడి శ్రీనివాస్, ఎఇ మణి తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో చేసిన ఉద్యోగంలో సంతృప్తి





'ఈస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంకితభావంతో చేసిన ఉద్యోగంలో సంతృప్తి ఉంటుందని, నూతనంగా విధులలో చేరిన మోటార్ వెహికల్ ఇన్స్‌స్పెక్టర్లు మూడు దశాబ్దాలకుపైగా సర్వీసులో ఉంటారని, ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఈస్కీ) డైరక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్ర రవాణాశాఖలో నూతనంగా ఎంపికైన 102 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్ స్పెక్టర్లకు గచ్చిబౌలిలోని ఈస్కీలో 16 రోజుల శిక్షణ ముగింపు సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన రామేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ వరకు సేవాతత్పరత భావం కలిగి ఉండాలని ఉద్యోగులకు సూచించారు. మేడ్చల్ రంగారెడ్డి జిల్లాల రవాణా అధికారి రఘునందన్ గౌడ్ మాట్లాడుతూ విధుల్లో నూతనంగా చేరిన యువకులు నిబద్ధత, నిజాయితీతో కూడిన విధులను నిర్వహించి, ప్రభుత్వానికి, రవాణా శాఖకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ విభాగం హెడ్ డాక్టర్ ఆర్.వెంకట్‌రెడ్డి, కాలేజ్ చీఫ్ ఎస్.లక్ష్మి కాంతరావు, డిప్యూటీ ఛీఫ్ డాక్టర్ పి.రాజారావు, రవాణా అధికారి చంద్రశేఖర్, మేనేజిమెంట్ టెక్నాలజీ విభాగంహెడ్ డాక్టర్ జ్యోతితో పాటుగా సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ విభాగం ఫ్యాకల్టీ సి.హెచ్ తిలక్, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. సునీత తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట చెక్‌పోస్టులు రద్దు చేయడం హర్షణీయం

రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాధిక్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** అంతర్రాష్ట్ర రవాణా చెక్‌పోస్టులను రద్దు చేస్తామని తెలంగాణ క్యాబినెట్‌లో మంత్రి వర్గం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ అన్నారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పూలబోకే అందించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సయ్యద్ సాధిక్ మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దుల్లో 15 చెక్ పోస్టులు ఉన్నాయని, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ తరుపున రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్‌తోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఈనెల 26వ లిఖిత పూర్వకంగా సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పంధించి అంతరాష్ట్ర చెక్ పోస్టులను తొలగిస్తామని నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.


## మున్సిపల్ అభివృద్ధికి నిధులు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/కొత్తూరు :** కొత్తూరు మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు రూ.40కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం కొత్తూరు మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర రాజదానికి కూతపెట్టు దూరంలో ఉన్న కొత్తూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మున్సిపల్ పరిధిలో ఉన్న కాశన్న కుంటను మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌ను ఏర్పాటు చేశామని, దానికి అనుగుణంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కొత్త, పాత అనే తేడా లేకుండా కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. పార్టీలకు అతీతంగా అందరూ సహకరిస్తే కొత్తూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టించేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. వార్డుల వారీగా సమస్యలను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. స్థానికంగా ఉన్న భవనం మున్సిపాలిటీకి ఏమాత్రం సరిపోవడం లేదని, నూతన భవన నిర్మాణం కోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను అదేశించారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తున్నట్లు తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు అన్ని విధాల మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ డోలీ రవీందర్, మునిసిపల్ కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.




## వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక దృష్టి






సమీక్ష సమావేశంలో సెర్ఫ్ సిఇఒ, రంగారెడ్డి ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వర్షాకాలం దృష్ట్యా రంగారెడ్డి జిల్లాలో ఎటువంటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని రంగారెడ్డి ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, సెర్ఫ్ సిఇఒ దివ్యదేవరాజన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సెర్ఫ్ కార్యాలయం నుంచి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు, యూరియ, ఎరువుల నిల్వలు, సంక్షేమ హాస్టళ్లలోని పరిస్థితులు, తదితర అంశాలపై జిల్లా అధికారులతో దివ్యదేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలతో ఎక్కడ కూడా ప్రాణనష్టం, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా జిల్లాలోని హిమాయత్ నగర్ పరిసర ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న వంతెనలు, ఫుల్ ట్యాంక్ లెవల్లో ఉన్న చెరువులను తనిఖీ చేసి లోతట్టు ప్రాంతాలలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా రెవెన్యూ, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు, ఆయా శాఖల టీమ్ లు సంసిద్ధంగా ఉండాలని, క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. రెవెన్యూశాఖ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భారీ వర్షాలతో వరదల పరిస్థితి నెలకొంటే సమర్థంగా ఎదుర్కోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్య సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాలలో ఫీవర్ సర్వే చేపట్టి ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా, విషజ్వరాలు, అతిసారం వంటికి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారికి సూచించారు. ఎరువుల సరఫరాలో ఎక్కడ ఇబ్బంది పడకుండా రెవెన్యూ, పోలీసు శాఖల సహకారంతో టోకెన్ పద్ధతి ద్వారా సరఫరా చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరతలు ఉండకూదని, అన్ని విక్రయ కేంద్రాలల్లో స్టాక్ వివరాలతో కూడిన బోర్డును ప్రదర్శించాలని ఆమె ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పశువులకు సోకే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా టీకాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని, పెండింగ్ ఉన్న మండలాలు, మున్సిపాలిటీలలో అర్హులైన వారందరికీ కార్డులు అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాలను గుర్తించి, ఇతర భవనాల్లోకి మార్చాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో తాగునీటి సౌకర్యం, నాణ్యమైన ఆహారం అందించాలని సంబంధిత అధికారులకు దివ్యదేవరాజన్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ సంగీత, జెడ్పి సిఇఒ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, వైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వర్ రావు, డిఆర్ డిఎపిడి శ్రీలత, జిల్లా విద్యా శాఖ అధికారి సుశీందర్రావు, మిషన్ భగీరథ అధికారి ఎస్.రాజేశ్వర్, సంక్షేమ శాఖ అధికారులు కేశురామ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## కోల్‌కతా హెడ్‌కోచ్ రాజీనామా

### 'ఆల్ ది బెస్ట్' చెప్పిన ఫ్రాంచైజీ..!




ఐపిఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్‌కు హెడ్‌కోచ్ చంద్రకాంత్ పండిట్ భారీ షాకిచ్చాడు. ఉన్నట్టుండి బాధ్యతల నుంచి వైదొలిగాడు చంద్రకాంత్. మూడేళ్లుగా కోచ్‌గా కొనసాగిన ఆయన మంగళవారం నాడు నా దారి నేను చూసుకుంటా అంటూ పదవికి రాజీనామా చేశాడు. ఆయన నిర్ణయాన్ని గౌరవిస్తూ.. ఫ్రాంచైజీ కూడా అమోదం తెలిపింది. థాంక్యూ చందు సర్ అంటూ కోల్‌కతా యాజమాన్యం ఎక్స్ వేదికగా వీడ్కోలు పోస్ట్ పెట్టింది. 'కోల్‌కతాకు కోచ్‌గా విశేష సేవలందించిన చంద్రకాంత్ కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని అనుకుంటున్నాడు. ఆయన ఇకపై మా జట్టు హెడ్‌కోచ్‌గా ఉండడు. ఈ మూడేళ్ల సమయంలో మీ అమూల్యమైన సేవలకు ధన్యవాదాలు. కోల్‌కతాను మూడోసారి ఐపీఎల్ విజేతగా నిలిపిన ఘనత మీది. అంతేకాదు మీ క్రమశిక్షణతో, నాయకత్వ నైపుణ్యంతో స్క్వాడ్‌ను పటిష్టంగా మార్చారు. మీ భవిష్యత్తుకు ఆల్ ది బెస్ట్' అని కోల్‌కతా ఫ్రాంచైజీ ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చింది. అయితే.. హఠాత్తుగా చంద్రకాంత్ వైదొలగడంపై కొన్ని అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈమధ్యే కోల్‌కతా అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ డబ్ల్యూపీఎల్ జట్టు యూపీ వారియర్స్‌కు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ క్రమంలో.. చంద్రకాంత్ కూడా ఏదైనా డబ్ల్యూపీఎల్ జట్టు కోచ్ పదవి ఆశిస్తున్నాడా? అనేది తెలియాల్సి ఉంది.

## బెంగళూరులో దులీప్ ట్రోఫీ.. నాగ్‌పూర్‌లో ఇరానీ కప్!



దేశవాళీ క్రికెట్ పండుగకు మరో ఇరవై రోజుల్లో తెరలేవనుంది. ఆగస్టు చివరి వారంలో బెంగళూరు వేదికగా దులీప్ ట్రోఫీతో డొమెస్టిక్ సీజన్ 2025–26 ప్రారంభం కానుంది. ఆ వెంటనే టీ20 ఫార్మాట్లో జరుగబోయే ఇరానీ కప్ మ్యాచ్‌లకు నాగ్‌పూర్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈసారి టీమిండియా స్టార్ తిలక్ వర్మ సారథిగా తన తడాఖా చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇంటర్ జోన్ ఫార్మాట్లో జరుగనున్న దులీప్ ట్రోఫీలో తిలక్ సౌత్ జోన్ జట్టును నడిపించనున్నాడు.

**దులీప్ ట్రోఫీ ఇంటర్ జోన్**

ఫార్మాట్లో జరుగనున్న దులీప్ ట్రోఫీ ఆగస్టు 18న మొదలై సెప్టెంబర్ 15న ముగుస్తుంది. బీసీసీఐ కొత్తగా నిర్మించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. టైటిల్ కోసం ఆరుజట్లు కాచుకొని ఉన్నాయి. సౌత్ జోన్, సెంట్రల్ జోన్, వెస్ట్ జోన్, ఉత్తర జోన్, తూర్పు జోన్, ఈశాన్య జోన్ టీమ్స్ తలపడనున్నాయి. వీటిలో సౌత్, వెస్ట్ జోన్ జట్లు నేరుగా సెమీ ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఆగస్ట్ 28నార్త్, ఈస్ట్ మధ్య ఆగస్టు 31న సెంట్రల్, ఈశాన్య జోన్ల మధ్య క్వార్టర్ ఫైనల్ ఫైట్ జరుగనుంది. సెప్టెంబర్ 4 నుంచి 7వ తేదీ వరకూ సెమీఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 11న జరిగే ఫైనల్‌తో టైటిల్ విజేత ఎవరో తేలిపోనుంది.


**కరుణ్ ఏ జట్టుకు**

దులీప్ ట్రోఫీ తర్వాత నాగ్‌పూర్ వేదికగా ఇరానీకప్ జరుగనుంది. గత సీజన్ రంజీ విజేత విదర్భ, రెస్ట్ ఆఫ్ ఇండియాను ఢీకొననుంది. అయితే.. నిరుడు విదర్భ తరఫున పరుగుల వరద పారించిన కరుణ్ నాయర్ ఈసారి ఆడతాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. ఈమధ్యే అతడు సొంత జట్టు కర్నాటకకు మారాడు. కానీ, సౌత్ జోన్ సెలెక్టర్లు మాత్రం కరుణ్‌ను దులీప్ ట్రోఫీ స్క్వాడ్‌లోకి తీసుకోలేదు. దాంతో, ఈ స్టార్ ప్లేయర్ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఆడడంపై అనిశ్చితి నెలకొంది. మరో విషయం.. యువ పేసర్ రసిక్ దార్ సలాం జమ్ముకశ్మీర్ జట్టును వీడాడు. బోర్డు నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ రావడంతో ఈ స్పీడ్‌స్టర్ బరోడాకు మారాడు. ఇప్పటికే ఐపీఎల్ స్టార్ జితేశ్ శర్మ సైతం బరోడాకు ఆడేందుకు సిద్ధమయ్యాడు.

## 'తగ్గేదేలే' పిచ్ క్యూరేటర్‌తో గంభీర్ వాగ్వాదం

మాంచెస్టర్‌లో అద్భుత పోరాటంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించిన భారత జట్టు ఓవల్ టెస్టుకు సన్నద్ధమవుతోంది. నిర్ణయాత్మక ఈ మ్యాచ్‌కు ఇంకా రెండు రోజులే ఉండడంతో గట్టిగా నెట్స్‌లో చెమటోడ్చుతోంది గిల్ బృందం. అయితే.. భారత క్రికెటర్లు ప్రాక్టీస్ చేస్తుండగా ఓవల్ పిచ్ క్యూరేటర్ అభ్యంతరం తెలిపాడు. దాంతో, హెడ్‌కోచ్ గౌతం గంభీర్ అతడితో వాగ్వాదానికి దిగాడు. అసలు ఎందుకు వీరిద్దరూ గొడవపడ్డారంటే..? మంగళవారం రోజు భారత క్రికెటర్లు ఓవల్ మైదానంలో నెట్స్ ప్రాక్టీస్ చేస్తున్నారు. కోచ్ గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాన్స్ కొటాక్ ఆటగాళ్లను గమనిస్తున్నారు. ఈ సమయంలోనే పిచ్ క్యూరేటర్ లీ ఫోర్టిస్ అక్కడికి వచ్చాడు. అతడు ఇదేంటీ మీరు ఎక్కువ ఇక్కడ సాధన చేస్తున్నారు? మీకు అనుమతి ఇచ్చింది అక్కడి వరకేగా అని అన్నాడు. మామూలుగానే ముక్కు మీద కోపంతో ఊగిపోయే గౌతీకి అతడలా అనే సరికి చిర్రెత్తుకొచ్చింది.

'నువ్వు కేవలం మైదానం సిబ్బంది మాత్రమే. మేము ఇక్కడే ప్రాక్టీస్ చేసుకుంటాం. మేము ఏం చేయాలో నువ్వు చెప్పనక్కర్లేదు. మాకు అన్నీ తెలుసు అని ఎవరికి ఫిర్యాదు చేస్తావో చేసుకో' అని అతడితో తెగేసి చెప్పాడు. గంభీర్ ఒక్కసారిగా అలా అనేసరికి ఫోర్టిస్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. బ్యాటింగ్ కోచ్ అతడికి సర్ది చెప్పాడు. ప్రస్తుతం టీమిండియా కోచ్, క్యురేటర్ ఫోర్టిస్‌ల వాగ్వాదానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరలవుతోంది.




**గెలిచి తీరాల్సిందే**

భారత్, ఇంగ్లాండ్‌ల మధ్య జూలై 31 బుధవారం చివరిదైన ఐదో టెస్టు జరుగనుంది. ప్రస్తుతానికి రెండు జట్లు ఆతిథ్య జట్టు రెండేసి విజయాలతో ముందజంలో ఉంది. మాంచెస్టర్‌లో డ్రాతో బతికిపోయిన టీమిండియా గెలిచి తీరాల్సిందే. డ్రా చేసుకున్నా సరే స్టోక్స్ సేన విజేతగా నిలుస్తుంది. సో.. ఏవిధంగా చూసినా ఓవల్ టెస్టు గిల్ బృందానికి చావోరేవో లాంటిదే. కుడి పాదం వేలి గాయంతో వైస్ కెప్టెన్ పంత్ దూరమవ్వడం కొంత ఇబ్బందికరమే. అతడి స్థానంలో ఎవరిని తీసుకుంటారనేది తెలియాల్సి ఉంది. అయితే.. నాలుగో టెస్టుకు విశ్రాంతితీసుకున్న ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్‌లు కోలుకోవడంతో భారత బౌలింగ్ యూనిట్ మరింత బలంగా మారనుంది.

# మహిళ

**ఫోకస్**

## సత్వర చర్యలు అత్యవసరం



మహిళల ఆరోగ్య సమస్యలు ఎక్కువ అనేది బహిరంగ రహస్యం. చాలా మంది మహిళలు వివిధ కారణాలతో, సమస్యలను బయట పెట్టకుండా, ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న వైనం ఎన్నో సందర్భాల్లో చూస్తునే ఉన్నాం. మహిళలే స్వయంగా అప్రమత్తులు కావడం అత్యవసరం. అదే సమయంలో, మహిళల ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలను చూపే దిశగా సంబంధిత వర్గాల నుంచి సత్వర చర్యలు అత్యవసరం. ముఖ్యంగా వైద్య సేవల అంతగా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న గ్రామీణ మహిళల గురించి ఆలోచించాలి. వైద్య సదుపాయాలు కల్పించాలి. పురుష ఆధిపత్యం వల్ల, మహిళలు వైద్యానికి అనుమతి తీసుకోవాల్సి రావడం దారుణం. ఈ పరిస్థితికి తెరపడాలి. ఆర్థికంగా మహిళ బలపడితేనే, సొంత నిర్ణయాలు తీసుకోగలుగుతుంది. ముఖ్యంగా వైద్య, ఆరోగ్య పరమైన అంశాల్లో మహిళ నిర్ణయాధికారిగా ఉండాలి. అందుకుగాను ఆర్థికంగా ఎదగాలి. ప్రభుత్వాలు, సేవా సంస్థలు ఈ విషయంలో సాయం అందించాలి. జీవనశైలి ఒత్తిడుల నుంచి మహిళలు, ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లోని వారు బయటపడాలి. సమయం లేకపోవడం వల్ల తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం తగదు. ఉద్యోగ ఒత్తిడి, మానసిక దౌర్బల్యం నుంచి విముక్తి పొందాలి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంచాలి. అంగన్వాడీల ద్వారా గర్భిణులు, బాలికలకు పోషకాహారం అందించాలి. ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు, బ్రెస్ట్ స్క్రీనింగ్, పాప్స్‌మియర్ టెస్టులు జరగాలి. మహిళల ఆరోగ్యాన్ని వ్యక్తిగత సమస్యగా తీసుకోకుండా, సామాజిక సమస్యగా గుర్తించాలి. ఆరోగ్యంగా ఉండే మహిళే ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలదు. అందుకే, మహిళల శారీరక, మానసిక, పోషణ, లైంగిక ఆరోగ్యాన్ని సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, కుటుంబం సమష్టిగా కలిసి పని చేయాలి. ఎందుకంటే, ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే, కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. కుటుంబం ఆరోగ్యంగా ఉంటే, సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. సమాజం ఆరోగ్యంగా ఉంటేనే, దేశం అభివృద్ధి చెందుతుంది.

## గణాంకాల్లో మహిళలు..



భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా మహిళల స్థితిగతులపై గణాంకాలు తీసుకొని చూస్తే, వివిధ రంగాల్లో పురోగతి ఉన్నా కూడా లింగ అసమానతలు, అణచివేతలు ఇంకా కొనసాగుతున్నాయనే విషయం స్పష్టమవుతుంది. భారతదేశానికి సంబంధించిన అందుబాటులో ఉన్న గణాంకాలను (2023–24) ఆధారంగా వివిధ అంశాల వారీగా పరిశీలిస్తే, ఈ విషయం స్పష్టమవుతుంది.

**1. విద్యా రంగం**

స్త్రీల అక్షరాస్యత రేటు..
పురుషులు: 84.7 శాతం
మహిళలు: 70.3 శాతం
గ్రామీణ మహిళల్లో సెకండరీ విద్య పూర్తి చేసిన వారు: 46 శాతం
ఉన్నత విద్యలో పూర్తిచేసిన వారు: 49 శాతం

**2. ఉద్యోగం, ఆర్థిక స్వావలంబన**

మహిళల శ్రమ శక్తి పాల్గొనే రేటు..
మహిళలు: 37 శాతం
పురుషులు: 77 శాతం
గ్రామీణ ప్రాంతాల్లో: 42 శాతం
నగరాల్లో: 24 శాతం
(మహిళలు సాధారణంగా అధికంగా వ్యవసాయం, అనధికార రంగాల్లోనే పని చేస్తున్నారు).

**3. బాలికలలో అనీమియా స్థాయి**

15–49 ఏళ్ళ మహిళల్లో 57 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు.

**4. లైంగిక హింస, వేధింపులు మహిళలపై దాడులు..**

2022లో 4.45 లక్షల కేసులు నమోదు (ఎన్‌సిఆర్‌బి ప్రకారం)
అత్యాచార కేసులు: రోజుకు సగటున 90.
గృహ హింస: ప్రతీ 3 మందిలో ఒకరు జీవితంలో ఏదో ఒక దశలో గృహ హింసను ఎదుర్కొంటున్నారు.

**5. రాజకీయ ప్రతినిధిత్వం..**

లోక్‌సభలో మహిళల శాతం (2024): 15 శాతం.
రాజ్యసభలో: 14 శాతం.
గ్రామ పంచాయతీ స్థాయిలో మహిళల రిజర్వేషన్: 33% (చాలా రాష్ట్రాల్లో 50% వరకు ఉంది)

**6. బాలికల స్థితి..**

బాలిక శిశు లింగ నిష్పత్తి (06 ఏళ్ళ వయస్సు):
2011: ప్రతి 1000 మంది బాలురకు 918
2021 (ప్రాథమిక గణాంకం) ప్రతి 1000 మంది బాలురకు 929

**బాల్యవివాహాలు..**

20–24 ఏళ్ల మహిళల్లో 23.3 శాతం మంది వివాహం 18 సంవత్సరాలలోపే జరుగుతున్నది.

**7. మహిళా శక్తీకరణ, డిజిటల్ భాగస్వామ్యం..**

జన్‌ధన్ యోజన పథకం ద్వారా బ్యాంక్ ఖాతాలు కలిగిన మహిళలు: 26 కోట్లకుపైగా
స్వయం సహాయ సమూహాల్లో మహిళల సంఖ్య: 8 కోట్లకు పైగా
ముద్రా యోజన ద్వారా లభించిన రుణాల్లో 68 శాతం రుణాలు మహిళలు పొందుతున్నారు.

## చర్మ సౌందర్యానికి..



**మొటిమలు:** రోజూ చక్కగా ముఖం క్లీన్ చేయండి – మైల్డ్ ఫేస్‌వాష్ వాడండి. టీ ట్రీ ఆయిల్ ను నీటిలో కలిపి మొటిమలపై అప్లై చేయండి. ఇంట్లో ఉండే పసుపు, తేనె మిశ్రమాన్ని మొటిమలపై అప్లై చేయవచ్చు. పుల్లని, మాసాలా అధికంగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండండి. కనీసం తగ్గించండి.

**చర్మం నలుపు / మచ్చలు:** రోజూ సన్‌స్క్రీన్ వాడండి (ఎస్‌పిఎఫ్ 30 లేదా అంతకంటే ఎక్కువ). రోజూ రాత్రి ఆల్మండ ఆయిల్ లేదా ఆలివ్ ఆయిల్ రాసి మసాజ్ చేయండి. బొప్పాయి గుజ్జు, నిమ్మరసం మిశ్రమం మచ్చలపై వారానికి 2సార్లు రాయండి.

**చర్మం మీద ముడతలు / వృద్ధాప్య లక్షణాలు:** రాత్రిపూట విటమిన్ 'ఇ' ఆయిల్ రాసుకుని నిద్రపోవడం మంచి పరిష్కారం. అవిసె పిండి, పెరుగు మిశ్రమాన్ని వారానికి 2సార్లు చొప్పున ముఖానికి రాయండి. నీరు ఎక్కువగా తాగితే, చర్మం నిగారింపు పొందుతుంది. సిగరెట్, మద్యం, నిద్రలేమి వంటివి ముడతలకు ప్రధాన కారణం. వాటిని నివారించండి. నిత్యం ముఖం క్లీన్ చేయండి. మేకప్ లేకపోయినా రోజు రెండుసార్లు ముఖాన్ని సాఫ్ట్ క్లీన్సర్‌తో శుభ్రం చేయాలి. రాత్రిపూట ఆల్మాండ్ ఆయిల్ లేదా ఆలివ్ ఆయిల్ రాసి మృదువుగా మసాజ్ చేస్తే చర్మం నిగారింపు పొందుతుంది. పసుపు, పెరుగు ప్యాక్ చర్మం పైన గ్లో రావడానికి వాడాలి. దీనిని వారంలో 2సార్లు అప్లై చేయండి.




## నేడు వరంగల్‌లో జిల్లా మహాసభ

### సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

**ప్రజాపక్షం/ వరంగల్ :** జూలై 30 ,31వ తేదీలలో సిపిఐ వరంగల్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ధర్మారం గ్రామంలో గీసుగొండ మండల మహాసభకు ఎండి పాషా, భారతిలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా ముఖ్య అతిధిగా హాజరైన మేకల రవి మాట్లాడుతూ సిపిఐ నిత్యం పేద మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఒత్తిడి తెచ్చే విధంగా ప్రజలందరిని ఐక్యం చేస్తున్నాం అని అన్నారు. ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్కె భాష్మియ, పనాస ప్రసాద్‌లు మాట్లాడగా జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నార్పు రమేష్, దండు లక్ష్మ ణ్, గుండె బద్రి చంద్రకళ, వీరగోని శంకరయ్య జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు, ఎండీ అక్బర్ రత్నాకర్ రెడ్డి లు పాల్గొన్నారు.

## మెటీరియల్ ఇవ్వకుండా ఇండ్ల నిర్మాణం ఎలా?

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక, మొరం పర్మిషన్లు ఇవ్వక త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఒత్తిడి చేయడం సరైనది కాదని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. మంగళవారం జిల్లా ఎఐటియుసి కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఇసుక, మొరం లేక పనులు ఆగిపోతున్నాయని, ప్రతిరోజు ఇసుక మొరంకు పర్మిషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెటీరియల్ లేక భవన నిర్మాణ కార్మికులకు సైతం పనులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పం దించి ఇంటి నిర్మాణం కోసం మెటీరియల్ ప్రభుత్వ నిబంధనల మేరకు ,సలాఖసిమెం ట్ ధరలు నియంత్రణలో ఉండేలా చొరవ చూపాలన్నారు అధిక ధరలకు సిమెంట్‌సలా ఖ అమ్మే దుకానదారులపై చర్యలు తీసుకోవాలని, ఇసుక, మొరం, కాంక్రీట్, కంకరౌతు అమ్మే ట్రాక్టర్లు, టిప్పర్‌లు అధికారులు సీజ్ చేసి జరిమానాలు విధించడం జరుగుతుందని, అధికారులు అనుమతులు ఇచ్చినట్టైతే ధరలు నియంత్రణలో ఉండి, ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి అయ్యేవని అన్నారు. దీవిచే ఇంటి నిర్మాణ దారులు సైతం అధిక ధరల భారం నుండి బయట పడేవారని, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారు ఫైనాన్స్‌లు, అప్పులు చేసి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నారని, ట్రాక్టర్లు, టిప్పర్లను సీజ్ చేసిన వాటిని వెంటనే వదిలేసి వారికి ఉపాధి లభించేలా ప్రతిరోజు అనుమతులు ఇవ్వాలని, ధరలను నియంత్రించాలని, ఇంటి యజమానులపై భారం తగ్గించాలని, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక చాలా మంది ట్రాక్టర్లు, టిప్పర్లు కొనుక్కొని ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపర్చాలి

### కార్మిక చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలి : బాలరాజు




**ప్రజాపక్షం/నల్లగొండ:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు కార్మికులకు పిలుపునిచ్చారు. ఎఐటియుసి అనుబంధ సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ నల్లగొండ జిల్లా సమావేశం మంగళవారం జిల్లా కార్యాలయంలో బి.మహేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి బాలరాజు ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ సంస్కరణల పేరుతో కార్మిక చట్టాలను కుదించి, కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు చెప్పిన ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్యల వారధిగా ఉంటూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యవసర వస్తువులను సరఫరా చేస్తున్న కార్మికులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని వారు అన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా కూలి రేట్లు లేవనీ, హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం ఇవ్వాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి సీనియర్ నాయకులు ఉజ్జినీ రత్నాకర్ రావు మాట్లాడుతూ దేశంలోని హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం లేకపోవడం వల్ల రక్షణ కరువై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. హమాలిలకు ప్రమాద బీమా 10 లక్షల కల్పించాలని, నూతన గోదాంలను నిర్మించాలని ఆయన కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ప్రజలకు బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులు కూడా సివిల్ సప్లై ద్వారా అందివ్వాలని కోరారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా మార్చి వేస్తూ పెట్టుబడిదాలకు అనుకూలంగా చేస్తున్నారని ఆరోపించారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని హక్కుల సాధన కోసం హమాలి కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ వెంకన్న, ఉపాధ్యక్షులు బి మహేష్,నాగరాజు, అశోక్, కృష్ణయ్య, రఘు, శ్రీనివాసులు, రవి, శ్రీశైలం, రమేష్, శివ, ధర్మతేజ, లింగం, నాగార్జున, లింగస్వామి, గోపి, బాలస్వామి, కే శ్రీను,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి


### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధానకార్యదర్శి పశ్య పద్మ డిమాండ్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణ పేటమక్తల్ కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధానకార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నారాయణపేట మండలం పేరపల్లి గ్రామంలో భూ నిర్వాసిత రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భూ నిర్వాసిత రైతులను కలిసిన పశ్య పద్మ దీనికి సంబంధించి వివరాలను తెలుసుకున్నారు. నారాయణపేటమక్తల్‌కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం భూసేకరణ చేస్తున్న ప్రభుత్వ అధికార యంత్రాంగం, రైతులను బలవంతంగా ప్రలోభాలకు గురిచేస్తూ మాయ మాటలు చెప్పి భూసేకరణ చేయడం తగదన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా ప్రగతి బాట పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ బహిరంగ సభలో ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను పశ్య పద్మ గుర్తుచేశారు. ఇచ్చిన నిలబెట్టుకోవాలన్నారు. భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ ప్రాజెక్టు కోసం భూములు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమే అయినప్పటికీ సరైన పరిహారం అందడం లేదని వాపోయారు. భూములను సేకరించేందుకు రెవెన్యూ అధికారులు గ్రామాల్లో చేసిన సర్వే తప్పులతడకగా ఉందని ఆరోపించారు. భూవిస్తీర్ణ వివరాలు సరిగ్గా సేకరించడం లేదని, ఎకరాకు రూ.14 లక్షల నష్టపరిహారం కేటాయించడం ఎంతవరకు సమంజనం అని ప్రశ్నించారు. బహిరంగ మార్కెట్లో ఎకరాకు రూ.40 లక్షల విలువ ఉన్నదన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని తాము కోల్పోతే జీవనాధారం అత్యంత కష్టతరమవుతుందని రైతులు రైతు సంఘం నేత పశ్మ పద్మ ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పశ్యపద్మ మాట్లాడుతూ నారాయణపేటమక్తల్‌కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం భూమిని కోల్పోతున్న రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెడికల్ కాలేజీ, ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ బహిరంగ సభలో స్వయంగా హామీ ఇచ్చారని, ఎకరాకు 20 లక్షల రూపాయలైనా సరే రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తామని, అభివృద్ధికి అడ్డుపడకండి అని, ఎవరి మాటలూ నమ్మొద్దని, భూసేకరణకు సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, రైతులకు న్యాయం చేస్తామని మీరు ఇచ్చిన అభయం ప్రకారమే ఎకరాకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని పశ్యపద్మ సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తరతరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో వారి సొంత ఖర్చులతో పండ్లతోటలు, చెట్లు, రోడ్లు, బావులు, బోర్లు, పశువుల పాకలు వేసుకున్నారని వాటికి కూడా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. భూనిర్వాసిత రైతులు చేస్తున్న పోరాటానికి తెలంగాణ రైతు సంఘం అండగా ఉంటుందని రైతు సంఘం నేత పశ్యపద్మ హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి సమగ్రమైన విషయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యను పరిష్కారించడానికి చొరవ తీసుకుంటానని రైతులకు ఆమె అభయం ఇచ్చారు. రైతులకు న్యాయమైన పరిహారం అందే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ముఖ్యమంత్రి నారాయణపేట జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈ ప్రాంత రైతాంగానికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని విధాలుగా వెనుకబాటుకు గురైన నారాయణపేట జిల్లాకు ప్రాజెక్టు తప్పనిసరి అవసరమన్నారు. ఈ ప్రాంతానికి నీళ్లు అవసరమని, అదే సమయంలో భూనిర్వాసితులకు కూడా సరైన న్యాయం చేయాలని కోరారు. గత 14 రోజులుగా భూ నిర్వాసిత రైతులు న్యాయమైన పరిహారం కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వ అధికారులు, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నారాయణపేట జిల్లా నాయకులు దాసరి చెన్నయ్య, నాగరాజు, సంతోష్, వెంకటేష్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా కెఎల్ఐ ఉపకాల్వల పనులు

### ప్రజలపక్షాన పోరాడే ఏకైక పార్టీ సిపిఐ : ఎం.బాల్‌నర్సింహ్మా




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్/కల్వకుర్తి :** ప్రజలపక్షాన పోరాడే ఏకైక పార్టీ సిపిఐ అని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ సిపిఐ అ వతరించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలో ఆగస్టు 1,2 తేదీలలో సిపిఐ జిల్లా తృతీయ మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుకు మొదటగా సిపిఐ ఆధ్వర్యంలోనే ఉమ్మడి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంతో పాటు పాదయాత్ర చేసిన ఏకైక పార్టీ సిపిఐ అని ఆయన గుర్తు చేశారు. కెఎల్ఐ ప్రాజెక్టులో కల్వకుర్తి పేరు ఉంది కాని సాగునీరు పూర్తిస్థాయిలో రావడం లేదన్నారు. మొదట ప్రాజెక్టు ప్రారంభంలో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రాజెక్టు అంచనాలో లేని మండలాలను కలుపుతూ కల్వకుర్తికి అన్యాయం జరుగుతుందని ఆయన విమర్శించారు. ప్రస్తుత మున్న కాల్వల మోటార్ల సహాయంతో రెండున్నర లక్షలకు మాత్రమే సాగునీరు అందించే అవకాశమున్న 4లక్షల ఎకరాలకు సాగును అందిస్తామని రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే కాల్వల విస్తీర్ణం పెంచి, కాల్వ వల్ల భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఉపకాల్వలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, కేశవులు గౌడ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సిహెచ్ శ్రీనివాసులు, సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ కార్యదర్శి పరుషరాములు, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివకృష్ణ, కల్వకుర్తిని యోజకవర్గ సహాయ కార్యదర్శి దారదాసు, కల్వకుర్తి ని యోజకవర్గ నాయకులు శంకరయ్య ఉన్నారు. కాగా కల్వకుర్తి పట్టణంలో ఆగస్టు 1,2తేదీలలో నిర్వహించే సిపిఐ జిల్లా తృతీయ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర సభ్యులు ఎం. బాల్‌నర్సింహ్మా కోరారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడవెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నలు హాజరవుతారని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా తృతీయ మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయ న పిలుపునిచ్చారు.



# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఘనంగా సినారె జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/జడ్చర్ల:** తెలుగు శాఖ ఆధ్వర్యంలో డా.బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఏ), జడ్చర్లలో జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత డా.సినారె జయంతి సభ ఘనంగా నిర్వహించారు. కవి సింగిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటానికి పూల మాలాంకరణ అనంతరం జరిగిన జయంతి సభకు తెలుగు శాఖాధ్యక్షులు డా.సి.నర్సింహులు అధ్యక్షత వహించి తెలుగులో జ్ఞానపీఠ అవార్డు పొందిన రెండవ కవి సినారె అని కొనియాడారు. ముఖ్య అతిథి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య మాట్లాడుతూ తెలుగు ఆధునిక కవిత్వంలో కర్పూర వసంతరాయలు, నాగార్జున సాగరం మొదలైన గేయ కావ్యాలతో డా.సినారె తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. విశిష్ట అతిథి డా.కళ్యాణి నరసింహారావు పరులకు పాటుపడడం మించిన ప్రయోజనం మానవ జీవితానికి లేదనే విషయం గజల్‌లో సినారె. పలికించారన్నారు. అధ్యాపకులు డా.బి.వెంకటయ్య, సినిమా గీతాలలో సినారె జీవితానికి సమాజానికి సంబంధించిన విషయాలు అద్భుతమైన పాటలుగా మలిచారన్నారు. డా.పుష్పలత తెలుగు పరిశోధకులకు సినారె. పరిశోధక గ్రంథం దిక్సూచిగా ఉందన్నారు. వెంకట్‌రెడ్డి, వందన సమర్పణ చేశారు. అధ్యాపకులు డా.నియాజుద్దీన్, జ్యోతి నిర్మల, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## సిపిఐ మహాసభల వాల్‌పోస్టర్లు విడుదల

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐపార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా 3వ మహాసభలు ఆగస్టు 1,2తేదిలలో జరిగే మహాసభల వాల్‌పోస్టర్లను సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య చేతుల మీదుగా విడుదల చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రంలోని ప్రైవేట్ హాలులో సిపిఐ మహాసభల వాల్‌పోస్టర్ల విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ దేశంలో వంద సంవత్సరాలుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. 1925 డిసెంబర్ 26న ఏర్పడిన సిపిఐపార్టీ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని వందలాది మంది నాయకులు దేశం కోసం అమరులైన చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు కనువిప్పు కలిగేల బహిరంగసభ ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా నలుమూలనుండి ప్రజలు ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు కొమ్ముభరత్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శివశంకర్, సిపిఐ తాడూరు మండల సహాయ కార్యదర్శి వెంకటస్వామి, తాడూరు గ్రామశాఖ సహాయ కార్యదర్శి గొర్ల సత్యం, ఠాగూర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఇద్దరు బైండోవర్



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఆర్టీసీ బస్సులో అక్రమంగా నాటు సారా తరలిస్తున్న మహిళలను ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని తహసీల్దార్ వరలక్ష్మి ఎదుట బైండోవర్ చేశారు. మండల పరిధిలోని నాగర్లబండ తండాకు చెందిన మూడవత్ సోని, రాత్లావత్ లక్ష్మి, రాత్లావత్ రూప్లీ ఈ నెల 21న సంపత్ రావు పల్లి నుంచి కొల్లాపూర్ వెళ్లే ఆర్టీసీ బస్సులో క్రమంగా నాటు సారా తరలిస్తుండగా సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్ఐ పృథ్వీరాజ్ తన సిబ్బందితో కలిసి సంపత్ రావు పల్లి సమీపంలో ఆర్టీసీ బస్సులో వారి నుంచి నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్లావత్ రూప్లీ, మూడవత్ సోనిలను ఎక్సైజ్ కానిస్టేబుల్ తిరుమల్లేష్ , తహసీల్దార్ వరలక్ష్మి ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని తహసీల్దార్ వరలక్ష్మి హెచ్చరించి వదిలివేశారు.

## పాఠశాలలో పరిశుభ్రత పాటించాలి



**ప్రజాపక్షం/వెల్దండ :** పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ చంద్రుడు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని కస్తూర్భాగాంధీ పాఠశాల పరిధిలోని చౌదర్‌పల్లి, రాఘాయిపల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా కస్తూర్భాగాంధీ పాఠశాలలో వంటగదిలో సామాగ్రి, విద్యార్థులకు మెనూప్రకారం బోజనంపెట్టాలని , విద్యార్థులయొక్క ప్రగతిని పరిశీలించి విద్యార్థుల శక్తిసామర్థ్యాలను పెంచేవిధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు.

**దివ్యాంగుల భవిత సెంటర్ నిర్మాణం కోసం స్థలపరిశీలన :**

మండలకేంద్రంలో దివ్యాంగుల(భవిత) సౌకార్యర్థం మంజూరైన నూతన భవననిర్మాణంకోసం ఎంఈఓ చంద్రుడునాయక్ స్థలపరిశీలన చేశారు. ఈసెంటర్ వినియోగంలోకి వస్తే దివ్యాంగులకోసం చేపట్టే పలు రకాలసేవలు వినియోగంలోకి వస్తాయని అన్నారు. భవితసెంటర్ నిర్మాణంకోసం రూ.9.5లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌నాయక్, సిఆర్‌పి తిరుపతి, భవననిర్మాణ కాంట్రాక్టర్ దేవిలాల్‌నాయక్ ఉన్నారు.

## అంటువ్యాధుల నివారణపై ప్రత్యేక శ్రద్ధ



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** పాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కెవి.స్వరాజ్యలక్ష్మి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంటువ్యాధుల నివారణపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని పర్యవేక్షణ సిబ్బందికి పలు సూచనలుచేశారు. ప్రతిరోజు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగుల వివరాలను, ఈసీజన్‌లో ఏసమస్యలతో వస్తున్నారని అడిగారు. అనంతరం హాజరుపట్టికను, గర్భవతుల పరీక్షల, మందులనిల్వ, ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షలరికార్డులను తనిఖీచేశారు. గ్రామాలలో క్షేత్రస్థాయి సిబ్బందితోకలిసి పాఠశాలల్లో, స్వయంసహాయక బృందాల సమావేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పంచాయతీసెక్రటరీ సహకారంతో దోమల పెరుగుదలను అరికట్టాలని, గ్రామాలలో నీరు నిల్వ ఉండకుండా చేయాలని, అవసరమైనచోట ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. దోమలు పెరగకుండా ప్రతి శుక్రవారం డ్రైడే(పొడిదినం) నిర్వహించాలని, గ్రామాలలో ఇతరశాఖల సహకారం తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా టీకాకరణ అధికారి డాక్టర్ రవికుమార్, వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, డిపిఓ రేణయ్య, ఎంపిహెచ్ఇఓ రాజేష్, హెడ్‌నర్సు ఎల్సిదయా, ఇతరవైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### మత్స్య శాఖ మంత్రి డాక్టర్.వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/నారాయణపేట్/నర్వ :** మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమని, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పథకాలన్నీ (గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, కళ్యాణ లక్ష్మి , షాదీముబాకర్) మహిళల పేర్లతోనే అమలు చేస్తున్నారని రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్, క్రీడలు యువజన సర్వీసులు , మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబాలు, ఊర్లు, జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి దోహదం అవుతాయన్నారు. ఉమ్మడి మక్తల్, నారాయణపేట 2009లో విడిపోయి రెండు నియోజకవర్గలుగా ఏర్పాటు అయ్యాయని, అయినా మక్తల్, నారాయణపేట వేరు కాదని, నారాయణ పేట, మక్తల్ తనకు రెండు కళ్ళు అని మంత్రి స్పష్టం చేశారు. మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రానికి మంత్రి హోదాలో తొలిసారిగా వచ్చిన ఆయన ఇక్కడి ఎస్.ఆర్(పోలేపల్లి ఫంక్షన్ హాల్) గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి నారాయణపేట మండలం, పట్టణానికి చెందిన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం మహిళల ప్రగతికి పెద్దపీట వేసిందని తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు అర్హులందరికీ వచ్చాయన్నారు. నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి డాక్టరై తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నిక అయిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి, తాను ముందు నుంచి ప్రజా జీవితంలోనే ఉన్నామని, మంగళవారం తాను, డాక్టర్.చిట్టెం పర్ణికా రెడ్డి ఇక్కడ మాట్లాడ టానికి కారణం ప్రజలే అన్నారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లా డుతూ ప్రతి మండలంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందని, కొత్త కార్డుల ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, అర్హులైన వారు మీ సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకుంటే కొత్త కార్డులు వస్తాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్.చిట్టెం పర్ణికారెడ్డి మాట్లాడుతూ పార్టీ అధికారంలో లేనప్పటి నుంచి తన నాన్న చిట్టెం వెంకటేశ్వర రెడ్డికి మంత్రి వాకిటి శ్రీహరితో మంచి సత్సంబంధాలు ఉండేవని తెలిపారు. వచ్చిన 3500 ఇండ్లలో ఒక్క నారా యణపేటకే 900 ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి,



ఆర్డీ రామచందర్ నాయక్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతు కుమార్, సివిల్ సప్లై అధికారి బాలరాజు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**నర్వలో మంత్రి సుడిగాలి పర్యటన**

మండలంలోని పాతర్చేడ్ నర్వ ఒక్కన్నపల్లి లంకల రాంపూర్ గేట్ పలు అభివృద్ధి పనులకు మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం శంకుస్థాపనలు చేశారు. నర్వ మండల కేంద్రం నుండి రాంపూర్ గేట్ వరకు 4 కోట్ల 55 లక్షల నిధులతో డబుల్ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పాతర్చేడ్‌లో అంగన్వాడీ బిల్డింగ్ సీసీ రోడ్లకు 28 లక్షలు జక్కన్నపల్లి నర్వ మధ్య బీటి రోడ్డు నిర్మాణానికి 2.90 కోట్లు శంకుస్థాపనలు చేశారు.

# కౌకుంట్ల మండలంలో కలెక్టర్ పర్యటన

### ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి లబ్ధిదారులకు తెలిపారు. కౌకుంట్ల మండలం తిరుమలాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామంలో 56 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజురు చేశారు. ఎన్ని చదరపు అడుగులలో నిర్మిస్తున్నారు. ఇంటి నిర్మాణంకు ఎంత ఖర్చు అవుతుందని అడిగారు. డబ్బులు విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని వివిధ దశలో పనులు పూర్తి చేసిన వెంటనే మీ అకౌంటులలో డబ్బులు జమ అవుతాయన్నారు. గ్రామంలో ఫీవర్ సర్వే చేస్తున్నారా అని అడిగారు. గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. గత సంవత్సరం ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సంవత్సరం ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? కలెక్టర్ అడిగారు. గత సంవత్సరం 39 మంది ఉన్నారని, ఈ సంవత్సరం 36 మంది ఉన్నారని పాఠశాల హెచ్‌ఎం తెలిపారు. గత సంవత్సరం కంటే ఎందుకు తగ్గారు కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై, బొధనపై విద్యా



ర్థుల తల్లిదండ్రులకు వివరించాలను కోరారు. రెండవ తరగతి విద్యా ర్థులను పఠనా సామర్థ్యాలు పరిశీలించారు. 5వ తరగతిలోకి వెళ్లి విద్యా ర్థులను బ్లాక్ బోర్డుపై ఇంగ్లీష్ పదాలు చదివించారు. 5వ తరగతిలో వాటర్ లీకేజి ఉందని తెలుపగా వెంటనే రిపేర్ చేయించాలని పంచాయతీ రాజ్ ఏఈకి తెలిపారు. తర్వాత అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పిల్లల ఎంత మంది అన్నారు. 20 మంది పిల్లలు, ఆరుగురు గర్భిణులు ఉన్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టిక ఆహారం అందించాలని, పిల్లల బరువు, ఎత్తు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

# కోస్గి ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ కళాశాలను మంగళవాం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల నిర్వహణ, అడ్మినిస్ట్రేషన్ గురించి ప్రిన్సిపల్ శ్రీనివాసులు, కళాశాల స్టాఫ్ ను అడిగి తెలుసుకున్నారు. ఆ కళావాల భవనంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ భవనంలో కళాశాలతో పాటు ఇంజనీరింగ్ కళాశాల తరగతులు కూడా కొనసాగుతుండడంతో తరగతి గదుల కొరత ఉందని, అలాగే పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీ లేదని ప్రిన్సిపల్ శ్రీనివాసులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అయితే ప్రస్తుతం ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం కొనసాగుతుండగా, మరి కొన్ని రోజులలో రెండో సంవత్సరం తరగతులు కూడా ప్రారంభం కానుండటంతో అదనంగా ఎన్ని గదులు అవసరం అవుతాయని, ల్యాబ్‌లు, కంప్యూటర్లు, బాలికల హాస్టల్, ఇతరత్ర సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ ప్రిన్సిపల్‌తో గంటపాటు చర్చించారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులతో పాటు ఖాళీగా ఉండే గదులను వినియోగించుకునే విషయమై కలెక్టర్ ప్రిన్సిపల్‌కు తగు సూచనలు చేశారు. తర్వాత కళా శాలలోని తరగతి గదులను, కంప్యూటర్ ల్యాబ్, ఆడిటోరియం, ఇతర గదు లను ఆమో పరిశీలించారు. అనంతరం పట్టణంలోని సర్వే నంబర్ 1737లో గల 10.08 ఎకరాలలో నిర్మించబోయే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల స్థలాన్ని, అలాగే సర్వే నంబర్, 1809, 1811,1812 గల 7 ఎకరాలలో నిర్మించే ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీధర్, పంచాయతీరాజ్ డిఈ విలోక్, ఆర్ అండ్ బి డీఈ రాములు పాల్గొన్నారు.

# నేర నియంత్రణకు సమర్థవంతంగా చర్యలు

### ఎస్పీ డి.జానకి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** జిల్లా ఎస్పీ డా.జానకి అధ్యక్షతన జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లాలో నేరాల పరిస్థితి, పెండింగు కేసుల పరిణామాలు, విచారణలో ఉన్న కేసుల పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సాంకేతిక ఆధారాలతో కూడిన ఆధునిక పద్ధతులను అమలు చేయాలని, పెండింగు కేసుల సంఖ్య తగ్గించేందుకు అధికారులు చొరవగా చర్యలు తీసుకోవాలని, యన్‌డిపిఎస్ చట్టాలపై స్పష్ట మైన అవగాహనతో కేసులను దర్యాప్తు చేసి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ యన్‌బి, రత్నం, డిఎస్పి వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి డిఎస్పి




రమణా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్ పెక్టర్ వెంకటేశ్, వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, రూరల్ సీఐ గాంధీ నాయక్, జడ్చర్ల టౌన్ ఇన్స్ పెక్టర్ కమలాకర్, జడ్చర్ల రూరల్ సిఐ నాగార్జున గౌడ్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ భగవంతురెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్‌లు రత్నం, పరమేశ్వర్ గౌడ్, అల్ ఎస్‌హెచ్‌ఓఎస్, పిఎస్‌ఐలు, ఐటి కోర్ టీం ఇంచార్జి రాఘవేందర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు సిసిటివి సౌకర్యం



**ప్రజాపక్షం/కృష్ణ:** కృష్ణ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముడుమాలలో చదువుల పండగ సందర్భంగా కీ.శే.కాద్రు వెంకప్ప మాజీ ఎంపీటీసీ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు దాత కాద్రు అశోక్ ఇచ్చిన హామీ మేరకు దాదాపు తొమ్మిది సిసిటివీ కెమెరాలతో పాఠశాల మొత్తం కవర్ అయ్యే విధంగా ఏర్పాటు చేసి మండల విద్యాధికారి నిజాముద్దీన్, పిఆర్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షులు దండు శేఖర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ సాదు జయమ్మ నేడు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా దాత కాద్రు అశోక్ మాట్లాడుతూ నేను చదువుకున్న పాఠశాలకు సహాయపడటం ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా మండల విద్యాధికారి నిజాముద్దిన్ పిఆర్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు వై.జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ సదుపాయం వల్ల పాఠశాల యొక్క భద్రత, 281 మంది విద్యార్థుల పర్యవేక్షణ పాఠశాల పర్యవేక్షణ సులభతరం కానుందని, బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలను తల్లిదండ్రుల మరియు దాతల సహకారంతో ప్రైవేటు బడులకు ధీటుగా తయారు చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్, ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిజెపి, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందం, మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆటపాటలతో అంగన్‌వాడీల్లో విద్యాబోధన

### జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిణి జరీనా బేగం



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలు, అను కరణతో విద్యా బోధన అందిస్తున్నామని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిణి జరీనా బేగం అన్నారు. జిల్లా కేంద్రంలోని అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట, పాటలు, కథ, సృజనా త్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం, సమయపాలన ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించే విధానంపై శిక్షణ అందజేశారు. ఆమె మాట్లాడుతూ అమ్మబడి తర్వాత మలిబడి అంగన్‌వాడీ కేంద్రాలు అని అన్నారు. సమా వేశంలో ఇఓ అరుణ, సీడీపిఓ రాధిక, పోషక అభియాన్ నరేందర్, సూపర్ వైజర్లు ప్రసన్న, నాగేశ్వరి, వలీమ్ సుల్తానా, జంగమ్మ, జయప్రద, అలీవేల తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సైకిల్ క్రీడలకు 8 మంది విద్యార్థినులు ఎంపిక

**ప్రజాపక్షం/మక్తల్:** ఈనెల 13న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ పోటీలలో ఊట్కూర్ సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు పాల్గొని, క్రీడా ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి కే లో ఇండియా ఉమెన్స్ సైకిలింగ్ పోటీలకు 31 మంది ఎంపికై, ఈనెల 20న హైదరాబాద్ బండ్ల గూడలో జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ సైకిలింగ్ పోటీలలో పాల్గొని, సబ్ జూనియర్ బాలికల ఐదు కిలోమీటర్ల రోడ్డు స్పీడ్ పోటీలలో హిమజ మూడోస్థానం, భావన నాలుగో స్థానం, అంబిక ఏడో స్థానం, అలాగే జూనియర్ బాలికల 10 కి.మీ పోటీలలో బి.స్వాతి ఆరవ స్థానం, కె.హేమలత ఏడోస్థానం, అలేఖ్య 11వస్థానం, సీనియర్ మహిళల 20 కిలోమీటర్ల సైకిల్ పోటీలో పాఠశాల పీఈటి లావణ్య మూడో స్థానం పిఈటి మంజుల 5వ స్థానం పొంది, ఖేలో ఇండియా స్కైక్లింగ్ కోచ్, కోఆర్డినేటర్ మ్యాక్స్వెల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మయాంక శ్రీవాస్తవ ద్వారా ప్రశంసపత్రాలు అందుకున్నారు. ఖేలో ఇండియా ఉమెన్స్ జాతీయస్థాయి సైకిల్ రోడ్డు స్పీడ్ పోటీలకు 8 మంది ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, జిల్లా సైక్లింగ్ ప్రధాన కార్యదర్శి, కోచ్ బి.గోపాలం సంయుక్త ప్రకటనలో తెలిపారు.



## ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలోని జెడ్పిహెచ్‌ఎస్ స్కూల్ ఆవరణలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫుడ్ ఫెస్టివల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మున్సిపాల్టీ పారిశుద్ధ్య కార్మికులకు, శానిటేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని కార్మికులకు శానిటేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని విద్యాహబ్‌గా మారుస్తా




### ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గతప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యంచేస్తే కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు అన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో పిఎంశ్రీ పథకంలో ఉత్తమ పాఠశాలల ఎన్నికకాబడిన సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తనకు ఘనస్వాగతం పలికే సందర్భంచూస్తే తనతన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని వారిని అభినందించారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకొని ముందుకుసాగాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటిచైర్మన్ రమణరావు, జిల్లావిద్యాశాఖ అధికారి రమేష్‌బాబు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణతోపాటు మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, మాజీకౌన్సిలర్స్ పాల్గొన్నారు.

## వర్షానికి కూలిన ఇల్లు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** మండల కేంద్రానికి చేందిన సత్యనారాయణ గౌడ్ తండ్రి గొవర్ధన్ గౌడ్ ఇల్లు వారం రోజులుగా కురిసిన వర్షాలకు కూలిపోయింది. ఆయన గత ఏడేళ్ళుగా హైదారాబాద్‌కు వెళ్ళి జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం తన సోంత గ్రామానికి వచ్చి తాళం వేసిన ఇంటిని తెరిచి చూడగా లోపలి లోపలి భాగం కూలిపోయింది. ఈ విషయమై గ్రామానికి చెందిన పంచాయతి కార్యదర్శికి సమాచారం అందించినట్లు భాదితుడు మిడియకు తెలియజేశారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ జయరాములును వివరణ కొరగా ఇల్లు కూలిన ప్రదేశానికి మా సిబ్బందిని పంపి స్థానిని పంచానామ నిర్వహించి ఇందిరమ్మ ఇల్లు మంజురుకు పై అధికారులకు నివేదిక సమర్పిస్థామని తెలిపారు.

## పురుగుల నివారణకు ఎరువులు



**ప్రజాపక్షం/అమరచింత :** మొక్కజొన్న పంటలను నాశనం చేసే కత్తెర సుడిపురుగుల నివారణకు రైతులు తప్పకుండా ఎరువులను వాడాలని మండల వ్యవసాయ అధికారి అరవింద్ కోరారు. మంగళవారం అమరచింత మండల పరిధిలోని నాగల్ కడుమూరులో రైతులు పండిస్తున్న వరి, మొక్కజొన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో అరవింద్ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో అరవింద్ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర, సుడి పురుగులు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. కత్తెర, సుడి పురుగులు మొక్కజొన్న పంటలను ఆశించినప్పుడు ఆకులను తింటూ, గుండ్రటి రంద్రాలు ఏర్పరుస్తున్నావని రైతులకు సూచించారు. మొక్కల్లోని రంధ్రాన్ని చేసుకొని లోపల ఉండే కాండాన్ని తింటావని తెలిపారు. పిచికారి కోసం వ్యవసాయ అధికారులు సూచించిన ఎరువులను వినియోగించుకోవాలని రైతులకు ఆయన సూచించారు. ఏఈఓ నంది కిషోర్ రెడ్డి, రైతులు కురువ రమేష్, రామకృష్ణ, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## వెట్టి నుండి కార్మికులకు విముక్తి



**ప్రజాపక్షం/దేవరకొండ:** మంగళవారం నేరడుగొమ్ము మండలంలోని వైజాగ్ కాలనీ, పిఏపల్లి మండలంలోని పెద్దగుమ్మడం గ్రామాలలో 29 మంది బానిస కార్మికులను గుర్తించి వారికి బానిస కార్మికుల చట్టం 1976 ప్రకారం దేవరకొండ రాజస్వ మండలాధికారి రమణారెడ్డి మొత్తం 29 మంది బానిస కార్మికులను వారి స్వగ్రామాలకు సురక్షితంగా తిరిగి పంపారు. కార్మికుల రక్షణలో భాగంగా రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బందిని ఎస్కార్ట్‌గా కేటాయించారు. వారి సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలకు అనుగుణంగా, కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని ఆర్డీవో అన్నారు. బాండెడ్ లేబర్ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు చొరవ చూపాలని పిలుపునిచ్చారు.

## సూర్యాపేట డిపో నుండి పుణ్యక్షేత్రాలకు బస్సు సౌకర్యం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సూర్యాపేట డిపో నుండి పుణ్యక్షేత్రాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ జి.లక్ష్మి నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట నుండి విశాఖపట్నం యాత్రలో సూపర్ లగ్జర్ 36 సీట్ల బస్సు సౌకర్యం కలదు. ఆగస్టు 1వ తేదీన రాత్రి 11 గంటలకు సూర్యాపేట నుండి విజయవాడ కనకదుర్గమ్మ గుడి, మంగళగిరి పానకాల లక్ష్మి నర్సింహ స్వామి దేవాలయం, ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి దేవాలయం, సామర్లకోట కుమారస్వామి, పిఠాపురం12వ శక్తిపీఠం, సింహచల అప్పన్న పేట స్వామి టెంపుల్, అవసవల్లి సూర్యదేవాలయం, శ్రీకూర్మం మహా విష్ణు... కుర్మావతారం, వైజాగ్ సిటి, అన్నవరం సత్యనారాయణస్వామి వ్రతం చేసుకునే అవకాశం కలదు. స్వామి దర్శనం చేసుకుని 4వ తేదీ రాత్రి 8 గంటలకు సూర్యాపేటకు వచ్చే విధంగా ప్రత్యేక యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు పెద్దలకు 3400, పిల్లలకు 1800 లుగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. టికెట్ బుకింగ్ ఇన్‌ఛార్జి డి.రవికుమార్ 99483 03712, ఏకాంబరం 99516 13278, 73828 36177, అసిస్టెంట్ మేనేజర్ 7989225791 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## కూనంనేనికి ఉద్యమకారుల ఫోరం వినతి



**ప్రజాపక్షం/వలిగొండ :** సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ పక్ష నేత ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావుకు ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయించి ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేర్చి దిశగా ప్రయత్నం చేయాలని ఆయను ఈ సందర్భంగా కోరారు. అనంతరం ఉద్యమకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని గత అసెంబ్లీలో ప్రస్తావించినందుకు ఆయనకు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి, ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, ఉద్యమ కళాకారుల జిల్లా అధ్యక్షుడు మల్లం వెంకటేశం గౌడ్, బత్తినీ రవీందర్ గౌడ్, ఐటి పాముల పుష్ప, ఎక్కల దేవి శ్రీనివాస్, కదిరేని స్వామి, కన్నెకంటి శ్రీనివాసచారి, కొండూరు శ్రీరాములు, దండ మల్లికార్జున్, బొడిగె సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిముందు శుభ్రతే లక్ష్యం




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రతి పౌరుడు తన ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో ముందుండాలని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక 1వ వార్డులో 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రజలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రభుత్వం పట్టణాలను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు ముందుకొస్తే ప్రజలు కూడా సమానంగా స్పందించి సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీలో తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాని కోరారు. మురుగుకాలువల నియమిత నిర్వహణ, దోమల నివారణ చర్యలపై ప్రత్యేకంగా వివరించారు. ప్రజలతో సిబ్బంది నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వేముల కొండ పద్మ, మున్సిపల్ డిఈ సత్యారావు,సానిటరి ఇన్స్‌పెక్టర్ సారుగండ్ల శ్రీనివాస్, ఎఇ తిరుమల్లయ్య, ఆర్ఐలు గౌసుద్దీన్, అజీముద్దీన్, వార్డు అధికారి నరేష్, టిఎంసి శ్వేత, శివప్రసాద్, హెల్త్ వర్కర్లు, కాలని మహిళలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా పదోన్నతులు చేపట్టాలి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఉపాధ్యాయుల పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ధారావత్ మోతిలాల్ నాయక్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పలు ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ గిరిజన ఉపాధ్యాయసంఘం ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని తెలిపారు. త్వరలో జరగబోయే ఉపాధ్యాయ పదోన్నతులను ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దారావత్ వస్త్రంనాయక్, కుర్ర బగ్గులాల్‌నాయక్, లింగనాయక్, రమేష్, భద్రు నాయక్ పాల్గొన్నారు.

## ఇంటర్ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** పీఏ పల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఇంటర్ కళాశాల నందు స్పాట్ అడ్మిషన్లకు ఆసక్తి గల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారిని టి.ఉమాదేవి తెలిపారు.2025/2026 విద్యా సంవత్సరంలో ఇంటర్ కళాశాలగా అప్ గ్రేడ్ కావడం జరిగిందని తెలిపారు.ఈ సంవత్సరం సీఈసీలో 40 సీట్లు ఎంపీహెచ్డబ్ల్యు కోర్స్ కు 40 సీట్లు చొప్పున మంజూరైనట్లు తెలిపారు.సీసీ కి 40 సీట్లకు గాను 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని అదేవిధంగా ఎం పి హెచ్ డబ్ల్యు కోర్సులో 40 సీట్లకు గాను 20 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.పదవ తరగతి ఉత్తీర్ణులైన గ్రామీణ ప్రాంత బాలికలు స్పాట్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. పూర్తి వివరాలకు కేజీబీ ఇంటర్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

## నేడు నూతన్‌కల్‌లో ఎమ్మెల్యే పర్యటన

**ప్రజాపక్షం/నూతన్‌కల్:** మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో నేడు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటలకు మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో నూతన రేషన్‌కార్డుల పంపిణీ, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉత్తర్వులు పంపిణీ, మండల పరిధిలోని ఎర్రపహడ్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించు ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన, దిర్శనపల్లి గ్రామంలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో నిర్మించు నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

# సన్నబియ్యం పంపిణీ చరిత్రలో నిలుస్తుంది

### హుజూర్‌నగర్‌లో నూతన రేషన్ కార్డుల పంపిణీ హుజూర్‌నగర్ గడ్డ కాంగ్రెస్ అడ్డా

### భారీ నీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నిరుపేదల సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభ్వుత్వం ధ్యేయమని రాష్ట్ర భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖా మాత్యులు నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని కౌండిన్య గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యావత్ తెలంగాణ చరిత్రలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం గేమ్‌చేంజర్‌గా నిలిచిపోతుందని, గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 10,600కోట్లు కర్చు పెట్టి 89.95 లక్షల కార్డుదారులకు రూ.2.80 కోట్లతో దొడ్డు భియ్యం పంపిణీ చేస్తే ప్రజా ధనం దుర్వినియోగం అవుతుందని పేదవారి కడుపు నింపే విధంగా ప్రజా ప్రభు త్వం రూ. 13 వేల కోట్లతో 97.90 లక్షల కార్డులదారులకు సన్నభియం అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. 18 సంవత్సరాల తర్వాత జూలై మాసంలో నాగార్జున సాగర్ ఎడమకాల్వ నుండి నీటిని విడుదల చేయడం చాలా సంతోషానిచ్చిందన్నారు. నెహ్రు శంకుస్థాపన చేసిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌ను ఇందిరమ్మ ప్రారంభించిన ప్రాజెక్ట్ నేటికి చెక్కు చెదరకపోవడం కాంగ్రెస్ సుపరిపాలనకు నిదర్శనమని కొనియాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని దొండపాడులో రూ. 396 కోట్లతో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా రాజీవ్‌గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్,దొండపాడు 2కి క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. హుజూర్‌నగర్ గడ్డ ఎల్లప్పుడూ కాంగ్రెస్ గడ్డగానే నిలుస్తుందని గత పార్లమెంట్ ఎన్నికల్లో యావత్ భారతదేశంలోనే హుజూర్‌నగర్ నగర్ అసెంబ్లీలో వచ్చిన మెజార్టీ రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని,వారి కృషితోనే తెలంగాణలో కాంగ్రెస్ అత్యధిక మెజార్టీతో అధికారంలోకి రావడం జరిగిందన్నారు. కార్యకర్తలకు కాంగ్రెస్ ఎల్లవేళలా వెన్నుదన్నుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 ఏళ్ళు పరిపాలించి ఏఒక్కరికీ రేషన్‌కార్డులు,ఇళ్ళు ఇవ్వలేదని ప్రజా ప్రభుత్వం ఆవిర్భవించిన తర్వాతనే అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్ సౌకర్యం లాంటి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వానికి ప్రజాల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌సి శంకర్ నాయక్,సివిల్‌సప్లయ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ డి.ఎస్ చౌహాన్,ఎస్పీ కె. నరసింహా,కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డిఓ శ్రీనివాసులు,డీఎస్ఓ మోహన్‌బాబు, తహశీల్దార్లు మందడి నాగార్జున్‌రెడ్డి,సురిగి సైదులు, మంగ,కవిత, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 84శాతం మందికి సన్నబియ్యం : మంత్రి ఉత్తమ్

**ప్రజాపక్షం/చిట్యాల:** రాష్ట్రంలోని 84 శాతం మందికి రేషన్‌కార్డుల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, ఇది దేశంలోనే చారిత్రాత్మక, విప్లవాత్మకమైన చర్య అని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండల కేంద్రంలో నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సన్నబియ్యంపై 10వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో కూడా సన్నబియ్యం పంపిణీ జరగడం లేదన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో 62వేల700మందికి కొత్త కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రేషన్ కార్డుల పంపిణి నిరంతర ప్రక్రియ అని, రేషన్ కార్డులు రానివారు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అయిటిపాముల ఎత్తిపోతల పథకం కింద పెండింగ్‌లో ఉన్న భూసేకరణ బిల్లులను మంజూరు చేయాలని, అలాగే బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు కింద ఉన్న భూసేకరణ నిధులను విడుదల చేయించాలని మంత్రులకు కోరారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి శంకర్‌నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి డిఎస్ చౌహాన్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్‌డివో వై అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గంజాయి కేసులో పట్టుపడ్డ ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సుమారు 30 వేల విలువ గల 1.21 కేజీల గంజాయి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని వన్టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం వన్ టౌన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితులు తల్లమల్ల శివ శంకర్, భక్తుల శబరి గిరీష్ లు రాజస్థాన్లోని వివేకనంద గ్లోబల్ యూనివర్సిటీ లో అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేశారు అదే సమయంలో ఇద్దరు గంజాయికి అలవాటుపడి. నిందితుడు తల్లమల్ల శివ శంకర్ యాస భాను ప్రకాశ్ రెడ్డి లు ఇంటర్మీడియట్ నుండి స్నేహితులు.నిందితుడు శివశంకర్ తనకి గంజాయి అవసరం ఉన్నప్పుడల్లా అతని స్నేహితులైన శబరి గిరీష్ భాను ప్రకాష్ నుండి తీసుకొని వాడుకునేవాడని తెలిపారు. హైదరాబాద్ లోని ఫహత్ నగర్ నుండి గంజాయి తెచ్చుకునేవాడని గత సంవత్సరం 2024 లో మార్కెట్ పోలీస్టేషన్ వారు చేసిన పట్టుబడి చేసే గంజాయి కేసులో జైలుకు పంపారని అయినా కూడా అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని నల్లగొండ పట్టణంలో గంజాయి అలవాటు ఉన్నవారు చాలామంది ఉన్నారు అని వారికి గంజాయిని అమ్మి ఎక్కువ మొత్తంలో సొమ్ము చేసుకోవచ్చని దురుద్దేశంతో, వారం రోజుల క్రితం ముగ్గురు నిందితులు కలిసి పాత్‌నగర్ లోని ఒక మహిళ వయసు సుమారు 50 నుండి 20 సంవత్సరాలు నుండి 1.5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి నల్లగొండకు తీసుకొని వచ్చారని తెలిపారు. అందులో కొంత భాగాన్ని చిన్న చిన్న పాకెట్లుగా చేసి అవసరం ఉన్న కొంతమంది వ్యక్తులకు పాకెట్ ఎనిమిది వందల రూపాయలు చొప్పున అమ్మి మిగిలి ఉన్న గంజాయిని ముగ్గురు వ్యక్తులు సమంగా పంచుకొని నల్లగొండ పట్టణంలో అమ్మడానికి వెళ్లామని చూస్తుండగా పోలీసు వారు నమ్మదగిన సమాచారం మేరకు వారిని పట్టుబడి చేసినారు. వారి వద్దనుండి 1.21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు శివ శంకర్,శబరి గిరీష్ ల నుండి వారు ఉపయోగించిన రెండు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు

### అదనపు కలెక్టర్ పి.రాంబాబు



**ప్రజాపక్షం/కోదాడ:** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు పంపిణీ జరుగుతుందని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఆర్ఎస్‌వి ఫంక్షన్ హాల్‌లో నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పేదలను వారి కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో సన్నబియ్యం, నూతన రేషన్‌కార్డులను అందజేస్తున్నామని తెలిపారు. అందరూ జాగ్రత్తగా రేషన్‌కార్డును భద్రపర్చుకోవాలని, ప్రతి సంక్షేమ పథకాలను ఇది ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, తహసిల్దార్ వాజిద్‌అలీ, మండల పార్టీ అధ్యక్షులు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇర్ల సీతారాంరెడ్డి, మల్లెల రాణి, పిఏసిఎస్ చైర్మన్లు కొత్త రఘుపతి, శ్రీనివాసరావు, మందలపు శేషు, పాలకి సురేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** హాస్టల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హాస్టల్ విద్యార్థులు మంగళవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని డీవీకే రోడ్ లో గ ల శాంతినగర్ ఎస్‌సి హాస్టల్లో సరైన సదుపాయాలు లేక 80 మంది విద్యార్థులకు ఒకే బాత్రూం ఉందని అన్నం కూడా సరిగా పెట్టలేని దుస్థితి ఏర్పడిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 20 రూపాయల పెరుగు 80 మంది విద్యార్థులకు ఎలా సరిపోతుందని ఒకసంవత్సరం నుంచి ఇదే తంతు అని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ ని వేరే బిల్డింగ్‌కి మారుస్తాం అంటున్నారే తప్ప ఏ ఒక్క అధికారి వచ్చి మా సమస్యలు పరిష్కరించడం లేదని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే మా సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

## నేడు రేషన్ కార్డులు పంపిణీ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 1 గంటలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులు, ఎన్‌ఎఫ్‌బిఎస్ (ఇరవై వేలు) పంపిణి చేయడం జరుగుతుందని మండల తహశీల్దార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# దళితులపై అక్రమ కేసులను నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని గణపవరం గ్రామంలో చెరువుశిఖం భూమి విషయమై గత సంవత్సర కాలంగా గ్రామానికి చెందిన దళిత కుటుంబాలపై అక్రమంగా కేసులు నమోదు చేస్తూ తమని ఇబ్బందులకు గురిచేస్తున్న మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌పై చట్టరిత్యా తక్షణమే చర్యలు తీసుకుని ఆయనను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం ముందు పలువురు గణపవరం గ్రామానికి చెందిన దళితులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ రామకృష్ణారెడ్డికి గణపవరం గ్రామంలోని చెరువు భూమిలో భూమి యాజమాన్య హక్కు కల్పించి నిరుపేదలైన దళితులకు సేద్యం చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు దళితులు మాట్లాడుతూ భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలకు చెందిన తాము గణపవరం చెరువు శిఖం భూమిలో ఎన్నో ఏళ్లుగా సేద్యం చేసుకుని బ్రతుకుతుండగా అదే గ్రామానికి చెందిన గోపిరెడ్డి నాగిరెడ్డి అనే భూస్వామి తమపై దౌర్జన్యంగా గత సంవత్సర కాలంగా తప్పుడు కేసులు పెడుతూ తమ తాతల తండ్రుల నుండి భూమిని నమ్ముకుని బతుకుతున్న తమకు కావాలని పలు రకాలుగా ఇబ్బందులు పెడుతూ డబ్బులు వెదజల్లి అక్రమ కేసులు తమపై బనాయించి స్టేషన్ చుట్టు తిప్పుతున్నారని బాధిత దళిత కుటుంబాలు సూరేపల్లి రాములు, గోపి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవిన్యూ, పోలీస్ అధికారులు దళితులుగా మాకు జరుగుతున్న అన్యాయంపై సమగ్రంగా విచారించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బచ్చలకూర స్వరాజ్యం, బిఆర్‌ఎస్ మునగాల అధ్యక్షులు ఉడుం కృష్ణ, బిఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి ఎలిపి రామయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు సూరేపల్లి రమేష్, పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు సూరేపల్లి పిచ్చయ్య, కోటయ్య, వెంకన్న, బిక్షం, వెంకటేష్, గోపి పాల్గొన్నారు.

# బ్యాంక్ స్ట్రీట్ ఉపపోస్టు ఆఫీస్‌ను హెడ్ పోస్టు ఆఫీస్‌లో విలీనం చేయొద్దు

### పెన్షన్‌దారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని విలీనంను విరమించుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో కొనసాగుతున్న బ్యాంక్ స్ట్రీట్ ఉప పోస్టు ఆఫీస్‌ను హెడ్ పోస్టు ఆఫీస్‌లో విలీనం చేయాలనుకునే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని బిఆర్‌ఎస్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల లవకుశ డిమాండ్ చేశారు. పెన్షన్‌దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బ్యాంక్ స్ట్రీట్ ఉప తపాల కార్యాలయం ముందు పెన్షన్‌దారులతో కలిసి ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఈ పోస్టు కింద మూడువేల మంది పెన్షన్‌దారులతో పాటు 3వేల మంది ఖాతాదారులు ఉన్నారని, దీని హెడ్ పోస్టు ఆఫీస్‌లో విలీనం చేయడంతో వృద్ధులు, వికలాంగులు, పెన్షన్లు తీసుకునేందుకు చాల ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఇదే పోస్టు ఆఫీస్‌ని గతంలో చర్చి కంపౌండ్ ప్రాంతంగా నిర్వహించగా దూరభారం కావడంతో తాము అధికారులకు విన్నవించిన వెంటనే 25వ వార్డులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇటీవల పోస్టు ఆఫీస్ విజిట్‌కు వచ్చిన పిజిఎం ఇక్కడ పోస్టు ఆఫీస్‌లో ఖాతాలులేవని కేవలం పెన్షన్ల కోసమే కొనసాగుతుందని చెబుతూ దీన్ని హెడ్ పోస్టు ఆఫీస్‌లో విలీనం చేయాలని రిపోర్టు ఇవ్వడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్‌దారుల జీవితాలతో చెలగాటాలాడుతూ ఉప పోస్టు ఆఫీస్‌లను ఎత్తివేయాలని చూడటం దారుణమన్నారు. పేదలు, వృద్దులు, వికలాంగులను దృష్టిలో ఉంచుకుని బ్యాంక్ స్ట్రీట్ ఆఫీస్‌ను ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి లింగయ్య, బైరు వెంకన్న, వృద్దులు, వికలాంగులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను హతమార్చినందుకు గర్వంగా ఉంది

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** పరేషన్ మహాదేవ్‌లో ముగ్గురు ఉగ్రవాదులను భారత సైన్యం హతమార్చినందుకు అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కన్వీనర్ జక్కుల శ్రీనివాస్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పహాల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదు లు సులేమాన్, అఫ్ఘాన్, జీప్రాక్, అనే ముగ్గురిని ఇండియన్ భారత సైన్యం మట్టిలో కలిపిందని తెలిపారు. వారితోపాటు కీలక వ్యక్తిగా గతంలో ఆపరేషన్ సింధూరిలో ఇండియన్ ఆర్మీ అతన్ని చంపేశారని ఇది చాలా గర్వంగా ఉందని మన భారత సైన్యానికి, మన ప్రధానమంత్రి మోడీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. మోడీ ఆర్మీ త్రివిధ దళాలకు, స్వేచ్ఛ ఇచ్చి ప్లాన్ మీదే, అటాక్ మీదే, నాకు ఇన్ఫర్మేషన్ ఇయ్యండి అని చెప్పాడని అందుకు మన ఇండియన్ ఆర్మీ చాలా ముందుకు సాగుతుందన్నారు.


# రీల్

## ఉస్తాద్ భగత్ సింగ్ క్లైమాక్స్ పూర్తి



పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్‌హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా క్లైమాక్స్ చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు హరీష్ శంకర్ భావోద్వేగాలతో నిండిన, యాక్షన్ తో కూడిన అద్భుతమైన క్లైమాక్స్‌ను రూపొందించారు. ఈ చిత్రానికి నబకాంత మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. చిత్రీకరణ పూర్తయిన తర్వాత, నబకాంత మాస్టర్, ఫైటర్ల బృందంతో పవన్ కళ్యాణ్ ఫోటోలు దిగారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు.

## 'వార్ 2' పాట కోసం రంగంలోకి బ్రహ్మాస్త్ర 'కేసరియా' టీం



అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన 'బ్రహ్మాస్త్ర' సినిమాలోని కేసరియా అనే పాట దేశాన్ని ఊపేసింది. మరోసారి అయాన్ తన టీంను 'వార్ 2' కోసం రంగంలోకి దించారు. అయాన్ ప్రస్తుతం 'వార్ 2' పనుల్లో బిజీగా ఉన్నారు. ఇండియన్ ఐకానిక్ స్టార్లైన హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ కాంబోలో 'వార్ 2' సినిమాని యష్ రాజ్ ఫిల్మ్స్ భారీ ఎత్తున నిర్మించింది. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ ఇప్పటికే సోషల్ మీడియాలో సునామీని సృష్టిస్తోంది. హృతిక్, కియారా మీద చిత్రీకరించే ఈ డ్యుయేట్ పాట కోసం తన బ్లాక్ బస్టర్ కేసరియా సంగీత బృందాన్ని రంగంలోకి దించారు. 'వార్ 2'లోని ఈ యుగళ గీతం కోసం ప్రీతమ్, అరిజిత్ సింగ్, అమితాబ్ భట్టాచార్య మళ్ళీ ఒకే చోటకు చేరారు. త్వరలోనే ఈ పాటను సోషల్ మీడియాలో రిలీజ్ చేసి మరింత హైప్ పెంచాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. 'వార్ 2'లో హృతిక్, కియారా పాత్ర మధ్య ప్రేమను చూపించే అందమైన ట్రాక్‌గా ఈ పాటను కంపోజ్ చేస్తున్నారు. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కిన 'వార్ 2' ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషలలో థియేటర్లలో విడుదల కానుంది.

## గోవాలో నైంటీస్ తారల సందడి


### సౌత్ ఇండియా స్టార్స్ ఆత్మీయ కలయిక



పాత జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం అంటే ప్రతి ఒక్కరు గొప్ప అనుభూతిగా భావిస్తుంటారు. పదవ తరగతిలో కలిసి చదువుకున్న కొందరు మిత్రులు కలుసుకుంటుంటారు. ఇంటర్, డిగ్రీ, పీజీ ఇలా చాలా మంది తమ తమ స్నేహితులతో అపూర్వ కలయిక వేడుకలు జరుపుకుంటుంటారు. మామూలు క్లాస్ మెట్స్ కలిసినప్పుడే ఎంతో అందంగా గడిపే క్షణాలు జీవితాల్లో మరచిపోలేరు. అలాంటిది ఒక వెండితెరను ఏలిన హీరోలు, హీరోయిన్లు, దర్శకులు ఒకేచోట కలిస్తే ఆ వేడుక ఎంత సందడిగా మారిపోతుందో మనం ఊహించుకోవచ్చు. సరిగ్గా గోవాలో ఇదే జరిగింది. 90 నాటి సౌత్ ఇండియా స్టార్స్ అందరూ కాల్సియారు. హీరోలు, హీరోయిన్లు, దర్శకులు కలసి తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. యోగక్షమాల గురించి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ పిల్లలు ఏం చేస్తున్నారు? ప్రస్తుతం తాము ఏం చేస్తున్నాము వంటి అనేక విషయాలను మాట్లాడుకున్నారు. అందరూ కలసి తమకు ఇష్టమైన భోజనాలు చేశారు. అందరికీ కలకాలం గుర్తుండిపోయేలా డ్రెస్ కోడ్ తో ఫోటోలు దిగారు. ఆ ఫోటోలే ఇప్పుడు అందరిని ఆకట్టుకుంటున్నాయి. నైంటీస్ నాటి తారలు ఇప్పుడు ఎలా ఉన్నారో ఈ ఫోటోల్లో చూడొచ్చు. తెల్ల గడ్డలు, తెల్ల వెంట్రులతో వయసు మీద పడినా అందం మాత్రం చెక్కు చెదరకుండా ఉన్న హీరోయిన్‌లను చూడొచ్చు. అందరూ కలసి మనసు నిండా మాట్లాడుకున్నారు. అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకులను రంజింపజేసిన తారామనులు, నటులు, దర్శకులు ఈ ఫోటోల్లో ఉన్నారు.

ప్రముఖ దర్శకులు కె.ఎస్. రవికుమార్, శంకర్, లింగుసామి, మోహన్ రాజా, దర్శకుడు కొరియోగ్రాఫర్ ప్రభుదేవా ఉన్నారు. ప్రముఖ నటులు జగపతి బాబు , మేకా శ్రీకాంత్ లను ఇక్కడ చూడొచ్చు. 90వ దశకంలో వెండితెరను ఏలిన ప్రముఖ నటీమణులు సిమ్రాన్, మీనా, సంఘవి, మాళవిక, సంగీత, రీమా సేన్, మహేశ్వరి, శివరంజని, ఊహ, వంటి ప్రముఖ నటీమణులను కూడా ఈ ఫోటోల్లో ఉన్నారు. క్యాజువల్ డ్రెస్‌లో ఒక ఫోటో, వైట్ డ్రెస్ కోడ్‌తో ఒక ఫోటో ఇలా రకకరాలుగా ఫోటోలు దిగారు.

## రాజాసాబ్‌లో సంజయ్ లుక్





ప్రభాస్ హీరోగా మారుతీ దర్శకత్వంలో నిర్మిస్తున్న రాజాసాబ్ సినిమాలోని సంజయ్ దత్ పోస్టర్‌ను విడుదల చేశారు. బాలివుడు నటుడు సంజయ్ దత్ రాజాసాబ్ సినిమాలో విలన్‌గా నటిస్తున్నారు. సంజయ్ దత్ జన్మదినం సందర్భంగా ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. హరిహర వీరమల్లులో నటించిన నిధి అగర్వాల్ ఇందులో హీరోయిన్‌గా నటిస్తోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాలో మరో ముఖ్యమైన పాత్రలో మాళవిక మోహన్ నటిస్తోంది. కార్తీక్ పళని సినిమాటోగ్రాఫర్‌గా, రామ్ లక్ష్మ ణ్, సోలమన్ ఫైట్ మస్టర్లుగా పని చేస్తున్నారు. టిజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ సినిమాకు నిర్మాతలు.

## ఆగష్టు 2న 'కూలీ' ట్రైలర్





సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా నటించిహిన 'కూలీ' సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మించిన కూలీలో నాగార్జున పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా ట్రైలర్ ఆగస్ట్ 2న రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. రజనీకాంత్, నాగార్జున, అమీర్ ఖాన్, ఉపేంద్ర.. స్టార్స్ అందరూ పవర్ ఫుల్ లుక్స్‌లో కనిపించిన ట్రైలర్ ఎనౌన్స్ మెంట్ పోస్టర్ అదిరిపోయింది. డి.సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటేడ కూలీ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతీ హాసన్, మహేంద్రన్ వంటి ప్రముఖులు కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్లు, సాంగ్స్ సినిమాపై భారీ క్రేజ్‌ను నెలకొల్పాయి.

## థ్యాంక్యూ డియర్ ట్రైలర్ విడుదల



మహా లక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పప్పు బాలాజీ రెడ్డి నిర్మాతగా తోట శ్రీకాంత్ రచన దర్శకత్వంలో ఆగస్టు 1వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం థ్యాంక్యూ డియర్. ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖా నిరోషా ముఖ్యపాత్రలు పోషించగా వీర శంకర్ నాగ మహేష్ రవి ప్రకాష్ చత్రపతి శేఖర్ బలగం సుజాత సంక్రాంతి శ్రీనివాస్ నాయుడు తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి పి.ఎల్.కె రెడ్డి డిఓపిగా పని చేయగా సుభాష్ ఆనంద్ సంగీతాన్ని అందించారు. ఇప్పటికే ఈ చిత్రం నుండి ఒక పాటను రాకింగ్ స్టార్ మంచు మనోజ్ లాంచ్ చేయగా చిత్ర టీజర్‌ను సెన్సేషనల్ డైరెక్టర్ వివి వినాయక్ లాంచ్ చేశారు.

## 'కింగ్డమ్' ప్రీ రిలీజ్

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే, సత్యదేవ్, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న 'కింగ్డమ్' సినిమా ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. జూలై 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో 'కింగ్‌డమ్' ప్రీ రిలీజ్ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. అభిమానుల కోలాహలం నడుమ అతిరథ మహారథుల సమక్షంలో వైభవంగా జరిగిన ఈ వేడుకలో అనిరుధ్ సంగీత ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయితే ఈ వేడుకకు దర్శకుడు గౌతమ్ హాజరు కాలేదు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ '31న మిమ్మల్ని థియేటర్లలో కలవబోతున్నాం. మనసులో కొంచెం భయం ఉంది, అదే సమయంలో ఓ మంచి సినిమా చేశామనే సంతృప్తి ఉంది. 'కింగ్డమ్' అవుట్ పుట్ పట్ల టీమ్ అందరం సంతోషంగా ఉన్నాము. మీరు నాకు దేవుడిచ్చిన వరం. సినిమాలు హిట్ అయినా, ఫ్లాప్ అయినా అదే ప్రేమ, అదే నమ్మకం నాపై చూపిస్తున్నారు అని అభిమానులనుద్దేశించి అన్నారు.



కథానాయిక భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ.. 31న విడుదల కానున్న 'కింగ్డమ్' కోసం మీతో పాటు నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. గౌతమ్ గారు ఈ సినిమాని అద్భుతంగా రూపొందించారు అని తెలిపారు.

## 'తెలుసు కదా' నుంచి మల్లికా గంధ పాట విడుదల



స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. థమన్ ఎస్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. మేకర్స్ ఫస్ట్ సింగిల్ మల్లికా గంధను లాంచ్ చేయడం ద్వారా మ్యూజిక్ ప్రమోషన్‌లను ప్రారంభించారు. మల్లికా గంధ లవ్ అండ్ మ్యూజికల్ మ్యాజిక్ తో మనసును తాకే అద్భుతమైన పాట. ట్యూన్, విజువల్స్ ప్రతీదీ ప్రేమ భావోద్వేగాలను బ్యూటీఫుల్ గా ప్రజెంట్ చేస్తోంది. థమన్ కంపోజిషన్ బ్రిలియంట్ గా వుంది. తంబురా, ఫ్లూట్ లాంటి ట్రెడిషనల్ వాయిద్యాల్ని మోడరన్ టచ్ లో వినిపించడం అదిరిపోయింది.

## సినారె ఫోటో లేదని ఫిలిం ఛాంబర్‌లో పాశం యాదగిరి నిరసన



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలుగు ఫిలిం ఛాంబర్ లో పాశం యాదగిరి నాయకత్వంలో తెలంగాణ వాదులు ఆందోళన చేశారు. తెలుగు ఫిలిం నిర్మాతల మండలిలో అనేక మంది సినిమా ప్రముఖుల ఫోటోలను పెట్టినప్పుడు అనేక పాటలు రాసిన సి.నారాయణ రెడ్డి ఫోటో లేదని తెలంగాణ వాదులు నిరసనకు దిగారు. అంతేకాకుండా ప్రముఖ నటుడు పైడి జయరాజ్ ఫోటో చాలా చిన్నగా ఉందని వాగ్వివాదానికి దిగారు. నిర్మాతల మండలి కార్యాలయం లోపలి చొచ్చుకుని పోయేందుకు పాశం యాదగిరి మరికొంతమంది ప్రయత్నించారు. దీంతో నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్‌తో గొడవకు దిగారు. ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఆంధ్ర గో బ్యాక్ అంటూ అక్కడున్న కార్యకర్తలు నినాదాలు చేశారు. ఛాంబర్‌లో జరుగుతున్న గొడవ సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు రంగంలో దిగారు. పోలీస్‌స్టేషన్‌కు సిఐ రమ్మంటున్నారని కానిస్టేబుల్ వచ్చి చెప్పడంతో పాశం యాదగిరి కానిస్టేబుల్ మీద తిరగబడ్డారు. ఏం తప్పు చేశామని పోలీస్ స్టేషన్‌కు రావాలని, సీఐనే ఇక్కడికి రమ్మను అంటూ కానిస్టేబుల్‌పై పాశం యాదగిరి కేకలు పెట్టారు. దీంతో సిఐకు పోలీసులు ఫోన్ చేసి చెప్పడంతో సిఐ సంతోష్ రంగంలో దిగారు. పాశం యాదగిరితో పాటు అక్కడున్న వారిని సిఐ శాంతిప చేశారు. గొడవ సద్దుమణిగేలా చేశారు. సిఐ రంగప్రవేశంతో ఫిలిం ఛాంబర్‌లో గొడవ సద్దు మణిగింది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణ రెడ్డి జయంతి కార్యక్రమం నిర్మాతల మండలి హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాతల మండలి కార్యాలయంలో సి.నారాయణ రెడ్డి ఫోటో లేదని గొడవకు దిగారు.

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గొడవలు సృటించుకుంటే సమస్యలు పరిస్కారం కావని అన్నారు. సామరస్యంగా మాట్లాడి పరిష్కరించుకోవాలని చెప్పారు.

## క్రస్ట్ గేట్లు ఓపెన్

(మొదటి పేజీ తరువాయి)

తీస్తాం అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల లోని 22లక్షల ఎకరాలకు సాగునీరుతుందని చెప్పారు. జవహర్ కుడి కాలువ ద్వారా 11.74 లక్షల ఎకరాలు, లాల్ బహదూర్ ఎడమ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 6లక్షల 50వేల ఎకరాలకు సాగు నీరు అందుతుండగా, నల్లగొండ జిల్లాలో 1,50,000 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో రెండు లక్షల 30వేల ఎకరాలు, ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరందుతున్నదని తెలిపారు. 2005 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు స్వర్ణోత్సవాలు. నిర్వహించడం జరిగిందని చెప్పారు. తను ఆరుసార్లు శాసనసభ్యుడిగా,



ఒకసారి పార్లమెంటు సభ్యునిగా ఉంటూ ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టు మంత్రిగా నాగార్జున సాగర్ ద్వారా నీటిని వదలడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత గత వానాకాలం, యాసంగి, వానాకాలం కలిసి రెండు లక్షల 81వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని. పండించడం జరిగిందని, ఇందులో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ పాత్ర ముఖ్యమని అన్నారు.సాగునీటితో పాటు నాగార్జునసాగర్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా గడచిన 4 రోజులుగా 30000 క్యూసెక్కుల నీటినితో పూర్తిస్థాయిలో, 700 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశామన్నారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర పౌరసరఫరాల ప్రిన్సిపల్ సెక్రెటరీ డిఎస్ చౌహాన్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పి శరత్ చంద్ర పవర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ఈ మల్లికార్జునరావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. కాగా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ద్వారా మంత్రులు 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలిన తర్వాత అధికారులు 14 గేట్ల ద్వారా 10932 క్యూసెక్కుల నీరు వదిలారు. మంగళవారం సాయంత్రం వరకు 20 గేట్ల ద్వారా 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలనున్నట్లు ప్రాజక్ట్ అధికారులు తెలిపారు. అనంతరం మంత్రులు, అధికారులు నాగార్జున సాగర్ ఎడమ కాలువ ను సందర్శించి కృష్ణ జలాలకు పుష్పాభిషేకం చేశారు.



## బలోపేతమవుదాం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ప్రశ్నిస్తుందని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సిపిఐ అనేక సమస్యలపై రాజీ లేని పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఉందని, నాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపిన మహోత్తరమైన చరిత్ర జిల్లాకే దక్కిందన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తి చేయకుంటే జిల్లాలో దిగ్బంధం చేసేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దోపిడీదారులకు, బడా బాబులకు దారాదత్తం చేస్తున్నారని, కార్మిక హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. దేశంలో కమ్యూనిస్టులకు మంచి రోజులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు మాట్లాడుతూ జిల్లాలోని బునాదిగాని, పిల్లాయిపల్లి, గంధమల్ల రిజర్వాయర్ పూర్తయ్యే వరకు ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఫార్మా పరిశ్రమలతో వెలువడుతున్న కాలుష్యం వల్ల చౌటుప్పల్ ప్రాంతంలో ప్రజలు అనారోగ్యాలకు గురై ఇబ్బందులు పడుతున్నారని, ఫార్మా కంపెనీలు రాకుండా అడ్డుకోవలసిన అవసరం ఉందన్నారు.

మహాసభకు జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, బండి జంగమ్మ, చేడే చంద్రయ్య, అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా, మహసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, ఎండిఇమ్రాన్, బచ్చనగోని గాలయ్య, ఉప్పల ముత్యాలు, చెక్క వెంకటేష్, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, ప్రజానాట్యమండలి రాష్ట్రఅధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య, స్వాతంత్ర సమరయోధులు బత్తిని యాదగిరి, వలిగొండ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 'మా జోక్యం తథ్యం'

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పిటిషన్‌దార్ల తరపున తమ వాదనలు వినిపిస్తూ, ఎన్నికల సంఘం ఆగస్టు 1న ప్రచురించిన ముసాయిదా జాబితా నుండి ప్రజలను అధికసంఖ్యలో మినహాయించారని, వారు కీలకమైన వారి ఓటు హక్కును కోల్పోతారని ధర్మాసనానికి విన్నవించారు. ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీచేసిన ఒక ప్రకటనలో ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియ సమయంలో 65లక్షల మంది వారి ఎన్యుమరేషన్‌ను సమర్పించలేదని వెల్లడించిందన్నారు. ఎందుకంటే వారు చనిపోయారని, వేరే చోటికి వెళ్లిపోయారని ఎన్నికల సంఘం జారీచేసిన ప్రకటనలో తెలియజేశారని న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ ధర్మాసనానికి విన్నవించారు. ఈ వ్యక్తులు జాబితాలో చేరడానికి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన సమర్పించారు. జస్టిస్ సూర్యకాంత్ దీనిపై స్పందిస్తూ భారత ఎన్నికల సంఘం ఒక రాజ్యాంగ సంస్థగా ఉన్నది. అది చట్టప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది. అది ఏమైన తప్పు చేసినట్లయితే మీరు ఆ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకురావొచ్చు. మేం దానిని వింటాం' అని తెలియజేశారు. జస్టిస్ బాగ్చి ప్రశాంత్‌భూషణ్‌తో మాట్లాడుతూ '65లక్షల మంది ఓటర్లు ముసాయిదా జాబితాలో ఉండరని మీ ఆందోళన. ఇప్పుడు భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను సవరిస్తామని కోరుతోంది. మేము ఒక న్యాయసంస్థగా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నాం. ఏమైనా సామూహిక మినహాయింపు ఉంటే మేం తక్షణమే జోక్యం చేసుకుంటాం. చనిపోయినవారి గురించి, బతికి ఉన్నవారి గురించి మీరు 15మంది (పిటిషనర్లు) కోర్టు దృష్టికి తీసుకురావచ్చు' అని చెప్పారు. ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా తరపున ప్రాతినిధ్యం వహించిన కపిల్ సిబల్ మాట్లాడుతూ ఈ 65లక్షల మంది ఎవరన్న విషయం ఎన్నికల సంఘానికి తెలుసు. వారు ఎవరనే విషయమై వారి పేర్లను ముసాయిదా జాబితాలో ప్రస్తావించినట్లయితే ఏ ఒక్కరికీ ఈ సమస్యే వచ్చేది కాదన్నారు. ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేదీ మాట్లాడుతూ ముసాయిదా జాబితా ప్రచురణ తర్వాత కూడా ఎన్యూమరేషన్ ఫారాలను దాఖలు చేయవచ్చని చెప్పారు. ఆగస్టు 8లోగా లిఖితపూర్వక వాదనలు దాఖలు చేయాలని ధర్మాసనం పిటిషనర్లను, ఎన్నికల సంఘాన్ని కోరింది.

## వరంగల్‌లో కలపండి

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని, హన్మకొండ జిల్లాను రద్దుచేసి వరంగల్ జిల్లాలో విలీనం చేయాలని సాధారణ ప్రజలు, మేధావులు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ వస్తోంది.

**నగర విభజనతో అభివృద్ధికి విఘాతం**

ఎవరో కొందరు రాజకీయ అవకాశవాదులు, స్వార్థపరులు జిల్లా ముక్కలైతే పదవులు వస్తాయని కోరుకోగానే వరంగల్ నగరాన్ని రెండు ముక్కలుగా విభజించి అభివృద్ధికి విఘాతం కలిగించారని పలువురు ఆరోపిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని రాజకీయ అవకాశవాదులు తమ పదవుల కోసం చేసే కుట్రకోణాన్ని పక్కకు పెట్టి హనుమకొండ జిల్లాను రద్దుచేసి వరంగల్ మహా నగరాన్ని ఒకే జిల్లాగా ఉంచడం సరియైనదంటున్నారు. గీసుకొండ మండలంలో టెక్స్ టైల్ పార్క్, మామునూరు ఎయిర్ పోర్ట్, మడికొండలో ఐటీ పార్కులు, రైల్వే వాగన్ కోచ్ ఫ్యాక్టరీలు, హన్మకొండలో ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ లు ఇలా మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని, కాబట్టి వరంగల్, హన్మకొండ, కాజీపేట మూడు ప్రాంతాలను ఒకే జిల్లాలో ఉంచాలని కోరుతున్నారు.

**ఆరు ముక్కలు చేయడంపై అప్పట్లోనే అసంతృప్తి**

వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేయడంపై అప్పట్లోనే చరిత్రకారులు, తెలంగాణ ఉద్యమకారుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ప్రధానంగా వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల విభజనపై ప్రజల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. వరంగల్ రూరల్ జిల్లాకు కనీసం పరిపాలన సాగించేందుకు హెడ్‌క్వార్టర్ లేకుండాపోయింది. పాలనాపరమైన కార్యకలాపాలన్నిటికీ ప్రజలు హనుమకొండకు రావాల్సి వస్తోంది. గత ప్రభుత్వ నిర్వాకంతోనే చరిత్రాత్మక ఏకశిలా నగరం రెండు ముక్కలైందనే వాదన ఉంది.

**మద్దతుగా పార్టీలు, ప్రజాసంఘాల ఉద్యమాలు**

వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేయడంపై మొదటి నుంచీ కాంగ్రెస్, బిజెపి, సిపిఐ, సిపిఎం, న్యూ డెమోక్రసీతోపాటు ఓ వర్గం, ఇతర సంఘాలు వ్యతిరేకిస్తూ వచ్చాయి. జిల్లాల విభజన గత ప్రభుత్వంలోనే జరిగినందున ఒక్క బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు మాత్రమే తమ అభిప్రాయాన్ని బయటికి చెప్పలేక పోతున్నారు. కాగా మొదటి నుండి కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ఈ రెండు జిల్లాల విలీనానికి మద్దతు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, తెలంగాణవాదులు, వివిధ సంఘాల నేతృత్వంలో రెండు వారాలుగా ఉద్యమాన్ని మొదలు పెట్టారు. రెండు జిల్లాల్లోని అన్ని ప్రాంతాల ప్రజల మద్దతును కూడా కట్టి త్వరలోనే సిఎం రేవంత్ రెడ్డిని కలుస్తామని వారు చెబుతున్నారు. ప్రధానంగా వీరు హనుమకొండ జిల్లాను రద్దు చేసి వరంగల్‌లో కలపాలని, గ్రేటర్ వరంగల్ నగరాన్ని విడగొట్టరాదని కోరుతున్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాలు ట్రైసిటీస్‌గా ఒకే జిల్లా పరిధిలో ఉంటే అభివృద్ధికి ఎక్కువ అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com